శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

## అగ్రశ్రేణి మావోయిస్టు పాపారావు సహ 17 మంది లొంగుబాటు

04

- ఎకె– 47,ఇతర గ్రెనేడ్లు,ఆయుధాలు అప్పగింత
- ఛత్తీస్‌గఢ్‌లో ఇక క్రియాశీల సీనియర్ నేతలు లేరు
- ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ ప్రకటన
- ప్రభుత్వం విధించిన గడువు ఇక ఐదు రోజులే

సంపుటి 28, సంచిక: 270 | బుధవారం | 25-03-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## దాడులు, ప్రతిదాడులతో

# హోరెత్తిన పశ్చిమాసియా

- వేలాదిగా గల్ఫ్‌కు తరలివస్తున్న అమెరికా సైన్యం
- ఖర్గ్ ద్వీపం స్వాధీనానికి ట్రంప్ సన్నాహాలు!
- ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్ అతలాకుతలం
- గల్ఫ్‌దేశాలపై కొనసాగుతున్న దాడులు
- ఇరాక్‌లో 14 డ్రోన్లు కూల్చేసిన బ్రిటన్ సైనికులు
- దక్షిణ లెబనాన్‌లో అధికభూభాగం ఐడిఎఫ్ స్వాధీనం
- మళ్ళీ 100 డాలర్లకు చేరిన క్రూడ్ ఆయిల్

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ వాద ప్రతివాదనల మధ్య పశ్చిమాసియాలో 25వ రోజు యుద్ధం దాడులు, ప్రతిదాడులతో హోరెత్తింది. మరోవైపు భూ,జల మార్గాలలో పోరాటం చేయగల వేలాది మంది అమెరికా సైనికులు గల్ఫ్ ప్రాంతానికి తరలివస్తున్నారు. ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికే వేలాదిగా అమెరికా సైనికులు తరలివస్తున్నారని వందతులు భారీగా వ్యాపించాయి. అమెరికా సైనికులు భూతల దాడులకు సిద్ధమైతే గల్ఫ్ ప్రాంతాన్ని బాంబులతో నాశనం చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ చేసిన ప్రకటనతో తగ్గిన చమురు ధరలు మళ్ళీ భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధ ర 100 డాలర్లకు చేరుకుంది. యుద్ధం మొదలైనప్పటినుండీ ఈ ధర 40 శాతం మేరకు పెరిగింది. ఇక ఇరాన్ చేసిన భారీసంఖ్యలో క్షిపణుల వర్షం కురిపించడంతో తరువాయి 2లో

## హోర్ముజ్ సమస్యపై మోదీకి ట్రంప్ ఫోన్



### పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా సమస్యపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్‌లో సంభాషించారు. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు మరో ఐదు తరువాయి 2లో



# గుడిసెలు తొలగించాలని చూస్తే ప్రతిఘటిస్తాం

## భూదాన్ భూములు పేదలకు దక్కాల్సిందే : సిపిఐ డిమాండ్
## ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా

- పేదలకు ఇళ్లస్థలాలు దక్కేవరకు సిపిఐ విశ్రమించబోదు : కూనంనేని సాంబశివరావు
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

పేదలకు చెందాల్సిన భూదాన్, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు తక్షణమే పట్టాలను ఇవ్వడంతో పాటు ఆస్థలాల్లో ఇళ్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా స్పందించకుండా గుడిసెలను తొలగించాలని చూసినా, ఈ భూములను పెద్దలకు ధారాదత్తం చేయాలని ప్రయత్నించినా ప్రతిఘటిస్తామని తరువాయి 12లో

## కేసులకు అదరం, బెదరం

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణ రెడ్డి తన వందలాది ఎకరాల సొంత భూమిని పేదలకు పంపిణీ చేసిన స్ఫూర్తితో భూదాన ఉద్యమం ద్వారా సేకరించిన లక్షలాది ఎకరాల ఆ భూములు పేదలకు దక్కాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం పేదల గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తే సిపిఐ సహించబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కేసులు పెట్టినా, లాఠీ ఛార్జీలు చేసినా అదిరేది బెదిరేది లేదన్నారు. సిపిఐ అధ్వర్యంలో గుడిసెలు వేయకపోతే ఇప్పటికే మరిన్ని ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యేవన్నారు. ప్రభుత్వ, భూదాన భూములలో గుడిసెలు వేసుకుంటే తొలగిస్తున్న ప్రభుత్వం, అదే బడా రాజకీయ నాయకులు, కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ, భూదాన, చెరువు శిఖం తరువాయి 12లో

## 'సాదా బైనామా'లకు

# త్వరలో మోక్షం



- కొనుగోలుదారులు అఫిడవిట్ ఇస్తే చాలు
- జిఒ 76తో లబ్ధిపొందనున్న 9 లక్షల మంది రైతులు
- ఆధార్ మాదిరిగానే 'భూధార్'
- శాసనమండలిలో ప్రకటించిన మంత్రి పొగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తరువాయి 2లో



# ఒకే నమూనా.. ఒకే నకల్

బడ్జెట్‌లో కొత్తదనమేమీ లేదు : కూనంనేని సాంబశివరావు

## ఎల్.బి నగర్ - హయత్ నగర్ మధ్య

# 'డబుల్ డెక్కర్' ఫ్లైఓవర్



- ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డిపిఆర్ తయారు చేస్తాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్‌బి నగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డిపిఆర్ తయారు చేస్తారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు కె.నారాయణ రెడ్డి, మనోహర్ రెడ్డి, తరువాయి 2లో

## గత బిఆర్‌ఎస్ పాలనలో

# ఆర్థిక, పరిపాలన విధ్వంసం

- మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా రాణించొద్దనేదే ఆ పార్టీ ఆలోచన
- 2025–26లో రూ.93,194 కోట్లు అసలు, వడ్డీ అప్పు చెల్లించాం

ప్రజాపక్షం/హైదరాబాద్



తమ రెండేళ్ల పాలనలో రూ.1,59,165 కోట్ల అప్పులు తీసుకురాగా, ఇందులో గత ప్రభుత్వం చేసిన అప్పులు,వడ్డీ మొత్తంగా రూ.1,85,090 కోట్లను చెల్లించామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.7 కోట్ల అప్పు చెల్లించాల్సి ఉంటే, 2024 –25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ 66,545 కోట్లు అసలు,వడ్డీ తరువాయి 2లో



84వ జయంతి
సురవరం సుధాకర్ రెడ్డి
స్వీయకథ
ప్రజలతో నా ప్రయాణం
ఆవిష్కరణ

స్మారకోపన్యాసం : కామ్రేడ్ డి. రాజా Ex. M.P. ప్రధాన కార్యదర్శి, సిపిఐ
గౌరవ అతిథి : జస్టిస్ శ్రీ బి. సుదర్శన్ రెడ్డి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి

అధ్యక్షత : కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు M.L.A. రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ తెలంగాణ
పుస్తక పరిచయం : కామ్రేడ్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్
ఆత్మీయ అతిథులు : కామ్రేడ్ కె. ప్రతాపరెడ్డి సీనియర్ కమ్యూనిస్టు నాయకులు
కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి Ex. M.L.A. జాతీయ కార్యదర్శి, సిపిఐ

3:30 గం॥లకు 25-03-2026 | సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.)
తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్

# 2029 ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్

- చట్టం సవరణకు మోదీ ప్రభుత్వం కసరత్తు
- ప్రతిపక్షాలతో చర్చలు, త్వరలో పార్లమెంట్‌కు బిల్లు
- అఖిలపక్ష సమావేశానికి ప్రతిపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ :** పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లను రిజర్వు చేయటానికి ఉద్దేశించిన 'మహిళా రిజర్వేషన్ చట్టం', 2023ను 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే అమలులోకి తెచ్చేందుకు నరేంద్రమోదీ ప్రభు త్వం ఇప్పుడు ఆత్రుత ప్రదర్శిస్తోంది. 2011 జనాభా లెక్కలు ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనకు సవరణ బిల్లు తెచ్చే పనిలో నిమగ్నమై ఉంది. ఈ విషయమై కొద్దికాలంగా ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతోంది. బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చట్ట సవరణ బిల్లు ను, రాజ్యాంగ సవరణ బి ల్లును ఆమోదించి, పార్లమెంటు ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2న ముగిసే లోపు సభలో ప్రవేశపెడతారని తెలుస్తోంది. లేదా ప్రత్యేక సమావేశాన్ని పిలుస్తారు. ఇదిలావుండగా, ఈ విషయంలో ప్రభుత్వ ప్రతిపాదనలు చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం పిలవాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లేఖకు కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లిఖార్జున తరువాయి 2లో

## ఇ– కార్ కేసు... త్వరలో

### కెటిఆర్, అరవింద్‌లకు

# సమన్లు





### ఎసిబి చార్జి షీట్ నేపథ్యంలో ప్రారంభం కానున్న కోర్టు ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా–ఇ కార్ రేస్ కేసులో నిందితులుగా ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుతో పాటు ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలకు ఎసిబి కోర్టు త్వరలో సమన్లు జారీ చేయనుంది. ఈ కేసులో ఎసిబి అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేసిన నేపథ్యంలో కోర్టు తన ప్రక్రియ ప్రారంభించనుంది. 2024 డిసెంబర్‌లో నమోదు అయిన ఈ కేసు, ఇప్పుడు న్యాయపరమైన కీలక దశలోకి ప్రవేశించింది. ఫార్ములా–ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించే తరువాయి 12లో



## ఇరాన్–అమెరికా చర్చల ఆతిథ్యానికి పాక్ సిద్ధం

### ఇస్లామాబాద్‌లో ఈవారంలోనే కీలక సమావేశం!

### ఇరాన్‌ను ఒప్పించేందుకు ముమ్మర యత్నాలు

**దుబాయ్ :** ఇరాన్‌పై దాడులకు ఐదు రోజులు విరామం ఇస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత పాకిస్తాన్ మధ్యవర్తిత్వ పాత్ర ప్రముఖంగా వార్తల్లోకి వచ్చింది. పాకిస్తాన్‌లో చర్చలకు అమెరికా కూడా సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేసింది. ఇంతకుముందు ఇరాన్–అమెరికా మధ్య టర్కీ మధ్యవర్తి పాత్ర నిర్వహించింది. ఇప్పుడు టర్కీతోపాటు పాకిస్తాన్ కూడా మధ్యవర్తిగా క్రియాశీల పాత్ర పోషిస్తుందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ కీలక చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. అర్థవంతమైన, సంపూర్ణ పరిష్కారానికి వీలైన నిర్మాణాత్మక చర్చలకు వీలు కల్పించేందుకు తాము సంతోషంతో సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పాకిస్తాన్ అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం ముగ్గురు పాకిస్తానీ అధికారులు, ఒక ఈజిప్టు అధికారి, గల్ఫ్ దౌత్యవేత్త ఒకరు ఇరాన్‌ను బుజ్జగించి ఈ చర్చలకు ఒప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీలైతే ఈ వారంలోనే ఈ సమావేశం జరిగే అవకాశాలు ఉండవచ్చు. ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కార్యాలయం ఈ వారంలోనే చర్చల వార్తలపై స్పందిస్తూ, అనేక దేశాల విదేశీ మంత్రులతో యుద్ధం గురించి సంభాషణలు చేస్తున్నట్లు పేర్కొంది. అమెరికాతో ఇరాన్ చర్చల నకిలీ వార్త అనీ, మార్కెట్లను తారుమారు చేసేందుకే ట్రంప్ ఈ వ్యవహారం నడుపుతున్నారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఎక్స్‌వేదికగా ప్రకటించిన నేపథ్యంలో ఈ సన్నాహాలు జరగడం ఒక ముఖ్య విశేషం. ఈ వారంలోనే పాకిస్తాన్‌లో అమెరికాకు చెందిన పశ్చిమాసియా అధికార ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఇరాన్ ప్రతినిధులతో సమావేశమవుతారని వార్తలు రావడంతో ఇప్పుడు అందరూ అటువైపే చూస్తున్నారు. ఒకవేళ ఇదే వార్త నిజమైతే ఆర్థిక సమస్యల్లో ఉన్న పాకిస్తాన్ ప్రస్తుతం పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌తో పీకలోతు వివాదంలో కూరుకుని ఉన్న తరుణంలో ప్రపంచానికి ఇది దిగ్భ్రాంతికరమే. ఈ వార్తను పాకిస్తాన్,ఇరాన్,అమెరికా గానీ ధృవీకరించలేదు. కాని అనేక వార్తాసంస్థలు ఈ వార్తకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చాయి స్టీవ్ విట్‌కాఫ్,జారెడ్ కుష్నెర్,అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ముగ్గురూ ఇరాన్ అధికారులతో ఇస్లామాబాద్‌లో సమావేశం జరుపుతారని ఛానల్–12 పేర్కొంది. ఇరాన్‌కు టర్కీ ద్వారా ట్రంప్ కొన్ని ప్రతిపాదనలు పంపించారన్న వార్త ఒకటి బయటకు పొక్కింది. మరోవైపు అసలు చర్చలు జరిగాయా? లేదా? అనే గందరగోళం ప్రపంచాన్ని పీడిస్తోంది.

# ఇరాన్‌తో అనిశ్చితంగా మారిన చర్చలు : వైట్‌హౌస్

### ఈ ఊహాగానాలు తుది నిర్ణయం కాదు

**వాషింగ్టన్ :** ఇరాన్‌తో చర్చల ప్రణాళిక అనిశ్చితంగా మారిందని వైట్‌హౌస్ ప్రకటించింది. చర్చలు జరుగుతున్నాయని ఒకవైపు, అవన్నీ బూటకపు వార్తలని మరొక వైపు వాద ప్రతివాదాలు జరుగుతున్న తరుణంలో మరో వైపు పశ్చిమాసియాలో శత్రువర్గాల మధ్య యుద్ధ దాడులు యథాతథంగా కొనసాగుతతున్నాయి. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఈ వారాంతం వరకూ చర్చలు జరిగే అవకాశం ఉందని ట్రంప్ తొలుత ప్రకటించారు. కానీ ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ అందుకు పూర్తిభిన్నంగా ప్రతిస్పందించారు. ఈ విధంగా ప్రత్యర్థి దేశాల నాయకులు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేసిన పూర్వరంగంలో వైట్‌హౌస్ నుండి మంగళవారం ఈ తాజా ప్రకటన వెలువడింది. ఇరాన్‌వ్యాప్తంగా విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేసే దాడులను ఐదు రోజులపాటు వాయిదా వేశామని, ఆ దేశ ప్రతినిధులతో వైట్‌హౌస్ అగ్రశ్రేణి రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్,జారెడ్ కుష్నెర్ ఇరువురూ సోమవారం సాయంత్రం వరకూ సంప్రదింపులు జరిపారని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌లో అత్యంత గౌరవనీయుడైన వ్యక్తి, నాయకుడుగా పరిణించే వ్యక్తితోనే తాము సంభాషణలు జరిపామని కూడా ట్రంప్ చెప్పారు. చివరకు ఈ విశ్వసనీయమైన వ్యక్తి ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ అని అమెరికా పత్రికలు స్పష్టం చేశాయి. ఆ తర్వాత ఘాలిబాఫ్ ఎక్స్ ఖాతా ద్వారా ''అసలు అమెరికాతో ఎలాంటి చర్చలూ జరగలేదు, అది కేవలం నకిలీ వార్త'' అని ఒక పోస్టింగ్ నమోదైంది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ తాజా ప్రకటన చేస్తూ, చర్చల ప్రణాళిక అనిశ్చితంగా ఉందని, పరస్పర విరుద్ధ



మైన ప్రకటనలు వెలువడుతున్నందువల్ల ఈ ఊహాగానాలు తుది నిర్ణయం కాదని స్పష్టం చేసింది. ఐతే అమెరికా టెలివిజన్–బ్రాడ్‌కాస్టర్ వార్తాసంస్థ 'సిబిఎస్' సమాచారం ప్రకారం, చర్చల సన్నాహాలకు ముందుగా అమెరికా నుండి ఇరాన్ అధికారులకు మధ్యవర్తుల ద్వారా కొన్ని అంశాలు అందాయని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. గల్ఫ్‌లో తమ భాగస్వామ్య మిత్రులను దృష్టిలో పెట్టుకుని, ప్రపంచ మార్కెట్లను పునరుద్ధరించేందుకు చర్చలు జరుపుతున్నట్లు ట్రంప్ చెప్పిన విషయం ఈ సదర్భంగా గమనార్హం. ఐతే ట్రంప్‌పై పెరుగుతున్న ఒత్తిడి, ఊహకుమించి పెరుగుతున్న యుద్ధం ఖర్చు, తక్షణ ప్రాతిపదికపై పెంటగాన్‌కు లక్షల డాలర్లు సమకూర్చవలసిరావడం, ఇజ్రాయెల్ రెచ్చగొట్టి ట్రంప్‌ను యుద్ధంలోకి ఈడ్చిందన్న వదంతులు, దేశంలో ప్రజా వ్యతిరేకత వంటి అనేక పరిణామాలు ఇరాన్‌కు ఈ సందేశం పంపేలా ట్రంప్‌ను పురిగొల్పాయా? అనే అంశానిన కూడా విశ్లేషకులు పరిశీలిస్తున్నారు.

**అసలు ఇరాన్ స్పీకర్ ఏం చెప్పారు?**

ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ ప్రముఖంగా వార్తల్లోకి వచ్చారు. అమెరికా అధికారులతో ఎలాంటి చర్చలూ జరగలేదని ఆయన ప్రకటించారు. అమెరికా అగ్ర రాయబారులు స్టీవ్‌విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఇద్దరూ ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్‌తో గడచిన గంట లేదా అంతకంటే ఎక్కువ సమయం నుండీ చర్చలు జరుపుతున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు వార్తాసంస్థలు తాజా సమాచారాన్ని ఊదరగొడుతున్న తరుణంలో ఆయన పైవిధంగా స్పందించారు. ఆయన ఎక్స్ ఖాతాలో పైవిధంగా సోమవారం రాత్రి ఒక పోస్టింగ్ నమోదైంది. అంతర్జాతీయ చమురు మార్కెట్లను, స్టాక్‌మార్కెట్లను తారుమారుచేయడం కోసం ఈ నకిలీ వార్తలను ఉపయోగించారని, అంతేకాకుండా దురాక్రమణ దారులు తీవ్ర పశ్చాత్తాపం చెందేవిధంగా శిక్ష విధించాలని ఇరాన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారని కూడా స్పీకర్ ఎక్స్ ఖాతాలో పోస్టింగ్ నమోదైంది. అమెరికా సైనిక స్థావరాలతోపాటు సైన్యానికి బడ్జెట్ కేటాయింపులకు నిధులు సమకూర్చే ఆర్థిక సంస్థలు కూడా ఇరాన్ దాడులకు లక్ష్యాలుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

**చర్చల గురించి మాకు తెలుసు : స్టార్‌మర్**

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్నాయన్న విషయం తమకు తెలుసునని బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ చెప్పారు. వెస్ట్‌మినిస్టర్‌లో కమిటీ ఎదుట హాజరైన స్టార్‌మర్ సోమవారం అక్కడ మాట్లాడుతూ, ఈ చర్చల గురించి తమకు ముందే తెలుసునన్నారు. వీలైనంత తొందరగా దాడులు ఆగిపోవాలని తమ దేశం కోరుకుంటున్నదని, సేనలు వెనక్కు మళ్ళాలని తాము ఆశిస్తున్నామన్నారు. అందువల్ల చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ ద్వారా వచ్చిన సమాచారం తమకు సంతోషం కలిగించిందన్నారు. చర్చల ద్వారా కుదిరే ఒప్పందంలో ఇరాన్‌పై అత్యంత కఠినమైన షరతులు విధించాల్సి ఉంటుందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధానికి బ్రిటన్ మొదటినుండీ దూరంగా ఉంది. ఈ వివాదంలో చిక్కుకుని ఆర్థిక సంక్షోభాన్ని కొని తెచ్చుకోదల్చుకో లేమని, ఉక్రేన్ నుండి తమ దృష్టిని పక్కకు మరల్చలేమని ఆయన అన్నారు.

## నేల కూలిన కొలంబియా సైనిక విమానం : 66 మంది దుర్మరణం

**బోగోటా :** కొలంబియా సైనిక విమానం కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 66 మంది మరణించారు. మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. విమానంలో మొత్తం 121 మంది ప్రయాణిస్తుండగా వీరిలో అత్యధిక సంఖ్యాకులు సైనికులే. కొలంబియా దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన, సైనికుల మరణాలు దేశానికి తీరని నష్టాన్ని కలగజేస్తాయని అన్నారు. మృతుల కుటుంబీకులకు తీవ్ర సంతాపం తెలియజేశారు.ఒకవైపు యుద్ధం, మరోవైపు అమెరికాతో ఉద్రిక్తతలమధ్య జరిగిన ఈ పరిణామంలో కుట్రకోణంపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. విమానం తీసుకున్న కొద్ది సేపటికే కొలంబియా దక్షిణ ప్రాంతంలో కుప్పకూలిపోయింది. కొలంబియా రక్షణమంత్రి పెడ్రో సాంఛెజ్ మాట్లాడుతూ, దేశ దక్షిణ అమెజాన్ ప్రాంతం పెరూ సరిహద్దుల్లో ఉన్న ప్యూర్టో లెగిజామో నుండి లాక్‌హీడ్ మార్టిన్ హెర్క్యులస్ సి–130 విమానం తీసుకుంటున్న సమయంలో ప్రమాద సమస్య మొదలైందని చెప్పారు. వెంటనే నేలకూలిందన్నారు. ఒక పొలంలో విమానం కుప్పకూలి



నల్లని దట్టమైన పొగలు పైకి లేస్తున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ప్రమాద ప్రాంతం నుండి 77 మంది సహాయ బృందాలు స్థానికుల మోటారు సైకిళ్ళపై ఆసుపత్రులకు తరలించారు. కొలంబియా వైమానిక దళ కమాండర్ కార్లోస్ ఫెర్నాండో సిల్వా మాట్లాడుతూ, విమానం తీసుకున్న తర్వాత రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించి పంట పొలంలో కుప్పకూలిపోయిందన్న విషయం తప్ప ఈ ఘటనకు సంబంధించిన ఎలాంటి వివరాలు తెలియలేదని చెప్పారు.

## ఇరాన్ జాతీయ భద్రతామండలి కార్యదర్శిగా జోల్ఘదర్



**టెహ్రాన్ :** ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్‌సి) కార్యదర్శిగా బ్రిగేడియర్ మహ్మద్ బఘేర్ జోల్ఘదర్ నియమితులయ్యారు. ఆయన ఇంతకుముందు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) కమాండర్‌గా పనిచేశారు. గతవారంలో ఇజ్రాయెల్ రాత్రికి రాత్రి తాత్కాలిక టెంట్లపై చేసిన దాడుల్లో జాతీయ భద్రతా మండలి కార్యదర్శి లారిజానీ హతుడయ్యారు. ఫిబ్రవరి 28వ తేదీన యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ ఇప్పటివరకూ ఇరాన్‌లో మూడు వంతుల మంది ఉన్నతశ్రేణి నాయకులు, కమాండర్లు హతులయ్యారు. దేశ సర్వాధినేతగా నియమితుడైన మొజ్తబా ఖమేనీ ఆమోదంతో దేశాధ్యక్షుడు పెజెష్కియన్ ఈ మేరకు జోల్ఘదర్ నియామకాన్ని ధృవీకరిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.

## 'డబుల్ డెక్కర్' ఫ్లైఓవర్

(మొదటి పేజీ తరువాయి)

తుడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ డి.సుధీర్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే ప్రభుత్వ ప్రాధాన్యత మంత్రి అన్నారు. పక్కా ప్రణాళికతో ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తామన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 2 నుండి 3 గంటల్లో చేరుకునేలా డబుల్ డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందన్నారు. రూ.941 కోట్లు (కేంద్రం వాటా రూ.741 కోట్లు, రాష్ట్రం, హెచ్ఎంఆర్‌ఎల్ వాటా రూ.200 కోట్లు), నాగ్‌పూర్ తరహాలో 5.50కి.మీ పొడవునా ఈ కారిడార్ నిర్మిస్తామన్నారు. కింది భాగంలో సర్వీస్ రోడ్లు, మధ్యలో జాతీయ రహదారి ట్రాఫిక్, పైభాగంలో మెట్రో రైలు ప్రయాణించేలా త్రీలేయర్ వ్యవస్థ ఉంటుందని మంత్రి వివరించారు. దీని వల్ల సుమారు 60 నుండి 70 కాలనీలకు చెందిన 12 లక్షల మంది ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కలగనుందన్నారు. ఇప్పటికే మార్చి 17వ తేదీన కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు.

**శ్రీశైలం–మన్ననూర్ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్ శ్రీశైలం మార్గంలో మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు రూ.7,600 కోట్లతో 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు మంత్రి వెంకట రెడ్డి చెప్పారు. నల్లమల అటవీ, ఘాట్ రోడ్డులో ప్రమాదాలను నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భక్తులు ఉదయం వెళ్ళి దర్శనం చేసుకుని సాయంత్రానికి తిరిగి రావొచ్చని చెప్పారు. దీనికి సంబంధించి ఇప్పటికే డిపిఆర్ సిద్ధమై ఆమోద దశలో ఉందన్నారు.

**హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్త రోడ్ల నెట్‌వర్క్**

రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని మండలం, జిల్లా కేంద్రాలతో అనుసంధానించడమే లక్ష్యంగా రూ.20,000 కోట్లతో బిటి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రూ.13,006 కోట్లతో 6,092 కి.మీ మేర 34 ప్యాకేజీల్లో పనులు, ఇప్పటికే 24 ప్యాకేజీలకు టెండర్లు పూర్తయ్యాయని, మిగిలిన 10 ప్యాకేజీలు వారం రోజుల్లో పూర్తి కానున్నాయన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో జాప్యం లేకుండా డైరెక్ట్ డెబిట్ మెకానిజం అమలు చేస్తామన్నారు. మదీనాగూడ నుండి బిహెచ్ఈఎల్ వరకు (ఎన్‌హెచ్65) 1.20కి.మీ పొడవునా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.53.55కోట్ల వాటాకు అంగీకరించిందన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో సింగిల్, డబుల్, ఫోర్ లేన్ రోడ్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. అంతకు ముందు సభ్యులు కె.నారాయణ మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నుంచి హయత్‌నగర్ మధ్య తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. తాండూరు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఎంఎల్‌ఎ మనోహర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

## త్వరలో మోక్షం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. శాసనమండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, 2020 ఆర్ఒఆర్ చట్టంలో వాటి పరిష్కారమార్గాన్ని చూపలేదని విమర్శించారు. సాదాబైనామా సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధన వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని, ఇకపై కేవలం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జిఒ 76 విడుదల చేసినట్లు తెలిపారు. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా దరఖాస్తుదారులకు లబ్ధి చేకూరనుంది.

**ఆధార్ నెంబర్ మాదిరిగానే 'భూధార్'**

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భూములు సర్వే నెంబర్లు, పోజిషన్‌లో ఉన్న భూములకు తేడాలు రావడం వల్ల ఘర్షణలు జరుగుతున్నాయని, ఈ సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. ఇందుకు మంత్రి సమాధానం ఇస్తూ నక్షా లేని 413 గ్రామాలకుగాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహించామని మంత్రి తెలిపారు. ఇందులో ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే 'భూధార్' కేటాయించినట్లు వెల్లడించారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో, ఒక్కో జిల్లాలో 70 గ్రామాల చొప్పున భూ సర్వే నిర్వహించి, దశల వారీగా భూధార్ నెంబర్లు జారీ చేస్తామని, తద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి స్పష్టం చేశారు.

**అవినీతికి పాల్పడితే ఎవరిని ఉపేక్షించబోం**

ధరణి పోర్టల్‌లోని లోసుగులను ఆసరాగా చేసుయకుని కొంత మంది మీసేవ నిర్వాహకులతో కలిసి రూ.3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని మంత్రి తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్‌ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని మంత్రి విమర్శించారు. ధరణి పోర్టల్‌లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్‌లో 6కు కుదించామని, ధరణి పోర్టల్‌ను అర్ధరాత్రి ఒక్క రోజు మార్చేది కాదని, దశల వారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్‌ను తెస్తామని తెలిపారు.

## మహిళా రిజర్వేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఖర్గే రాసిన జవాబులో దాదాపు వారం క్రితమే ఈ ప్రతిపాదన చేస్తూ ప్రధాని అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరపాలని కోరారు. దానికి ప్రభుత్వం జవాబు ఇవ్వలేదు. అనుకున్న దానికన్నా ఐదేళ్ల ముందే మహిళలకు రిజర్వేషన్ కల్పించటాన్ని ఏ పార్టీ వ్యతిరేకించజాలదన్న ధీమాతో ప్రభుత్వం ముందుకెళుతున్నట్లు భావించబడుతున్నది. ప్రభుత్వ ఆలోచన ప్రకారం, పురుషులకు, జనాభా నియంత్రణ అమలు జరిపిన దక్షిణాది రాష్ట్రాలకు అసంతృప్తికి తావులేకుండా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 యధావిధిగా కొనసాగుతుంది. మహిళలకు రిజర్వేషన్ నిమిత్తం సీట్ల సంఖ్యను 33 శాతం పెంచటంతో (273) మొత్తం సీట్ల సంఖ్య 816కు చేరుతుంది. ఆయా రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్య కొనసాగించటంవల్ల ఏ రాష్ట్రానికీ అసంతృప్తికి అవకాశముండదు. చట్టసభల్లో రిజర్వేషన్ కోసం మహిళా సంఘాల దీర్ఘకాల పోరాటాలు, 1996లో దేవగౌడ ప్రభుత్వంలో సిపిఐ ఎంపి గీతాముఖర్జీ అధ్యక్షతన పార్లమెంటరీ కమిటీ సిఫారసు నాటి నుంచీ మహిళాలోకం డిమాండ్ శాసనరూపం దాల్చటానికి ఎన్నో అవరోధాలు వచ్చాయి. పాలకవర్గ పార్టీల పురుష సభ్యుల వ్యతిరేకత, ప్రతిపక్షంలోని బిజెపి కలిసి రాకపోవటం, బిల్లును సజీవంగా ఉంచేందుకు సోనియాగాంధి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాన్ని ముందుగా రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయటం, లోక్‌సభలో మెజారిటీ లేనందున దాన్ని ప్రవేశపెట్టకపోవటం వంటి పరిణామాలు జరిగాయి. 2023లో ఎన్‌డిఎ ప్రభుత్వం 'శక్తి వందన్ అధినియం' పేరుతో లోక్‌సభ, శాసనసభలు, ఢిల్లీ అసెంబ్లీలో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మహిళా కోటా బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంటు ఆమోదం పొందింది. అయితే 2026 వరకు నియోజకవర్గాల పునర్విభజన చేయరాదని వాజ్‌పేయి ప్రభుత్వం ఆమోదించిన చట్టాన్ని కారణంగా చూపి, రిజర్వేషన్ చట్టం అమలును జనాభా లెక్కలు పూర్తి అయిన మీదట డీలిమిటేషన్‌తో ముడిపెడుతూ చట్టంలో పొందుపరిచింది. కోవిడ్ కారణంగా 2021 జనాభా లెక్కల సేకరణను వాయిదా వేసింది. పొడిగించుకుంటూ ఇప్పుడు 2026, 2027లో చేపడుతున్నారు. ఆ గడువులను పాటించాలంటే 2034 ఎన్నికల వరకు మహిళా రిజర్వేషన్ ఎండమావిగానే ఉంటుంది. బహుశా మహిళల ఆగ్రహాన్ని తప్పించుకునే ఉద్దేశంతో కావచ్చు చట్టం సవరణకు ఇప్పుడు మోదీ ప్రభుత్వం తొందరపడుతున్నది. అందువల్ల 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని డీలిమిటేషన్ చేబట్టాలని నిర్ణయించింది. ఇందుకుగాను చట్టంలోని సెక్షన్ 5ను సవరించాల్సి ఉంటుంది. రాజ్యాంగం ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణ కూడా అవసరం. రాజ్యాంగ సవరణ ఆమోదానికి ఉభయ సభల్లోని మొత్తం సభ్యుల్లో మెజారిటీ, సభకు హాజరై, ఓటు చేసిన సభ్యుల్లో మూడింట రెండు వంతుల తోడ్పాటు అవసరం. సవరణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లుకు తోడ్పాటు సమీకరణకై హోంమంత్రి అమిత్ షా తదితర ఎన్‌డిఎ మేనేజర్‌లు సోమవారంనాడు అనేకమంది ప్రతిపక్ష నాయకులను కలుసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు ఆ సమావేశంలో పాల్గొనలేదు. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల సమావేశం కూడా సోమవారం సాయంత్రం జరిగింది.

## విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాల్సిన దుస్థితిని నాటి బిఆర్ఎస్ పాలకులు తీసుకొచ్చారన్నారు. ''2026–27 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ పైన శాసనసభలో మంగళవారం జరిగిన చర్చకు భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత 2023– 24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,357 కోట్ల అప్పు చేయగా, రూ.25 వేల కోట్లు అసలు వడ్డీ చెల్లించామని స్పష్టం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ 56,968 కోట్లు అప్పు తీసుకురాగా, రూ.66,545 కోట్లు అప్పు, వడ్డీ చెల్లించామని, 2025–26లో రూ.86,840కోట్ల అప్పులు తీసుకురాగా ఇందులో రూ. 93,194 కోట్లు అసలు, వడ్డీ అప్పు చెల్లించామని వివరించారు. గత పాలకులు చేసిన అప్పుల బండారాన్ని లెక్కలతో సహా వాస్తవాలను బయటపెడతామనే భయంతోనే వాక్ అవుట్ సాకుతో బిఆర్ఎస్ సభ నుంచి పారిపోయిందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు బడ్జెట్ కాపీలను చింపి తమ చెవిలో పెట్టుకుని సభ నుంచి వెళ్లిపోవడం సిగ్గుచేటన్నారు. గత పదేళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ ఆర్థిక, పరిపాలన వ్యవస్థను విధ్వంసం చేసిందని విమర్శించారు. మహిళలు ఆర్థికంగా ఎదుగొద్దని, రాజకీయంగా రాణించొద్దని, రాజకీయ సమానత్వం కోరుకొవద్దన్నదే బిఆర్ఎస్ ఆలోచన అని ఆరోపించారు. 2018– 2023 వరకు మహిళలకు వడ్డీ లేని రుణాలను ఎగొట్టిన బిఆర్ఎస్, ఇప్పుడు వడ్డీ లేని రుణాలు గురించి మాట్లాడటం హాస్యస్పదమన్నారు.

**ఇందిరమ్మ ఇండ్లకు అందుకే తగ్గింది.... :**

'గత బడ్జెట్‌లో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు రూపాయలు మంజూరు చేశాం. అయితే ఇండ్ల నిర్మాణం వడివడిగా జరగకపోవడంతో రూ.5500 కోట్లు మాత్రమే లబ్ధిదారుల బిల్లులు డ్రా చేశారు..' అని భట్టి విక్రమార్క అన్నారు. ఎంఎల్‌ఎలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని, వడి వడిగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణాలు చేయించాలని, ప్రతినెలా బిల్లులు ఇప్పించే బాధ్యత తనదని అన్నారు. లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి, బిఆర్ఎస్ నిర్మించిన కాళేశ్వరం ఏమైందో ప్రజలు చూస్తూనే ఉన్నారని, బిఆర్ఎస్ పాలకులు చేసిన అప్పులు రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు.

**ప్రతిపక్షంలో తమకు కనీసం గౌరవం ఇవ్వలేదు :** పది సంవత్సరాల పాటు ప్రతిపక్షంలో కూర్చున్న తనకు జరిగిన అవమానాలు ఏమిటో రికార్డులను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల సమస్యలపైన మాట్లాడేందుకు తనకు మైక్ కూడా ఇవ్వలేదన్నారు. గత పదేళ్ల కాలంలో తమను కనీస సభ్యులుగా కూడా గౌరవించలేదని, తాము అర్ధరాత్రి రెండు గంటల వరకు ఓపికగా ఉన్నామే తప్ప,ఎప్పుడూ వాకౌట్ చేయలేదని భట్టి గుర్తు చేశారు.

## ట్రంప్ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

రోజులు అమెరికా గడువు పొడిగించిన మరునాడు మోదీకి ట్రంప్ ఫోన్‌చేసి ఈ సమస్యపై చర్చించారు. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు, పరస్పర దాడులకు పాల్పడుతున్న వైరి వర్గాల సేనలను వెనక్కు మళ్ళించేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ట్రంప్‌తో ఫోన్ సంభాషణ తర్వాత నరేంద్రమోదీ చెప్పారు. ఈ సంభాషణల్లో ప్రధానంగా, ప్రపంచ వాణిజ్య నౌకలు పూర్తి భద్రతతో హోర్ముజ్ జలసంధి ద్వారా రాకపోకలు సాగించే విషయంపై చర్చించారు. 'ట్రంప్ నుండి ఫోన్ కాల్ వచ్చింది, మాట్లాడాం, పశ్చిమాసియాలో పరిస్థితిపై ఇద్దరం పరస్పర అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నాం' అని సోషల్ మీడియా వేదికగా మోదీ తెలియజేశారు. అదేవిధంగా భారత్‌లో అమెరికా దూత సెర్గీ గోర్ కూడా ఒక ప్రకటన చేస్తూ, నాయకులు ఇద్దరూ ప్రపంచంలో అత్యంత కీలకమైన జల రవాణా మార్గాన్ని సురక్షితమైన పద్ధతులలో తెరచి ఉంచాల్సిన ప్రాధాన్యత గురించి సంభాషించారని పేర్కొన్నారు. సురక్షిత నౌకా వాణిజ్యానికి వీలుగా హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లో తెరవకపోతే ఇరాన్ అంతటా ఉన్న కీలక విద్యుత్ కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ గడువు దగ్గర పడిన తర్వాత సోమవారం మరో ప్రకటన చేస్తూ, ఐదు రోజులు ఇరాన్‌పై దాడులకు విరామం ఇస్తున్నామని, హోర్ముజ్‌ను తెరచేందుకు గడువు ఆ మేరకు పొడిగించామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుండి ఇరాన్‌లో ఉన్న కీలక విద్యుత్ కేంద్రాలపై దాడులకు తాను ఆమోదం తెలియజేశానని, ఈ లోపు ఇరాన్ నుండి తనకు సమాచారం వచ్చిందని, వారు చర్చలు కోరుకున్నారని, ఆ మేరకు వారితో తమ అగ్రశ్రేణి దూతలు ఫలవంతమైన సంభాషణలు చేశారని, ఈ చర్చలు వారం అంతా కొనసాగే అవకాశాలు ఉన్నాయని ట్రంప్ చెప్పారు. ఐతే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయలేదు. కానీ ట్రంప్ ప్రకటనను మాత్రం ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఎలాంటి చర్చలూ జరగలేదని, ఇవన్నీ నకిలీ వార్తలనీ కొట్టిపారేసింది. గల్ఫ్ దేశాలపై యథాతథంగా మంగళవారం 25వ రోజు యుద్ధంలో కూడా దాడులు కొనసాగించింది.

## హోరెత్తిన పశ్చిమాసియా

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ అతలాకుతలమైంది. గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ దాడులను కొనసాగించింది. ఇజ్రాయెల్ కూడా ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా ఇరాన్ ఉత్పత్తి కేంద్రాలపై గగనతల దాడులు చేస్తోంది. అమెరికా యుద్ధం విరమించినాగానీ తాము యుద్ధం కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించిన వెంటనే మంగళవారం తెల్లారేదాకా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడులు చేసింది. టెల్‌అవీవ్ నగరం తీవ్రంగా నష్టపోయింది. దీంతో శిథిలాలను తొలగించేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం మరిన్ని సహాయబృందాలను మోహరించింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాల్సిందిగా హెచ్చరికలు చేసింది. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని అమెరికా ప్రకటించిన తర్వాత ఇరాన్ వాటిని నకిలీ వార్తలుగా తిరస్కరించి దాడులు కొనసాగించింది. అదేవిధంగా ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్‌లో ఉన్న అమెరికా మిత్రకూటమి స్థావరంపై రాత్రికి రాత్రి ఇరాన్ ప్రయోగించిన 14 డ్రోన్‌లను బ్రిటన్ సైనిక బలగాలు కూల్చివేశాయి. ఇటీవలివారాలలో ఇంత ఎక్కువ సంఖ్యలో ఇరాన్ డ్రోన్లను బ్రిటన్ సైనికులు కూల్చివేసిన ఘటన ఇదే. ర్యాపిడ్ సెంట్రీ పేరుతోగల గగనతల వ్యవస్థతో ఈ స్థావరాన్ని ఆర్ఎఎఫ్ రెజిమెంట్ సైనికులు రక్షిస్తున్నారు. ఎర్బిల్‌లో ఉన్న అమెరికా మిత్రకూటమి స్థావరంపై ఇరాన్ సైనిక బలగాలు పదే పదే మూడు వారాలుగా క్షిపణి,డ్రోన్‌లతో దాడులు చేస్తున్నాయి. దీనిపై లండన్‌లోని ప్రధానమంత్రి కార్యాలయ అధికార ప్రతినిధి మాట్లాడుతూ గడచిన మూడు వారాలలో బ్రిటన్ సైనికులు 900 గంటలపాటు ఈ స్థావరాన్ని రక్షిస్తున్నారని, ఇజ్రాయెల్,సౌదీఅరేబియా, కువైట్, బహ్రైన్, జోర్డాన్‌లకు తమ బలగాలు రక్షణా ఉంటున్నాయని చెప్పారు. కాగా దక్షిణ లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ సైనిక బలగాలు హెజ్బొల్లా ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. వారి స్థావరాలపై అదే పనిగా దాడులు కొనసాగిస్తోంది. దక్షిణ లెబనాన్‌లో చాలా భాగాన్ని తమ నియంత్రణలోకి తీసుకున్నామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ చెప్పారు. దక్షిణ ప్రాంత నగరం టైర్, హన్నియే,కఫర్ టెబ్నిట్ గ్రామాలలో బాంబుదాడులతో మంటలు, దట్టమైన పొగలు ఆ ప్రాంతమంతా కమ్ముకున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇరాన్ రాయబారిని లెబనాన్ దేశం నుండి వెళ్ళిపోవాలని ఆదేశించింది. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 1500 మంది ఇరానీయులు మరణించగా, 13మంది అమెరికా సైనికులు మరణించారు. మరో 15 మంది ఇజ్రాయెలీలు మరణించారు.

**హెగ్సెత్‌పై నెపం నెట్టేసిన ట్రంప్**

యుద్ధం ప్రారంభించిందీ, ఆ నిర్ణయం తీసుకున్నదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అని అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు ఆయన ఈ నెపం ఇతరులమీద నెట్టేస్తున్నారు. టెన్నెసీలో జరిగిన ఒక రౌండ్ టేబ్ల్ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, తన పక్కనే కూర్చున్న అమెరికా యుద్ధశాఖామంత్రి హెగ్సెత్‌వైపు తిరిగి యుద్ధం చేయాలని మొదట సూచన చేసింది మీరేనన్నారు. నేను పశ్చిమాసియాలో పరిణామాల గురించి హెగ్సెత్‌తో, సర్వసైన్యాధిపతి జనరల్ కైన్, ఇతర అధికారులతో మాట్లాడాను, ఇతర ముఖ్యులతో సంభాషించాను, పశ్చిమాసియాలో మనకు సమస్య ఉంది, మాట్లాడదాం, 47 ఏళ్ళుగా ఆ దేశం ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేస్తోంది, వారు అణ్వాయుధం తయారు చేయడానికి చాలా దగ్గరలో ఉన్నారు, దానికి ఇక అంతు ఉండదు, ఈ సమస్యను పరిష్కరించాలి అని సూచనలు వచ్చాయన్నారు. వారిని అణ్వాయుధం తయారు చెయ్యనివ్వకూడదు, వాళ్ళని ఆపాల్సిందే అని మొదట మీరే నాకు చెప్పానుకుంటాను అని హెగ్సెత్‌వైపు తిరిగి ట్రంప్ అన్నారు. ఈ విధంగా ఆయన యుద్ధం చేయాలన్న నిర్ణయం తనది కాదని తప్పించుకునే ప్రయత్నం ప్రారంభించారు.

# ఒకే నమూనా, ఒకే నకల్

## బడ్జెట్ అంచనాలలో కొత్తదనం లేదు

కూనంనేని సాంబశివ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు రూపకల్పన చేస్తున్న బడ్జెట్ అంచనాలలో కొత్తదనం లేదని, అందరిదీ ఒకే నమూనా, ఒకే నకల్ అని, అందరి విధానం ఒక్కటేనని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. తలసరి ఆదాయం, జిఎస్‌డిపి లెక్కల ఆధారంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటా రావడంలేదని, ఇది కూడా బడ్జెట్ లోటుకు ఒక కారణమని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని వేయాలని, పేదల వద్ద నుంచి భూములు తీసుకున్నవారిపై కేసులు నమోదు చేసి, ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పిఒబి, పిఒటి పరిధిలోని భూ సమస్యలను పరిష్కరిస్తే ఒక వైపు పేదలకు న్యాయం జరగడంతో పాటు ప్రభుత్వానికి భూముల రూపంలో ఆస్తులు పెంచుకోవచ్చన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లిస్తే, ప్రభుత్వం ప్రశాంతంగా పాలన కొనసాగించుకోవచ్చన్నారు. రైతుల బాధలు అలాగే ఉన్నాయని, సాదా బైనామా సమస్య పరిష్కారం కాలేదని, గతంలో జరిగిన తప్పులను సరిచేయలేదని, ఏమి పెద్దగా మార్పు రాలేదని చెప్పడానికి తాను చింతిస్తున్నానని అన్నారు. శాసనసభలో మంగళవారం జరిగిన "2026–2027 వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసరి ఆదాయం లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మనిషి వద్ద రూ.4,18,931 ఆదాయం ఉన్నదా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగం జనాభాకు పైగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి మేలు చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పిఎఫ్‌ను అమలు చేయాలని సూచించారు.

**జిఎస్‌టిని వజ్రాయుధం చేసుకున్న కేంద్రం :** జిఎస్‌టిని కేంద్ర ప్రభుత్వం ఒక వజ్రాయుధంగా మార్చుకున్నదని, ఫలితంగా కేంద్రంపై రాష్ట్రాలు ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని కూనంనేని సాంబశివ రావు అన్నారు. బిజెపితో పొత్తు తర్వాత ఎపి ప్రభుత్వం పరిస్థితులు వేరుగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్ట్‌కైనా జాతీయ హోదా ఇచ్చారా?, విభజన చట్టంలోని బకాయిలలో ఒక్క రూపాయి ఇచ్చారా? అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర ప్రయోజిత పథకాలు మినహా తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. జిఎస్‌టి ఇతర రూపంలో కేంద్రానికి తెలంగాణ రాష్ట్రం రూ.2లక్షల కోట్లకుపైగా చెల్లిస్తుండగా, కేంద్రం నుంచి రాష్ట్రానికి అన్నీ కలిపినా రూ.70 వేల కోట్ల నుంచి రూ.80వేల కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి 2.17 శాతం, ఉత్తర్‌ప్రదేశ్‌కు 17.62 శాతం, బిహార్‌కు 11.95 శాతం నిధులను కేటాయిస్తున్నదన్నారు. కేంద్రం రాష్ట్రాలపై పెత్తనం చేసేందుకు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

**అప్పులకు పరిష్కారం ఆలోచించండి :** రాష్ట్రంలోని మొత్తం రూ.8,65,195 కోట్ల అప్పులన్నీ ఒక్కరి వల్లనే అనడం అన్యాయమని, ఆ అప్పులు పెరుగుతూ వస్తున్నాయని, అప్పులను తీర్చేందుకే మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. దీనికి పరిష్కారం ఆలోచించాలని సూచించారు. కేంద్రం కూడా సహాయం చేయాల్సిందేనని, కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నిధులు రావడంలేదన్నారు. కేరళ రాష్ట్రంలో అత్యంత నిరుపేదలు గుర్తించి, వారిని బయటవేశారని, అదే తరహా రాష్ట్ర ప్రభుత్వం చేయాలని సూచించారు.

**ధరణి వల్లనే భూదందాకు బీజం :** రాష్ట్రంలో ధరణి వల్లనే భూదందాకు బీజం పడిందని, భూభారతి వల్ల ఎటువంటి మార్పు రాలేదని కూనంనేని సాంబశివ రావు అన్నారు. పాల్వంచ, కొత్తగూడంలోని భూములు పిఒబి పరిధిలోకి వచ్చాయని, 76 జిఒ ప్రకారం సింగరేణి భూములలో నివాసం ఉంటున్న సాధారణ ప్రజలకు ఆ భూమిని క్రమబద్ధీకరించాలని కోరారు. పేదలు గుడిసెలు వేసుకున్న భూములకు 58, 59 జిఒ ప్రకారం క్రమబద్ధీకరిస్తే లక్షల మందికి ఇండ్లు వస్తాయన్నారు. కానీ భూములను మళ్లీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తే వెలుగుమట్ల అవుతుందని ఆయన హెచ్చరించారు. హన్మకొండ ఐనవోలు మండలంలో సర్వే నంబర్ 324లో మధసూదన్ రెడ్డి ల్యాండ్ సీలింగ్ కింద అప్పగించిన భూమిని 2018లో రెవెన్యూ అధికారుల సహాయంతో కట్ట మనోహర్ రెడ్డి, ఆయన బంధువులకు 138 ఎకరాలు రాయించుకున్నారని కూనంనేని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

**ప్రమాదంలో సింగరేణి, ఆర్‌టిసి, జెన్‌కో :** సింగరేణి, ఆర్‌టిసి, జెన్‌కో మూడు సంస్థల ఉనికి ప్రమాదంలో పడిందని కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్థలను నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టిసి పరిధిలోనే ఉంచాలన్నారు.

**ఎక్కువ కాలం కొనసాగితే ఎటిఎంగా మారుతాయి :** రాష్ట్ర వ్యాప్తంగా 24 ప్రాజెక్టలలో చిన్నవి ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని సాంబశివరావు సూచించారు. ప్రాజెక్టలను ఎంతకాలం కొనసాగిస్తే అంత ఎటిఎంగా మారుతాయని, దీని నుంచి బయటపడాలన్నారు. ధవళేశ్వరం, కృష్ణ, నాగార్జునసాగర్ ప్రాజెక్టలు ఇప్పటికీ బాగానే ఉన్నాయని, ప్రస్తుత సిస్టమ్‌లో వైఫల్యం ఉన్నదని, ఎటిఎంగా మారాయని, అందుకే నిర్మాణాలు పోతున్నాయన్నారు.

## హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలి

హామీల అమలులో ఆలస్యం జరుగుతోంది

పేదలకు అన్యాయం జరిగితే పోరాటం తప్పదు

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో ఆలస్యం జరుగుతోందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజల జీవనం కష్టతరమైందని, సంక్షేమ పథకాల అమలు వేగవంతం చేయాలన్నారు. పేద ప్రజానీకానికి ప్రభుత్వం అన్యాయం జరిగితే సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. శాసనమండలిలో మంగళవారం బడ్జెట్‌పై సాధారణ చర్చలో నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి హామీ ఇచ్చిన 15 శాతం నిధులను కేటాయించాలని, ఎస్‌ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీటిని అందించాలని, యూనివర్సిటీల్లో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టలను భర్తీ చేయాలని, ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు, కార్మికులు, నిరుద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు మద్దతు ధరలు, పంట నష్ట పరిహారం, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు పూర్తిగా అందడంలేదని, రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులకు తగిన మద్దతు లభించడంలేదని సత్యం విమర్శించారు. కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలి వేదికగా ప్రజా సమస్యలపై మరింత చర్చకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. ప్రజల సంక్షేమం, ఉద్యోగాలు, రైతు సమస్యలు, ధరల నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సత్యం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదవులకు గొర్రెల స్కీమ్ కింద లబ్ధిదారులు చెల్లించిన డబ్బును రిలీజ్ చేయాలన్నారు.

## సింగరేణిలో పదేళ్లలో పెద్ద సంఖ్యలో 13,119 మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్

అనవసర మెడికల్ ఇన్‌వాలిడేషన్‌పై ఎసిబి, విజిలెన్స్ విచారణ

శాసనమండలిలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2014 నుంచి 2023 వరకు పదేళ్లలో సింగరేణిలో 13,119 మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ జరిగిందని, అవసరం లేకపోయినా మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేయడం కారణంగా సింగరేణిపై ఆర్థికంగా భారం పడిందని, పెద్ద సంఖ్యలో జరిగిన మెడికల్ ఇన్‌వాలిడేషన్‌పై ఎసిబి, విజిలెన్స్ విచారణ జరిపిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. శాసనమండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష నాయకులు ఎస్.మధుసూదనచారి సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలపై అడిగిన పలు ప్రశ్నలకు డిప్యూటీ సిఎం సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ 2000 సంవత్సరం నుంచి 2014 వరకు 14 సంవత్సరాల కాలంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ సంఖ్య 3,859 మాత్రమే ఉందన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ దుర్వినియోగం అవుతుందని భావించి కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్డ్ ఫీల్డ్‌లో నిబంధనలు పరిశీలించి మైనింగ్ జిఎం, ఒక నామినేటెడ్ సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ వారిని వదిలేయకుండా మానవీయకోణంలో పరిశీలించి ఆధారపడిన కుటుంబాలను అనుమతించాలని నిర్ణయించామని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాల్లో 14 సార్లు మెడికల్ బోర్డు సమావేశం జరగగా 2024లో 1041 మందికి, 2025లో 949 మందికి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద డిపెండెంట్స్‌కు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. నిర్దిష్ట నిర్ణయాలు తీసుకుని సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి, జెన్‌కో రెండు ప్రభుత్వ సంస్థలేనని, వీటిని సమన్వయం చేస్తూ రక్షించుకోవాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. ఇతర కోల్ సంస్థల ధరలతో సింగరేణి ఉత్పత్తి ధరలను మ్యాచ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలా చేస్తేనే భవిష్యత్తు తరాలకు సింగరేణి సంస్థను అందించగలుగుతామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్, బిజెపిల మధ్య శాసనసభలో వాగ్వాదం







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అదనంగా రావాల్సిన నిధులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 'మహాత్మా గాంధీ గాడ్సే' అంశంపైన కాంగ్రెస్, బిజెపిల మధ్య శాసనసభలో వాగ్వాదం జరిగింది. '2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఆదాయవ్యయ పట్టిక (బడ్జెట్ )'పైన శాసనసభలో మంగళవారం చర్చ జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి విడుదలవుతున్న నిధులు, గ్రామీణ ఉపాధి హామీ పథకంపై బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన ప్రసంగంపైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పందించారు. రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ పేరును తొలగించారని,గాంధీ ఏం అన్యాయం చేశారని నిలదీశారు. ఇది వరకు ఉన్న నిధులలో 40 శాతం నిధులను రాష్ట్రాల పైనే వేశారని విమర్శించారు. గాంధీని చంపిన గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు లేదా అని ప్రశ్నించారు. తమ ఇంట్లో వండుకుని, తాము తినడానికి 'మీ పర్మిషన్' ఎందుకు అని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్‌ను సర్దార్ వల్లభాయ్ పటేల్ నిషేధించారని గుర్తు చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఏం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేదని, 12 ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి, బకాయిలను విడుదల చేయలేదని,అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్టుగానే తెలంగాణకు నిధులు ఇచ్చారని వివరించారు. కేంద్రం కంటే 'మీలోనే ఎంతో విద్వేషం, దుర్బుద్ధి ఉందనేది అర్థం అవుతుందని'' బిజెపి ఎంఎల్‌ఎలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**దానం .. భిక్ష వేయలేదు :** మంత్రి శ్రీధర్‌బాబు ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణకు కేంద్రం నిధులు విడుదల చేసిందని, దీనిని కూడా ఏదో తెలంగాణ ప్రజలకు దానం, భిక్ష వేస్తున్నట్టుగా చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు 8 మంది ఎంపిలను, ఎంఎల్‌ఎలను గెలిపించి అన్యాయం చేశారా? అని ప్రశ్నించారు. మహేశ్వర్ రెడ్డి తీరు తెలంగాణ,నిర్మల్ ప్రజల ప్రతినిధిగా కాకుండా ఢిల్లీ, మహారాష్ట్ర ప్రతినిధిగా వ్యవహారిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**తెలంగాణ పాకిస్తాన్‌లో ఉందా?: మంత్రి పొన్నం :** రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఏం కావాలో ఎప్పుడైనా బిజెపి సభ్యులు అడిగారా? అని ప్రశ్నించారు. తెలంగాణ భారతదేశంలో లేదా? ఏమైనా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో ఉన్నదా? అని మండిపడ్డారు. ఎపి రాష్ట్రానికి నిధులు ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణకు ఏం చేయలేదని, కేవలం బిజెపిలో ఉంటేనే హిందువు అన్నట్టుగా వ్యవహారిస్తున్నారని, తాను చెప్పినట్టుగా శ్లోకాలు, పద్యాలను చెప్పలగారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఏమైనా తీసుకొచ్చి మాట్లాడాలని, లేదంటే దుఖానం మూసుకోవాలని మండిపడ్డారు.

**గాంధీని చంపిన గాడ్సేను సమర్థిస్తారా: మంత్రి వాకిటి శ్రీహరి :** పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూగాంధీని చంపిన గాడ్సేను పొగుడుతూ సమర్థిస్తే ఎలా అని ప్రశ్నించారు. తానూ పుట్టకతోనే హిందూవునేనని, తాను హిందూవుగానే ఉంటానని, ఇతర ధర్మాలను కూడా తాము గౌరవిస్తామని తెలిపారు. ఓట్ల కోసం హిందూవులు అంటే ఎలా అన్నారు.

**కేంద్రం నుంచి 80 శాతం నిధులు వస్తున్నాయ్... గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌కు సంబంధమే లేదు: మహేశ్వర్ రెడ్డి :** అంతకుముందు బిజెఎల్‌పి నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఐదున్నర సంవత్సరాల కాలంలో రూ.3,70,175 కోట్లను ఇచ్చిందని, కేంద్రం నుంచి తెలంగాణకు 80 శాతం నిధులు వస్తున్నాయని తెలిపారు. గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కుంభకోణాలు చేసిన వారిని ఎందుకు వదిలిపెట్టారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి 80 శాతం నిధులను ఇస్తుందని బిజెఎల్‌పి నేత ఎ.మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## జీవన్ రెడ్డికి ఎఐసిసి, పిసిసి బుజ్జగింపులు

అయినా పట్టువీడని మాజీ మంత్రి

నేడు కాంగ్రెస్‌కు రాజీనామా, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనంలో నేడు భవిష్యత్‌పై చర్చ



**ప్రజాపక్షం/జగిత్యాల :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా అంశం కీలక దశకు చేరుకుంది. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్న జీవన్ రెడ్డికి గత వారం రోజులుగా అధిష్టానం మంత్రులు, టిపిసిసి సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ విఫ్‌ల ద్వారా బుజ్జగించే ప్రయత్నాలను చేపట్టింది. అయినప్పటికి జీవన్ రెడ్డి మెట్టుదిగని విక్రమార్కుడిలా రాజీనామా దిశగా రోజుకో అడుగు ముందుకు వేస్తున్నాడు. చివరి ప్రయత్నంలో భాగంగా అధిష్టానం మరోసారి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను రంగంలోకి దించింది. దీంతో మంగళవారం జీవన్ రెడ్డి నివాసానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లతో కలిసి టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాహుల్ గాంధీ దూత ఎఐసిసి సెక్రటరీ వంశీ చందర్ రెడ్డిలు వేర్వేరుగా చేరుకుని అరగంటకు పైగా చర్చలు జరిపారు. రాజీనామా నిర్ణయం వెనక్కి తీసుకోవాలని జీవన్ రెడ్డిని బుజ్జగించే ప్రయత్నం విఫలమైనట్లు తెలిసింది.

ఈ సందర్భంగా జీవన్ రెడ్డి తన అసంతృప్తిని స్పష్టంగా వ్యక్తం చేశారు. పార్టీలో నాకు జరిగిన అన్యాయం చాలంటూ ఇక కాంగ్రెస్ కండువా కప్పుకోనూ అంటూ టీపీసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు.

**పార్టీలోనే కొనసాగాలని కోరాం... టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని జీవన్ రెడ్డి నివాసంలో మంగళవారం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని, మమ్ములను వీడొద్దని జీవన్ రెడ్డిని కోరినట్లు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని పేర్కొన్నారు. నాకు తండ్రి లాంటి జీవన్ రెడ్డి రాజకీయంగా ఆయనంత సీనియర్ నాయకుడు ఈ రాష్ట్రంలో ఒకరు, ఇద్దరూ మినహా ఎక్కువ మంది లేరన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి 63 సీట్లు గెలుచుకుని అనాడు ఉన్న పరిస్థితుల దృష్ట్యా కొన్ని సమీకరణాల పర్యావసనంతో జీవన్ రెడ్డి ఇబ్బందులకు గురయ్యారన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న జీవన్ రెడ్డి అప్పటి నుంచి ఇబ్బందులు పడుతూ భాధపడుతున్నారన్నారు. జీవన్ రెడ్డి పడుతున్న ఇబ్బందులను గుర్తించి అధిష్టానం అదేశాల మేరకు చర్చలు జరిపామన్నారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం తెంచవద్దని, మమ్ములను వీడవద్దని, యధావిధిగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలని, భవిష్యత్ విషయాలు చర్చించుకుందామని వివరించినట్లు పేర్కొన్నారు. జగిత్యాల రాజకీయ పరిణామాలు చూస్తుంటే కార్యకర్తల ఒత్తిడితో రాజీనామా చేసే ఆలోచనలో జీవన్ రెడ్డి ముందుకు వెళుతునట్లు అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో జీవన్ రెడ్డి వదులుకోమని మరో సారి మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**జీవన్ రెడ్డి నివాసానికి ఇందిరా భవన్ పేరు తొలగింపు**

జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మంగళ వారం ఉదయం అరగంటకుపైగా చర్చలు జరిపిన కొద్దిసేపటికే కార్యకర్తలు బగ్గుమన్నారు. తన నివాసానికి ఇందిరా భవన్ అనే నాయకరణంతో ఉన్న ఫ్లెక్సీని తొలగించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య గో బ్యాక్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో పిసిసి చీఫ్‌ను కలువకుండానే నందయ్య వెనుదిరిగి వెళ్లినట్లు తెలిసింది.

**రేపటి సమావేశం యధాతథం... మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన అనంతరం జీవన్ రెడ్డి మిడియాతో మాట్లాడారు. పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో వెనుకడుగు వేయబోనన్నారు. జిల్లా కేంద్రలోని బండారి గార్డెన్‌లో జరగనున్న సమావేశానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తన భవిష్యత్ కార్యచరణను సమావేశంలో వివరిస్తానని జీవన్ రెడ్డి చేసిన వాఖ్యలు సంచలనంగా మారింది.



## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ

మీడియా అకాడమీ, ఎస్ఎంఎసి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని మీడియా అకాడమీ, ఎస్ఎంఎసి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌డిసి బోర్డు రూమ్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎసి– రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. మీడియా అకాడమీ, ఎస్ఎంఎసి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సమాచార–పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఎసి కోచైర్ పర్సన్ సిహెచ్.ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారి దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని తెలిపారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డిఎంఎసి)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను కోరారు. ఈ సమావేశంలో సమాచార–పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్‌బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

## విదేశీ విద్య పథకం కింద 2వేల మందికి లబ్ధి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే అణగారిన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బిఆర్ఎస్ సభ్యుడు కె.తారక రామారావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్య ఉపకార వేతనాల పథకానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా సుమారు 2,000 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.607కోట్లు ఖర్చు చేసిందన్నారు. నిబంధనల ప్రకారం అర్హులైన విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే నేరుగా చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు కెటిఆర్ మాట్లాడుతూ పథకం అమలులో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2025 అక్టోబర్‌లో ఇస్తామన్న నిధులు ఇంకా అందలేదన్నారు. ఫీజులు చెల్లించలేక విదేశాల్లో ఉన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని ఆయన కోరారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: గాజులరామారం సర్కిల్-57**

**NIT No.** 03/DB/EE/Gajularamaram Circle-57/CMC/2025-26, **పని పేరు:** నిర్వహణ పనులు (4 నెం.లు), **అంచనా మొత్తం:** రూ.57.00 లక్షలు, **ప్రారంభ తేది:** 25.03.2026న మ.3.00గం.ల నుండి, **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 28.03.2026న మ.03.00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 9063836115. ఇతర వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.

DIPR R.O. No. : 17560-PP/CL/ADVT/1/2025-26, Date: 24-03-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: ఉప్పల్ జోన్**

టెండర్ నోటీసు

TENDER NOTICE NIT No. 10/SE(M)/UZ/MMC/2025-26, తేదీ: 20.03.2026

**పని పేరు:** 1 పని కొరకు జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-9, ఉప్పల్, వార్డు నెం.28లో రహదారి భద్రతా కార్యక్రమం కింద, నాగోల్ రోడ్డులోని HP పెట్రోల్ బంక్ నుండి TVS షోరూమ్ వరకు SW డ్రైనేజీ పైపుల ఏర్పాటు పనుల నిమిత్తం, **అంచనా మొత్తం:** రూ.72.00 లక్షలు, **బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 31.03.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఉప్పల్ జోన్, ఎంఎంసి. ఇతర వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడగలరు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఉప్పల్ జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 17533-PP/CL/ADVT/1/2025-26, Date: 24-03-2026

**లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానము**

ధర్మపురి పట్టణం – జగిత్యాల జిల్లా .

ఆర్.సి నెం.ఇ/159/2024 బహిరంగ వేలము ప్రకటన తేది: 24-03-2026

| క్ర సం | అంశము | కాల పరిమితి | ప్రవేశ రూపం డి.డి/నగదు | సెక్యూరిటి డిపాజిట్, డి.డి/నగదు | ఇ.ఎమ్.డి డిపాజిట్, డి.డి/నగదు |
|---|---|---|---|---|---|
| 1 | దేవాలయ ఆవరణలో పూజ సామాగ్రి & ఫోటోలు & ఇతరత్రా సామాగ్రి అమ్ముకొను హక్కు. | 10-04-2026 నుండి 09-12-2026 వరకు (08) నెలల కాలపరిమితి | 1000/- | 1,00,000.00 | 50,000/- |
| 2 | నృసింహ సదన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణం నెం.06 కిరాయి (లీజు) ఇచ్చుట గూర్చి | 01-05-2026 నుండి 30-11-2028 వరకు | 1000/- | 25,000/- | 50,000/- |

01). పైన పేర్కోన్న అంశములకు అర్హత & ఆసక్తి గల వారు తేది: 06.04.2026 సోమవారం రోజున ఉదయం 11.00లకు తగు డిపాజిట్ చెల్లించి నేరుగా పాల్గోనవచ్చును. 2). మిగతా వివరములకు కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.

DIPR R.O. No. : 17575-PP/CL/ADVT/1/2025-26, Date: 24-03-2026 సం/- కార్యనిర్వహణాధికారి

**పురపాలక సంఘం కార్యాలయము – తొర్రూరు**

నెం.18/యం.సి.టి/2026/ఎ1 పత్రిక ప్రకటన తేది: 23/03/2026

అంగడి బహిరంగ వేలం - కం - టెండరు రెండవ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది, పురపాలక సంఘంచే నిర్వహించబడు కమేళా మరియు చికెన్ వ్యర్థముల సేకరణ వసూలు చేయు అధికారము మరియు వేలములు 2026 2027 సం.నకు గాను (01-04-2026 నుండి 31-03-2027 వరకు) బహిరంగ వేలం -కం టెండర్ల ద్వారా పురపాలక సంఘ కార్యాలయమునందు తేది. 28/03/2026 శనివారం రోజున ఉ.11-00గంటల నుండి సా.05-00 గం.ల వరకు శ్రీయుత కమీషనర్ పురపాలక సంఘం తొర్రూరు గారిచే వేలములు వేయబడును. మరియు సీల్డు టెండర్లు స్వీకరించబడును. కావున అభిలాషపరులు ఈ దిగువ చూపబడిన నిబంధనలకు లోబడి వేలము మరియు టెండరు పాటలో పాల్గొనుటకు కోరనైనది. వేలములు అంగీకరించు / నిరాకరించు అధికారములు పురపాలక సంఘంనకు కలదు.

**పూర్తి వివరములకు మునిసిపల్ కమీషనర్ గారిని సంప్రదించగలరు. చరవాణి నెం: 9573977488**

: నియమ నిబంధనలు :

1. వేలములో పాల్గొనువారు గాని, వారి కుటుంబ సభ్యులు గాని, పురపాలక సంఘం తొర్రూరునకు ఎలాంటి బాకీ ఉండరాదు.
2. వేలము పాటలో పాల్గొను వారు ఈ క్రింద చూపబడిన విధముగా డిపాజిట్లు వేలం వేయు రోజునకు ముందుగా దాఖలు పరుస్తూ MUNICIPAL FUND, THORRUR MUNICIPALITY, గారి పేరున విడివిడిగా డి.డి.లను 26/03/2026 రోజు సా.5.00 గం. వరకు చెల్లించి రశీదులు మరియు షెడ్యూల్స్ పొందగలరు.
3. చికెన్ వ్యర్థముల సేకరణ వేలం పాట పొందినవారు చికెన్ వ్యర్థములను ఏ కంపెనీకి సరఫరా చేస్తారో ధృవీకరణ పత్రమును తప్పనిసరిగా సమర్పించగలరు.
4. చేబారు అయిన వారు వేలం పాట మొత్తం రూపాయలు (7) రోజుల చెల్లించి రశీదు పొందగలరు.

| వేలము వివరములు | డిపాజిట్ రూ.లు | రిజిస్ట్రేషన్ ఖర్చు | మొత్తం రూ.లు | షెడ్యూలు ధర |
|---|---|---|---|---|
| ఎ. కమేళా | 50,000-00 | - | 50,000-00 | 1000-00 |
| బి. చికెన్ వ్యర్థములు | 50,000-00 | - | 50,000-00 | 1000-00 |

నోట్: అంగడి వేలములకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంప్రదించగలరు.

ఇట్లు

సం/- కమీషనర్, తొర్రూరు పురపాలక సంఘం

DIPR R.O. No. : 17504-PP/CL/ADVT/1/2025-26, Date: 24-03-2026

# ఇ.వి. కొనుగోళ్లపై 20% డిస్కౌంట్

- ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలతో ఒప్పందం చేసుకున్న రాష్ట్ర రవాణా శాఖ
- రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు : మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా, కాలుష్యాన్ని నివారించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య కరమైన వాతావరణం అందించడం, సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడడం తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ వాహనాల (ఇ.వి) వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని, ఈ ప్రయత్నాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈవి వాహనాల కొనుగోలుపై 10 నుంచి 20 శాతం డిస్కౌంట్ వచ్చేలా ఈవి కంపెనీలతో ఒప్పందం చేసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సిఎస్ రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, ఆర్‌టిఎ కమిషనర్ ఇలాంబర్తితో సహా ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చిందని, దీని ద్వారా రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ పూర్తిగా 100 శాతం మినహాయింపు ఇవ్వడంతో, పాలసీ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు లక్షా 15 వేల 551 ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరిగాయని, దీంతో రూ. 925.94 కోట్లు ప్రభుత్వానికి నష్టం వాటిల్లందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 10 నుంచి 20 శాతం డిస్కౌంట్ ఇచ్చేలా మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్, ఓలా తో పాటు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని మంత్రి వెల్లడించారు. ఈవి పాలసీ వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఈవి వాహనాల వినియోగం 0.60 నుండి 1.50 శాతం పెరిగిందని, ఇకపై రాష్ట్ర ప్రభుత్వం నుండి కొనుగోలు చేసే వాహనాలు కూడా ఈవి వాహనాలు ఉండేలా ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారని, అందుకు హైర్ పద్ధతిలో లేదా డిపార్ట్‌మెంట్‌ల నుండి వాహనాలు తీసుకునేలా చర్యలు తీ సుకుంటామన్నారు. ఈవి వాహనాలకు ఇబ్బందులు లే కుండా అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్యూర్ ఏరియాలో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, త్వరలోనే డీజిల్ ఆటోలు కూడా రిట్రోఫిట్‌గా మార్చి నడపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, పౌరసమాచారాల శాఖ డైరెక్టర్ ప్రియాంక, జెటిసి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్‌పై ప్రశ్నించాల్సింది కేంద్రాన్నే

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎంఎల్‌సి అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'రాజకీయాల కోసం బిఆర్‌ఎస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారు. అయినా గ్యాస్ ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వం...అడగాల్సింది కూడా కేంద్రాన్ని...కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాదు' అని కాంగ్రెస్ ఎంఎల్ అద్దంకి దయాకర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బిఆర్‌ఎస్ నేతలు వంట గ్యాస్‌పై వాయిదా తీర్మానం ఇచ్చారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గ్యాస్ కొరతలేదని గతంలోనే ప్రకటించారని తెలిపారు. గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ కోసం బిఆర్‌ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని ఆయన అన్నారు. బిజెపి మీద కొట్లాడకుండా, రాష్ట్ర ప్రభుత్వం మీద కొట్లాడుతున్నట్లు నటిస్తున్నారని, బిఆర్‌ఎస్, బిజెపి రెండూ ఒక్కటే అన డానికి ఇది నిదర్శనమన్నారు. బడ్జెట్ ప్రజా రంజకంగా ఉంది కాబట్టి చర్చ చేసే ధైర్యం లేక ఇలాంటి చిల్లర రాజకీయాలు వేస్తున్నారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు

ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ వెల్లడి

**ప్రజాపక్షం హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత ఏ మాత్రం లేదని తెలంగాణ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ వెల్లడించింది. భయాందోళనలతో అనవసరంగా ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం పూర్తిగా, సక్రమంగా పనిచేస్తోందని, అన్ని జిల్లాల్లోని ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. పలు పెట్రోల్ బంకులలో భారీ క్యూలు తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి ప్రధాన కారణం, తప్పుడు వదంతుల వల్ల ప్రజలు భయపడి అకస్మాత్తుగా ఇంధనం కొనుగోలు చేయడానికి ఎగబడటమేకారణమని తెలిపింది. ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని, దయచేసి ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వదంతులను నమ్మవద్దని కోరింది. ఇలాంటి వాటిని ఇతరులకు పంపవద్దని, సందేహాలు ఉన్నా లేదా అక్రమాలపై ఫిర్యాదు చేయాలన్నా, ప్రజలు పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ హెల్ లైన్ నంబర్: 1967 ను సంప్రదించాల్సిందిగా సూచించింది.

## టికెట్ రిఫండ్‌పై అదనపు భారం పుకార్లను నమ్మొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టికెట్ రిఫండ్ నిబంధనల్లో మార్పులు ప్రయాణికులపై అదనపు భారం మోపుతున్నాయన్న ప్రచారం వాస్తవానికి విరుద్ధమని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లు నమ్మవద్దని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులకు తమ టికెట్ కన్ఫర్మ్ అయ్యిందా లేదా అన్న విషయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలనే ఉద్దేశంతో రైల్వే శాఖ చార్ట్ సిద్ధం చేసే సమయాన్ని 4 గంటల నుంచి 9–18 గంటల ముందుగానే పెంచింది. దీంతో దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వారికి ముందస్తు సమాచారం అందుతోంది.ఈ మార్పులతో పాటు రిఫండ నిబంధనలను కూడా సవరించినప్పటికీ, ప్రయాణికులపై ఎటువంటి అదనపు చార్జీలు విధించలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా అక్రమ టికెట్ ఏజెంట్లపై కట్టడి చర్యలను మరింత కఠినతరం చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రయాణికులు ట్రైన్ బయలుదేరే సమయానికి 30 నిమిషాల ముందువరకు తమ బోర్డింగ్ స్టేషన్‌ను మార్చుకునే అవకాశం కల్పించబడింది. అదేవిధంగా సీట్లు అందుబాటులో ఉంటే, ట్రైన్ బయలుదేరే ముందు 30 నిమిషాల వరకు తమ ట్రావెల్ క్లాస్‌ను అప్‌గ్రేడ్ చేసుకునే సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది.

## శ్రామిక ప్రజల హక్కుల పరిరక్షణకు ఉద్యమించండి

ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెరుగైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, మరింత న్యాయమైన ఉపాధి పద్ధతులు వంటి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తీవ్రతరం చేయాలనీ ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్, నారాయణగూడ ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు బి. రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. రంగారెడ్డి జిల్లాలో ఐఎన్‌టియుసిను బలోపేతం చేసెందుకు జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి ఆదేశానుసారం జిల్లా శాఖను రద్దు చేసి, నూతన కార్యవర్గంలో జిల్లా నూతన అధ్యక్షునిగా బి. రామకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు. శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎండి, హమీద్, ఎన్. శివ, పి. ఇలేష్ లను నియమించిందని, జిల్లాలోని మున్సిపాలిటీలలో, డివిజన్ లలో, మండలాలలో, గ్రామా స్థాయిలో త్వరలో ఐఎన్‌టియుసి కొత్త కార్యవర్గాన్ని నియమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.డి.చంద్ర శేఖర్, వై. నాగన్న గౌడ్ , ఎల్.డి. పాల్, ఏం.నర్సింగ్ రావు, రాఘవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో అంకెల గారడీ : దాసోజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల అంచనాలు, అవసరాలు, ఆలోచనలకు పూర్తిగా భిన్నంగా ఉందని బిఆర్‌ఎస్ శాసనమండలి సభ్యుడు డాక్టర్ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. శాసన మండలి లో బడ్జెట్‌పై మాట్లాడిన ఆయన, ప్రభుత్వం సమర్పించిన అధికారిక గణాంకాలనే ఆధారంగా తీసుకుని పలు కీలక ప్రశ్నలను లేవనెత్తారు. బడ్జెట్ అంచనా లు, వాస్తవ ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసాలు ఉండటం వల్ల బడ్జెట్‌పై ప్రజల్లోనే కాకుండా ప్రభుత్వ యంత్రాంగంలో కూడా విశ్వాసం దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.2 లక్షల కోట్ల బడ్జెట్ అం చనాలు పెట్టగా వాస్తవంగా రూ.1.67 లక్షల కోట్లే ఖర్చయినట్లు తెలిపారు. అదే విధంగా 2025–26 లో రూ.2.29 లక్షల కోట్ల అంచనాలు పెట్టి, ఇప్పటివరకు కేవలం రూ. 2.03 లక్షల కోట్లే సాధ్యమైనట్లు వివరించారు. అయినప్పటి కీ ఇప్పుడు మరోసారి రూ.2.41 లక్షల కోట్ల భారీ అంచనాలు పెట్టడం అసంబద్ధమని విమర్శించారు. బడ్జెట్ అంచనాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలని, సాధారణంగా 5 నుండి 10 శాతం వరకు మాత్రమే వ్యత్యాసం ఉండాలని పేర్కొన్న శ్రవణ్, ప్రభుత్వం మాత్రం ప్రతిసారి భారీ అంచనాలు చూపించి చివరికి తక్కువ ఖర్చు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని అన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి బిజెపి యత్నం..

**ప్రజాపక్షం /హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిజెపి మరోసారి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో నగరంలో బషీర్‌బాగ్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. బషీర్బాగ్ ఫ్లైఓవర్ నుంచి అసెంబ్లీ వైపు కాలినడకన బయలుదేరారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు, ఇతర సంక్షేమ పథకాల హామీలను ప్రభుత్వం విస్మరించిందని శంకర్ ధ్వజమెత్తారు.

# హైదరాబాద్ అభివృద్ధికి రూ.15 వేల కోట్లు

హైదరాబాద్ అభివృద్ధిపై రాజీపడం
శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం రూ.15 వేల కోట్లకు పైగా నిధులతో ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో హైదరాబాద్ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలపై బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కె.పి.వివేకనంద, ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సిహెచ్.మల్లా రెడ్డి, మాధవరం కృష్ణారావు, పి.సబితా ఇంద్రా రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. హెచ్‌సిటీలో రూ.7,032 కోట్ల అంచనాలతో 26 కీలక పనులు చేపడుతామన్నారు. రూ.1,500 కోట్లతో 49 లింకు రోడ్ల నిర్మాణం చేస్తామని, రూ.7,406 కోట్లతో మూడు భారీ కారిడార్లను ఆమోదించామన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో రోడ్ల అభివృద్ధికి రూ.2,250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం వదిలేసిన పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తున్నదని చెప్పారు. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాజకీయం చేస్తున్నాయని, విమర్శలు మానేసి విలువైన సలహాలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి నగరంలో గణనీయమైన మార్పును ప్రజలు చూస్తారని మంత్రి అన్నారు.

### ప్రోటోకాల్ వివాదం

బిఆర్‌ఎస్ సభ్యులు మల్లారెడ్డిపై మంత్రి శ్రీధర్ బాబు చలోక్తులు విసిరారు. 'కొత్త పెండ్లి కొడుకు (మల్లారెడ్డి) నిజాలు మాట్లాడాలి, సభ బయట ఒకలా, లోపల పక్కన ఉన్న వారిని చూసి మరోలా మారుతున్నారు' అని మంత్రి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఎంఎల్‌ఎ కృష్ణారావు తనపై ఓడిపోయిన వ్యక్తి పేరు శిలాఫలకంపై ఉందని, ప్రోటోకాల్ ఉల్లంఘించారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో తాము కూడా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు గురయ్యామని, అప్పటి మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకపోయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు అన్ని నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. నగరంలో చెత్త సమస్య పరిష్కారానికి ఒకే చోట కాకుండా మూడు, నాలుగు ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తామని మంత్రి వివరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామని, ఫ్యూచర్ సిటీ ద్వారా నగరంపై వత్తిడిని తగ్గిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

'శ్రీధరన్న.. జర నామీద పగబట్టకే!' : మల్లా రెడ్డి శాసనసభ వేదికగా మేడ్చల్ ఎంఎల్‌ఎ మల్లారెడ్డి తన విలక్షణ ప్రసంగంతో సభలో నవ్వులు పూయించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై మాట్లాడుతూ నగరం నలుమూలల నుంచి వచ్చే చెత్త వల్ల అక్కడ ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 'దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గమైన మేడ్చల్‌ను ముక్కలు చేశారు. అసలు నేను ఎందుకు ఎంఎల్‌ఏగా ఉన్నానా అని బాధపడుతున్నా' అని ఆయన వ్యాక్యానించారు. ఇదే క్రమంలో మంత్రి శ్రీధర్ బాబును ఉద్దేశించి 'శ్రీధరన్న.. జర నామీద పగబట్టకే.. మా జిల్లా ఇన్ చార్జ్ మంత్రివి నువ్వే' అంటూ వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి.

# సరదా.. సరదాగా...

కలిసి భోజనం చేసిని కెటిఆర్, రాజగోపాల్ రెడ్డి , పాయల్ శంకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో ఆసక్తికర సన్నివేశం ఆవిష్కృతమైంది. శాసనసభలో నువ్వా నేనా అన్నట్టు ఉండే సభ్యులు.. బయటకు వచ్చిన తర్వాత సోదర స్వభావంతో కలిసిపోతారు. అసెంబ్లీ లాబీతో పాటు పార్టీల శాసనసభా పక్ష కార్యాలయాల్లో ఛలోక్తులు విసురుకుంటూ సరదాగా ఉంటారు. అలాంటి సన్నివేశమే మంగళవారం అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో కనిపించింది. భోజన విరామ సమయంలో అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కెటిఆర్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ కలిసి భోజనం చేశారు. భోజనం ముగించాక కూడా మెంబర్స్ లాంజ్‌లోనే ఆ ముగ్గురు సుదీర్ఘంగా పలు అంశాలపై చర్చించారు. సుమారు 2 గంటలకు పైగా ఈ ముగ్గురు సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం.

### భేటీకి ప్రాధాన్యత

కెటిఆర్, రాజగోపాల్ రెడ్డి, పాయల్ శంకర్ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొంతకాలంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి కూడా కాంగ్రెస్‌ను వీడి ప్రత్యామ్నాయ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. రాజగోపాల్ రెడ్డి కూడా పలు సందర్భాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని బహిరంగంగానే హెచ్చరించారు. నేరుగా సిఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. జీవన్‌రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీలో చేరుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసానికి టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ విప్ ఆది శ్రీనివాస్ వెళ్ళి ఆయనతో చర్చలు జరిపారు. మొత్తానికి కెటిఆర్, రాజగోపాల్ రెడ్డి, పాయల్ శంకర్ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# పునర్విభజన ప్రక్రియపై.. కాంగ్రెస్, ఇండియా కూటమి తప్పుడు ప్రచారం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు
ఎన్. రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ, ఇండి కూటమి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మీడియా ప్రతినిధులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారత్ రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే వాదనలో నిజం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అనేది ప్రతి జనగణన తర్వాత జరిగే రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియ అన్నారు. 2026 జనగణన అనంతరం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రస్తుత సీట్ల ప్రాతిపదికన ప్రపోర్షనేట్‌గా పునర్విభజన జరుగుతుందన్నారు. కేవలం జనాభా ప్రాతిపదికనే కాకుండా, ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్‌ల ఆధారంగా సమతుల్య విధానంలో సీట్ల పెంపు ఉంటుందన్నారు. హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో జనాభా తక్కువ ఉన్నా సీట్లు అధికంగా ఉన్నాయని, దక్షిణ రాష్ట్రాల సీట్లు తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలను మానుకోవాలన్నారు.

### మతం మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవు : సుప్రీం తీర్పుపై హర్షం

ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును రాంచందర్ రావు స్వాగతించారు. మతం మారిన తర్వాత కూడా ఎస్‌సి, ఎస్‌టి హక్కులను వినియోగించుకోవడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం చారిత్రాత్మకమన్నారు. మతం మారిన వారు ఎస్‌సి, ఎస్‌టి హోదాను కోల్పోతారని కోర్టు స్పష్టం చేయడం వల్ల నిజమైన అర్హులకే ఫలాలు అందుతాయని తెలిపారు. ఏపి హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి హక్కుల దుర్వినియోగానికి ఈ తీర్పుతో ముగింపు పలికినట్లయిందని రాంచందర్ రావు అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల 4473 మంది లబ్ధిదారులకు రూ.48.79 కోట్లు విడుదల

హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 4473 మంది లబ్ధిదారులకు రూ.48.79 కోట్లను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం తెలిపారు. ప్రతి వారంఇండ్ల నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేస్తున్నామని వెల్లడించారు. గత వారానికి సంబంధించి రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసిన 1969 మంది లబ్ధిదారులకు రూ.17.23 కోట్లు, స్లాబు పూర్తి చేసిన 2504 మందికి రూ.31.56 కోట్లు విడుదల చేశామని చెప్పారు.లక్ష ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని విపి గౌతం వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ.5376.22 కోట్లను విడుదల చేసినట్లు గౌతం వివరించారు. ఇంటి నిర్మాణపు పురోగతిని బట్టి విడతల ఇంతవరకు బేస్ మెంట్ నిర్మాణం పూరైన వాటికి రూ. 2125.98 కోట్లు, గోడలు పూర్తి అయి రూఫ్ లెవల్ వరకు వచ్చిన ఇండ్లకు రూ.1518.51 కోట్లు, స్లాబ్ పూరైన వాటికి రూ.1731.73 కోట్లు విడుదల చేశామని ఆయన తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 2.65 లక్షల ఇండ్ల పనులు ప్రారంభంగా కాగా, వాటిలో ఇంతవరకు 1,13,365 ఇళ్ల స్లాబు పూర్తి కాగా, 34,552 ఇండ్లు రూఫ్ లెవల్ (గోడల నిర్మాణం పూర్తి) దశలో ఉన్నాయని, మరో 61 వేల ఇండ్ల బేస్ మెంట్ నిర్మాణాలు పూర్తి అయ్యాయని విపి గౌతం వివరించారు.

# అగ్రశ్రేణి మావోయిస్టు పాపారావు సహా 17 మంది లొంగుబాటు

ఎకె– 47,ఇతర గ్రెనేడ్లు,ఆయుధాలు అప్పగింత
ఛత్తీస్‌గఢ్‌లో ఇక క్రియాశీల సీనియర్ నేతలు లేరు
ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ ప్రకటన
ప్రభుత్వం విధించిన గడువు ఇక ఐదు రోజులే



**రాయ్‌పూర్/కవార్ధా:** మావోయిస్టు ఉద్యమంలో చిట్టచివరిగా ఇంకా మిగిలిపోయిన సీనియర్ మావోయిస్టు కమాండర్లలో ఒకరు పాపారావు అలియాస్ మంగు తన 17 మంది బృందంతో కలిసి పోలీసులకు లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. వారి వద్ద ఉన్న ఎకె–47 రైఫిల్స్, ఇతర గ్రెనేడ్స్, ఆయుధాలను కూడా పోలీసు అధికారులకు అప్పగించారు. ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో, ప్రభుత్వం విధించిన గడువు సమీపిస్తున్న తరుణంలో పాపారావు లొంగుబాటు ఒక పెద్ద మైలురాయి ఘట్టమని పోలీసు అధికారులు చెప్పారు. పాపారావు నాయకత్వంలో దక్షిణ బస్తర్‌లో భద్రతా దళాలపై అత్యంత ప్రాణాంతకమైన దాడులను మావోయిస్టులు ఆయన వ్యూహాలకు అనుగుణంగా అమలు చేశారని, వీరి లొంగుబాటుతో దండకారణ్య మావోయిస్టు ఉద్యమ చరిత్రలో మొదటిసారి వారికి నాయకత్వం కొరవడిందని చెప్పారు. దంతెవాడ జిల్లా (ప్రస్తుతం సుక్మా) తాడ్‌మెట్లలో 2010లో అంత్యత ప్రాణాంతకమైన దాడులకు వీరు పాల్పడ్డారని, ఆనాడు గాలంపు చర్యలలో ఉన్న 76 మంది పోలీసులు హతులయ్యారని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) పి.సుందర్రాజ్ చెప్పారు. బీహార్, ఛత్తీస్‌గఢ్,జార్ఖండ్,ఒడిశా,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని భాగాలతో ''పశుపతి నుండి తిరుపతి'' వరకూ ఒకనాడు విస్తరించి ఉన్న ''రెడ్ కారిడార్'' ప్రాంతాన్ని దేశంలో అంతర్గత భద్రతకు అత్యంత సవాలుగా ప్రభుత్వం పరిగణించింది. వీరి లొంగుబాటుకు ముందుగా మంగళవారం ఉదయం ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ మాట్లాడుతూ, పాపారావు అలియాస్ మంగు తన 17 మంది పైగా బృందంతో పోలీసులకు లొంగిపోతున్నారని ప్రకటించారు. ఆయన లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్‌లో ఇక క్రియాశీల సీనియర్ మావోయిస్టు నాయకులు లేరని అన్నారు.సాయుధ నక్సలిజం లేని రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్‌ను తీర్చిదిద్దేందుకు మావోయిస్టుల నిర్మూలనకు, లొంగుబాటుకు ప్రభుత్వం 2026 మార్చి 31వ తేదీని తుది గడువుగా నిర్దేశించిందని మంత్రి చెప్పారు. ఆయనకు జనజీవన స్రవంతిలో పునరావాసం కల్పించడం ద్వారా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల ఉనికి దాదాపుగా సమర్థవంతంగా ముగింపు దశకు వచ్చిందని చెప్పారు.ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌కు సంబంధించి గడ్చిరోలీలో లేదా తెంగాణలో కొంతమంది మాత్రమే క్రియాశీలంగా ఉన్నారని,ఈ వారంలో మరింతమంది లొంగిపోతారని ఆశిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఒక సమర్థవంతమైన వ్యూహం ద్వారా వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టాయన్నారు.''సమాధాన్'' సిద్ధాంతం కింద ప్రభుత్వం బహుముఖ వైఖరులు అనుసరించిందన్నారు.గూఢచర్యాన్ని పెంచామని, పోలీసు ఆధునీకరణ, మౌలిక సదుపాయాల వృద్ధి వంటి అనేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి) సభ్యుడు, దక్షిణ సబ్‌జోనల్ మావోయిస్టు బ్యూరో ఇన్‌ఛార్జి పాపారావు మంగళవారం తన బృందం సభ్యులతో కలిసి లొంగిపోవడం ఈ ప్రాంతంలో వామపక్ష తీవ్రవాదానికి తెరదించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఒక నిర్ణయాత్మకమైన పురోగతి ఘట్టమని,ఈ విడత లొంగిపోయిన మావోయిస్టు ప్రముఖులలో డివిజనల్ కమిటీ సభ్యులు ప్రకాశ్ మాధవి, అనిల్ తట్టి ఉన్నారని ఐజిపి సుందర్రాజ్ చెప్పారు. ఇక బస్తర్ ఎంతో సానుకూలమైన భవిష్యత్తుకు అనుకూలంగా మారిందని చెప్పారు. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ బస్తర్ డివిజన్‌లో మావోయిస్టు కార్యకలాపాలు నిర్వహిస్తుంది. సమీప రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో వారు కార్యకలాపాలు నిర్వహిస్తారు.నిషిద్ధ సిపిఐ(మావోయిస్టు) కార్యకర్తలు గడచిన రెండు దశాబ్దాలుగా భద్రతా దళాలపై అత్యంత ప్రమాదకరమైన దాడులు చేస్తున్నారని సుందర్రాజ్ చెప్పారు. ఇంకా కొంతమంది మాత్రమే మిగిలి ఉన్నారని, వారు చిన్న చిన్న గ్రూపులుగా విడిపోయి సంచరిస్తున్నారని, వారు కూడా రాబోయే రోజుల్లో శాంతి మార్గాన్ని ఎంచుకుంటారని తాము ఆశాభావంతో ఉన్నామని అన్నారు. లొంగిపోయిన ఈ 18 మంది మావోయస్టులు జనజీవన స్రవంతిలో ఏకమయ్యే ప్రక్రియను ఆ తర్వాత నిర్వహిస్తామని చెప్పారు. రెండు దశాబ్దాలుగా ఇంద్రావతి,అబుజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు లొంగిపోయిన పాపారావు చిట్టచివరి మావోయిస్టు సీనియర్ కమాండర్లలో ఒకరని ఆయన చెప్పారు. గడచిన 12 ఏళ్ళలో లొంగిపోయిన

### 10 వేలమంది కార్యకర్తలు

గడచిన పన్నెండు సంవత్సరాలలో (2014–2026 మార్చి) దేశవ్యాప్తంగా 10,000 మంది మావోయిస్టు కార్యకర్తలు, నాయకులు లొంగిపోయారని అధికార గణాంకాలు తెలియజేశాయి. వీరిలో కేవలం 2025లో మాత్రమే 2,300 మంది కార్యకర్తలు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. 2026 మొదటి మూడు నెలల్లో ఇప్పటికే 630 మంది లొంగిపోయారు.దీంతో మావోయిస్టు నాయకత్వం కూడా కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించలేని పరిస్థితులు వచ్చాయి. ప్రత్యేకించి తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో వందలమంది కార్యకర్తలు జన జీవన స్రవంతిలోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నారని అధికార గణాంకాలు,సమాచారం తెలియజేసింది. గడచిన పది సంవత్సరాలుగా మావోయిస్టు ఉద్యమం క్రమంగా క్షీణదశకు చేరింది.

## పశ్చిమాసియా పరిస్థితి సమీక్షపై నేడు అఖిలపక్ష భేటీ

**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియా సంక్షోభంపై ప్రభుత్వం బుధవారం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వర్గాలు తెలిపాయి. పశ్చిమ ఆసియా పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో ప్రసంగించిన అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ఏర్పడిన క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఉందని ప్రధాని సోమవారం అన్నారు. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో దేశం ఎలా ఐక్యంగా నిలిచిందో, అలాగే ఇప్పుడు కూడా సంసిద్ధంగా, ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంధనం, ఎరువులు, జాతీయ భద్రత, భారతదేశంలోని ఇతర రంగాలపై, అలాగే పశ్చిమ ఆసియా ప్రాంతంలో నివసిస్తున్న భారత పౌరులపై పడుతున్న ప్రభావానికి సంబంధించిన ఆందోళనలను లోక్‌సభలో మోదీ ప్రస్తావించారు. సాధారణ కుటుంబాలు వీలైనంత తక్కువ ఇబ్బందులను ఎదుర్కొనేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై భారత పార్లమెంటు నుంచి ప్రపంచానికి ఒక ఏకగ్రీవ స్వరం వినిపించాలని ఆయన అన్నారు. మానవత్వం, శాంతి పట్ల భారతదేశానికి ఉన్న అచంచలమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, సంప్రదింపులే పరిష్కారానికి ఏకైక మార్గమని, ప్రతి భారత ప్రయత్నం ఉద్రిక్తతలను తగ్గించడం, శత్రుత్వాలను విరమించడానికే ఉద్దేశించబడిందని ప్రధాని అన్నారు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగించడాన్ని ఖండించనందుకు కాంగ్రెస్ మోదీపై విమర్శలు గుప్పించింది. పశ్చిమ ఆసియా సంక్షోభంపై లోక్‌సభలో ఆయన చేసిన ప్రకటనను 'స్వీయ ప్రగల్భాలు, పిరికితనం, పక్షపాతపూరిత ప్రసంగాలకు ఒక చక్కటి ఉదాహరణ' అని తీవ్రంగా విమర్శించింది. గల్ఫ్ దేశాలలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తూ, పనిచేస్తున్నందున పశ్చిమ ఆసియా భారతదేశానికి చాలా ముఖ్యమైనదని మోదీ అన్నారు. ఈ సముద్రాలలో ప్రయాణించే వాణిజ్య నౌకలలో అధిక సంఖ్యలో భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ' వివిధ కారణాల వల్ల, భారతదేశ ఆందోళనలు సహజంగానే ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల, ఈ సంక్షోభంపై భారత పార్లమెంటు నుండి వెలువడే ఏకగ్రీవ, సమైక్య స్వరం ప్రపంచానికి చేరడం అత్యవసరం' అని మోదీ అన్నారు.

## క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఎస్‌సిలకు ఆ హోదా దక్కదు

**న్యూఢిల్లీ :** కులం హోదా అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులు మాత్రమే షెడ్యూల్ కులాల కింద హోదా పొందేందుకు అర్హులని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం స్పష్టం చేసింది. ఈ మూడు మతాలు కాకుండా మరో మతానికి మారితే ఎస్‌సిలకు ఆ హోదా ఉండదని కోర్టు పేర్కొన్నది. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారికి షెడ్యూల్ కులాల హోదా దక్కదని కోర్టు స్పష్టం చేసింది. అంటే ఓ దళిత వ్యక్తి ఎవరైనా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే, అప్పుడు అది ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని సుప్రీం పేర్కొన్నది. జస్టిస్ పికె మిశ్రా, మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఆ ఆదేశాలు ఇచ్చింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు కాకుండా మరో మతానికి మారితే , వారు ఎస్‌సి హోదాను కోల్పోతారని కోర్టు చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్టర్ చిందాడ ఆనంద్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి ఈ ఆదేశాలు ఇచ్చింది. మే 2025లో ఏపి హైకోర్టు ఈ కేసులో తీర్పును వెలువరించింది. అక్కాల రామిరెడ్డి అనే వ్యక్తి నుంచి కుల వివక్షణ ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఆనంద్ తన పిటీషన్‌లో పేర్కొన్నాడు. ఎస్‌సి చట్టం కింద ఆ పాస్టర్ ఫిర్యాదు నమోదు చేశాడు. అతని ఫిర్యాదు ప్రకారం పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అయితే ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆనంద్ అనే వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించడం వల్ల ఎస్‌సి హోదాను కోల్పోయాడని, అందుకే ఆ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ ఎన్ హరినాథ్ తన తీర్పులో పేర్కొన్నారు. క్రైస్తవాన్ని ప్రచారం చేస్తున్న దళిత వ్యక్తి.. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద న్యాయం పొందలేదని కోర్టు చెప్పింది. క్రైస్తవ మతానికి మారడం వల్ల ఆనంద్ వద్ద ఉన్న ఎస్‌సి సర్టిఫికేట్ పనికిరాదు అని కోర్టు తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పును తప్పుపడుతూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే హైకోర్టు తీర్పును సమర్థిస్తూ మంగళవారం సుప్రీం తీర్పును ఇచ్చింది.

'పర్మినెంట్ కమిషన్' నిరాకరించబడిన మహిళా ఎస్‌ఎస్‌సి అధికారులు...

## పూర్తి పింఛన్ ప్రయోజనాలకు అర్హులు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ఏకపక్ష మదింపు కారణంగా 'పర్మినెంట్ కమిషన్' (పిసి) నిరాకరించబడిన సైన్యం, నేవీ, వైమానికదళంలోని మహిళా షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి) అధికారులు పూర్తి పింఛన్ ప్రయోజనాలకు అర్హులని మంగళవారం సుప్రీంకోర్టు ఒక కీలక తీర్పును వెలువరించింది. ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, ఎన్.వి.కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ అధికారులు అంతకుముందే సర్వీస్ నుంచి విడుదల అయినప్పటికీ పింఛన్‌కు అవసరమైన కనీస అర్హత సర్వీస్ అయిన 20సంవత్సరాలను పూర్తి చేసినట్లుగా పరిగణించబడతారని తీర్పులో స్పష్టం చేసింది. 2019లో జరిగిన విధాన మార్పులు, గత సాయుధ దళాల ట్రిబ్యునల్ (ఎఎఫ్‌టి) తీర్పుల ఆధారంగా పర్మినెంట్ కమిషన్ (పిసి) ఏర్పాటును సవాల్‌చేస్తూ వింగ్ కమాండర్ వింగ్ కమాండర్ సుచేత ఎడాన్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లతో సహా పలు పిటిషన్లపై ఈ తీర్పు వెలువడింది. తీర్పులోని కీలక భాగాలను చదివిన సిజెఐ సూర్యకాంత్ మహిళా అధికారులు కెరీర్ ప్రగతికి లేదా శాశ్వత కమిషన్‌కు అర్హులు కారని భావించి వారి వార్షిక గోప్య నివేదిక(ఎసిఆర్)లను తరచుగా అలక్ష్యంగా గ్రేడ్ చేస్తున్నారని తెలిపారు. 'వారికి కెరీర్ పురోగతి ఉండదనే ఊహతో ఎసిఆర్‌లు రాశారు. ఇది వారి మొత్తం పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపింది' అని ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. వైమానిక దళం,నావికాదళం, సైన్యానికి చెందిన ఎస్‌ఎస్‌సి మహిళా అధికారులకు పర్మినెంట్ కమిషన్ నిరాకరించిన విషయాన్ని ధర్మాసనం విడిగా విచారించింది. వాయు సేనకు సంబంధించి ప్రవేశపెట్టిన 'సేవా కాల ప్రమాణాలు', 'కనీస పనితీరు ప్రమాణాలు' తొందరపాటుతో అమలుచేయబడ్డాయని, వాటిని నెరవేర్చడానికి అధికారులకు సహేతుకమైన అవకాశాన్ని నిరాకరించారని ధర్మాసనం కనుగొంది. సంపూర్ణ న్యాయం చేయడానికి ఎలాంటి ఉత్తర్వులైనా జారీచేసే అధికారాన్ని సుప్రీంకోర్టుకు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకున్న అసాధారణ అధికారాలను ఉపయోగించి, 2019, 2020, 2021 సంవత్సరాలలో జరిగిన సెలక్షన్ బోర్డులలో శాశ్వత కమిషన్ కోసం పరిగణించబడిన ఎస్‌ఎస్‌సి అధికారులు అందరినీ ఒకేసారి తీసుకునే చర్యగాతొలగించాలని ధర్మాసనం ఆదేశించింది. 2021 లో విడుదలైన వారితో సహా 20 సంవత్సరాల అర్హత కలిగిన సేవను పూర్తి చేసినట్లుగా పరిగణించబడతారు. ఈ 20 ఏళ్ల డీమ్డ్ సర్వీస్ ఆధారంగా పింఛన్‌ను నిర్ణయిస్తారని, ఇది 2025 నవంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని ధర్మాసనం తెలిపింది. అయితే కోర్టు కార్యాచరణ సామర్థ్యాన్ని కారణంగా చూపిస్తూ పున: స్థాపనకు ఆదేశించడానికి నిరాకరించింది. కానీ ఇది ఆర్థిక ప్రయోజనాలకు ఒక కారణంగా ఉండకూడదని పేర్కొంది. క్రియాశీల సేవలో లేని వారికి వింగ్ కమాండర్ హోదాకు నామమాత్రపు టైం స్కేల్ పదోన్నతి ఇవ్వాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. వివరణాత్మక తీర్పు రావాల్సి ఉంది. అంతకుముందు, తొలగింపులు ఉన్నాయని చెబుతూ కేంద్రం తన విధానాన్ని సమర్థించుకుంది.

# కొవిడ్ విషాదాలు మోదీ మరిచారు!

- పశ్చిమ ఆసియా పరిస్థితిపై పార్లమెంటులో చేసిన ప్రసంగంలో కొవిడ్‌నాటి దుస్థితిని ప్రస్తావించడంపై రాహుల్ మండిపాటు
- భారత విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని విమర్శ




**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియా పరిస్థితిపై పార్లమెంటులో చేసిన తన ప్రకటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొవిడ్ 19ను ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. మహమ్మారి సమయంలో ఏమి జరిగిందో, అప్పట్లో చోటుచేసుకున్న విషాదాలను ఆయన మరిచిపోయారని రాహుల్ గాంధీ అన్నారు. భారత విదేశాంగ విధానం 'మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానం'గా మారిందని, దీనిని అందరూ ఒక సార్వత్రిక హాస్యంగా పరిగణిస్తున్నారని రాహులర్‌గాంధీ ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ భవన ప్రాంగణంలో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే' అని అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పాకిస్థాన్ ఒక మధ్యవర్తిగా ఉందన్న వార్తలు, పశ్చిమ ఆసియా సంక్షోభంపై భారతదేశ వైఖరి గురించి అడగ్గా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు బదులిస్తూ 'మన విదేశాంగ విధానం ప్రధాని మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారింది. దీని ఫలితాలు మీరే చూడవచ్చు, ప్రతి ఒక్కరూ దీనిని ఒక సార్వత్రిక హాస్యంగా భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు, మోదీ ఏమి చేయగలరో, ఏమి చేయలేరో స్పష్టంగా తెలుసు. ప్రధాని రాజీపడితే, మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్లే, ఇది స్పష్టమే' అని అన్నారు. సోమవారం మోదీ లోక్‌సభలో అసంబద్ధమైన ప్రసంగం చేశారని, ఆయన భారత ప్రధాని, ఆ విధంగానే కనిపించాలి కానీ ఎలాంటి పదవి వారిలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది ప్రజలకు హాని కలిగిస్తుండడం విచారకరమన్నారు. ఇది ఆరంభం మాత్రమే ఎల్‌పిజి, పెట్రోల్, ఎరువులు, ఇవన్నీ సమస్యను సృష్టిస్తాయియని, కొవిడ్ లాంటి సమయం వస్తోందని మోదీజీ అన్నారు, అప్పుడు ఏం జరిగిందో, ఎంత మంది చనిపోయారో, ఎలాంటి విషాదాలు చోటు చేసుకున్నాయో ఆయన మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన లేదని ఆయన ఆరోపించారు. కేరళలో తనకు ఒక కార్యక్రమం ఉన్నందున, పశ్చిమాసియాపై బుధవారం జరిగే అఖిలపక్ష సమావేశంలో తాను పాల్గొనలేనని తెలిపారు. 'వారు అఖిలపక్ష సమావేశం పిలిచారు, అందులో చర్చ జరగాలి. కానీ మీరు ఒక నిర్మాణాత్మకమైన తప్పు చేశారు, మీరు వ్యవస్థను నాశనం చేశారు. దానిని సరిదిద్దలేము. ప్రధాని అది చేయలేరు, నేను మీకు రాతపూర్వకంగా చెప్పగలను, అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిందే ప్రధాని చేస్తారు. ఆయన భారతదేశం, దేశ రైతుల ప్రయోజనాల కోసం పనిచేయరు, అమెరికా, ఇజ్రాయెల్ చెప్పినట్లే చేస్తారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ఏర్పడిన క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఉందని, కొవిడ్ మహమ్మారి సమయంలో దేశం ఎలా ఐక్యంగా నిలబడిందో, అదే విధంగా ఇప్పుడు కూడా సంసిద్ధంగా, ఐక్యంగా ఉండాలని మోదీ సోమవారం పిలుపునిచ్చారు.

# మహిళా కోటా అమలుపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయండి

ప్రభుత్వానికి పలు ప్రతిపక్ష పార్టీలు లేఖ



**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాలను చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ, పలు ప్రతిపక్ష పార్టీలు మంగళవారం ప్రభుత్వానికి లేఖ రాశాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు రాసిన ఈ లేఖలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్‌లో పూర్తయిన తర్వాతే ఈ సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియం–2023 అమలుకు సంబంధించిన విధివిధానాలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు మీరు ఆకాంక్షించినట్లుగానే ప్రధానమంత్రి అధ్యక్షతన వీలైనంత త్వరగా ఒక అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ, నేను ఈనెల 16న మీకు లేఖ రాసిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లెటర్‌హెడ్‌పై రాసిన ఆ లేఖలో పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మినహా, పలు ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఈ లేఖపై సంతకాలు చేశారు. లోక్‌సభ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యేలోపే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలయ్యేలా చూసేందుకు, పార్లమెంట్ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో రెండు బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ 2023లో ఆమోదించిన 'నారీ శక్తి వందన్ బిల్లు'కు ప్రభుత్వం మరో సవరణ తీసుకురావాలని యోచిస్తున్నట్లు ప్రతిపక్ష నాయకులు తమ లేఖలో పేర్కొన్నారు. ఈ చట్టాన్ని అధికారికంగా 'రాజ్యాంగ (106వ సవరణ) చట్టం'గా వ్యవహరిస్తారు. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న తమ డిమాండ్‌ను ప్రతిపక్ష పార్టీలన్నీ ఇప్పుడు మరోసారి పునరుద్ఘాటిస్తున్నాయి. ఈ సమావేశం మరింత ఫలప్రదంగా సాగాలంటే, అసలు ఏమి ప్రతిపాదిస్తున్నారో వివరంగా తెలియజేసే ఒక వివరణాత్మక పత్రాన్ని ప్రభుత్వం ముందుగానే పంపిణీ చేయడం అత్యవసరం. 'ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 29న పూర్తయిన తర్వాతే ఈ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ భవనంలో రిజిజును కలిసిన అనంతరం కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఆ లేఖను ఆయనకు అందజేశారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయాన్ని ప్రతిపక్ష నాయకులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఉదయం, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో ఈ నాయకుల సమావేశం జరిగింది. ఈ లేఖపై సంతకం చేసిన వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్, ఆప్ (ఆప్) నాయకుడు సంజయ్ సింగ్, శివ సేన (యుబిటి) నాయకులు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ ఉన్నారు. వీరితో పాటు సిపిఐ(ఎం) నాయకుడు జాన్ బ్రిట్టాస్, సిపిఐ నాయకుడు పి. సంతోష్ కుమార్, ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకులు సుప్రియా సూలే, ఫౌజియా ఖాన్, జెఎంఎం నాయకులు మహువా మాజీ, జోబా మాజీ, ఎన్.కె. ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పి), తిరుమావలవన్ తొల్కాప్పియన్ (విసికె), ఇ.టి. మహమ్మద్ బషీర్ (ఐయుఎంఎల్)తో పాటు జెకెఎన్‌సి, సిపిఐ(ఎంఎల్) , డిఎంకె పార్టీల నాయకులు కూడా ఈ లేఖపై సంతకం చేసిన వారిలో ఉన్నారు.

# వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అమెరికాకు తాకట్టు

ఆర్థిక బిల్లుపై చర్చలో ప్రతిపక్షాలు మండిపాటు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వం తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని అమెరికాకు తాకట్టు పెట్టిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే దేశం, ప్రజల సర్వతోముఖాభివృద్ధికి తీసుకున్న చర్యలను అధికార కూటమి ప్రశంసించింది. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2026పై జరిగిన చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ మాట్లాడుతూ దేశం నుండి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ), విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పిఐ) భారీగా తరలిపోతున్నాయని, దీనివల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం లేదన్నారు. రూపాయి విలువ భారీగా పడిపోయిందని, దాని పతనాన్ని అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ, ఈ ఒప్పందం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్‌ను తెరుస్తుందని చండీగఢ్ ఎంపి పేర్కొన్నారు. అమెరికా ఒత్తిడి కారణంగా రష్యా చమురు కొనకూడదని అంగీకరించడం ద్వారా భారత దేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని తాకటు పెటిందని తివారీ ఆరోపించారు. అయితే అదే అమెరికా ఇప్పుడు రష్యా చమురు మాత్రమే కాకుండా ఇరాన్ చమురును కూడా కొనుగోలు చేయమని దేశాలను ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం వల్ల భారతదేశంపై పడే భారం ఏమిటని, అలాగే బెంగాల్ ఎన్నికల రెండో దశ ఏప్రిల్ 30న ముగిసిన తర్వాత దేశంలో పరిస్థితి ఎలా ఉంటుందని కాంగ్రెస్ ఎంపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ చర్చలో పాల్గొన్న బిజెపి సభ్యుడు నవీన్ జిందాల్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎలాంటి వాస్తవాలు లేదా ఆధారం లేకుండా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల తమ నియోజకవర్గ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందనే విషయాన్ని గ్రహించకుండా, ప్రతిపక్షాలు కేవలం నిరసనలు, ఆటంకాలకే పరిమితమవుతున్నాయని కురుక్షేత్ర ఎంపి పేర్కొన్నారు. 2026–27 బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు సహాయపడుతుందని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహిస్తుందని జిందాల్ అన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల సంక్షేమం కోసమే పనిచేస్తుందని ఆయన తెలిపారు. తమ 11 ఏళ్ల పాలనలో ఎన్‌డిఎ ప్రభుత్వం కొవిడ్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధం వంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, ప్రతి సంక్షోభాన్ని ధైర్యంగా ఎదుర్కొని తిరిగి ప్రగతి పథంలోకి వచ్చిందని జిందాల్ అన్నారు. ప్రభుత్వం నిరంతర కృషి వల్లే భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆయన అన్నారు. జెడియు ఎంపి, అధికార కూటమి సభ్యుడు రామ్‌ప్రీత్ మండల్ మాట్లాడుతూ, ఎన్‌డిఎ ప్రభుత్వం దేశానికి సర్వతోముఖాభివృద్ధిని తీసుకువచ్చిందని, సమాజంలోని పేద, అట్టడుగు వర్గాల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రశంసించారు. బిహార్‌లోని ఝంఝార్‌పూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మండల్, ఆ తూర్పు రాష్ట్ర పారిశ్రామికీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బిహార్ అభివృద్ధి చెందితే, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరచడంలో ప్రభుత్వం విఫలమైందని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన పుష్పేంద్ర సరోజ్ ఆరోపించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ, జల్ జీవన్ మిషన్, నమామీ గంగా ప్రాజెక్ట్ వంటి పథకాలకు ఉత్తరప్రదేశ్‌కు ఎంత నిధులు కేటాయించారో తెలుసుకోవాలని ఆయన కోరారు. ఒకప్పుడు భారతదేశం తన స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడిందని, కానీ ఇప్పుడు ఆ దేశం అనేక దేశాలతో సంబంధాలను తెంచుకుందని ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి ఎంపి పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని, దేశం అమెరికాపై ఆధారపడిపోయిందనే అభిప్రాయం ఏర్పడిందని కూడా ఆయన పేర్కొన్నారు. వాస్తవం ఏమిటంటే, మనం కేవలం ఆధారపడి ఉండటమే కాదు, అమెరికా ముందు లొంగిపోయాం అని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపి వంశీ కృష్ణ గడ్డం మాట్లాడుతూ దళిత వ్యాపార వ్యవస్థాపకులకు పన్నుల ఉపశమనం కల్పించాలని, అలాగే దళిత సిబ్బందిని నియమించుకునేలా యజమానులను ప్రోత్సహించడానికి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. భారతదేశంలో పెరుగుతున్న సంపద అంతరం గురించి, అలాగే ధనికుల కంటే పేదల నుంచే అధిక శాతం పన్నులు వసూలు అవుతున్న తీరు గురించి పలువురు ఎంపిలు ప్రస్తావించారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరించుకుంటోందని మహారాష్ట్ర కాంగ్రెస్ ఎంపి కిరణ్ నామ్‌దేవ్ ఆరోపించారు. ప్రజల కోసం ఉద్దేశించిన నిధులను అప్పులు తీర్చడానికి కేంద్రం వాడుకుంటోందని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ప్రియా సరోజ్ ఆరోపించారు. యుపిలోని మచ్చలీషా ఎంపి కూడా కార్పొరేట్ పన్నుల తగ్గింపును విమర్శిస్తూ, ఇప్పుడు ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని ప్రశ్నించారు. ఆజాద్ సమాజ్ పార్టీకి చెందిన చంద్రశేఖర్ (కాన్షీ రామ్), పెద్ద నోట్ల రద్దు, నిరుద్యోగం నుంచి ఎల్‌పిజి సంక్షోభం, ఎంఎస్‌ఎంఇలు ఎదుర్కొంటున్న సమస్యల వరకు భారత ఆర్థిక వ్యవస్థలోని అనేక సమస్యలను ప్రస్తావించారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఆర్థిక బిల్లు ఏం చేస్తుంది అని యుపిలోని నగిన ఎంపి ప్రశ్నించారు. పన్నుల వ్యవస్థలోని కొన్ని లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయు అన్నారు. బడ్జెట్‌పై కొన్ని విమర్శలు చేస్తూ, బడ్జెట్ కేటాయింపుల కంటే నిధుల వినియోగమే ముఖ్యమని ఆయన అన్నారు. చెల్లింపుల సమతుల్యత, స్వావలంబనను నిర్ధారించడానికి, 2028 నాటికి 10 లక్షల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జిపియులు) సాధించేలా ఎఐ లక్ష్యాన్ని రెండేళ్లకు ముందుకు తీసుకురావాలని ఆయన ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరారు. భారతీయ నిపుణులను దేశానికి తిరిగి తీసుకురావడం ద్వారా 'మేధో వలస'ను నివారించగల సెమీకండక్టర్ పరిశ్రమకు నిధులు కేటాయించినప్పటికీ, వాటిని ఖర్చు చేయడం లేదని ఆ టిడిపి శాసనసభ్యుడు ఆరోపించారు.



# ట్రాన్స్‌జెండర్ల రాజ్యాంగహక్కులపై దారుణ దాడి

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రాన్స్‌జెండర్ల (హక్కుల పరిరక్షణ) సవరణ బిల్లు, 2026పై రాహుల్ విమర్శ

**న్యూఢిల్లీ :** ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రాన్స్‌జెండర్ల (హక్కుల పరిరక్షణ) సవరణ బిల్లు, 2026పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ బిల్లు ట్రాన్స్‌జెండర్ల రాజ్యాంగ హక్కులు, గుర్తింపుపై 'దారుణమైన దాడి' అని అన్నారు. ప్రతిపాదిత ఈ చట్టాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఈ బిల్లు తిరోగమనమైనదిగా రాహుల్ అభివర్ణించారు. కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం సంకుచిత భావజాలం కోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ట్రాన్స్‌జెండర్ వర్గాలను గౌరవించిన భారతదేశపు గొప్ప చరిత్రను నాశనం చేస్తోందని ఆయన ఆరోపించారు. 'బిజెపి ప్రభుత్వ ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సవరణ బిల్లు ట్రాన్స్‌జెండర్ ప్రజల రాజ్యాంగ హక్కులు, గుర్తింపుపై ఒక దారుణమైన దాడి.ఈ తిరోగమన బిల్లు సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ, ట్రాన్స్ జెండర్ ప్రజల స్వీయ గుర్తింపు సామర్థ్యాన్ని హరించివేస్తుంది; భారతదేశవ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల విభిన్న సాంస్కృతిక గుర్తింపులను తుడిచివేస్తుంది; ట్రాన్స్‌జెండర్ ప్రజలను ఒక మెడికల్ బోర్డు ద్వారా అమానవీయ పరీక్షలకు గురిచేస్తుంది; ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా నేర శిక్షలు, నిఘాను ప్రవేశపెడుతుంది' అని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం ట్రాన్స్ కమ్యూనిటీని సంప్రదించకుండా, వారిని రక్షించడం కంటే అవమానించే బిల్లును తీసుకువచ్చిందని ఆయన ఆరోపించారు. 'ప్రతి భారతీయుడి జీవించే హక్కు, స్వేచ్ఛ, గుర్తింపు, గౌరవానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది.

# ఎన్నికల కంటే ప్రజాసమస్యలే ముఖ్యం

వాటి పరిష్కారానికి నిరంతర కృషి
'జన్ ఆక్రోష్' ర్యాలీలో సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబీ




**న్యూఢిల్లీ :** ఎన్నికలు ముఖ్యమైనవే అయినప్పటి కీ, ప్రజల సమస్యలు కూడా అంతే ముఖ్యమైనవని, వాటిని పరిష్కరించడానికి పార్టీ నిరంతరం కృషి చేస్తుందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ అన్నారు. వామపక్షాల ఎర్ర జెండా ప్ర జల పోరాటాలకు ప్రతీక అని, ప్రజలు తమ హ క్కుల కోసం నిలబడిన ప్రతిచోటా ఆ జెండా ఎగురుతుందన్నారు.భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, పలు ప్రభుత్వ విధానాలకు నిరసనగా మంగళవారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సి స్ట్) 'జన్ ఆక్రోష్' ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యా లీకి వందలాది మంది హాజరయ్యారు. నిత్యావసర వస్తువుల పెరుగుతున్న ధరలు, వంటగ్యాస్, ఇంధన కొరత, ఇతర సమస్యలకు వ్యతిరేకంగా పాల్గొన్నవారు ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యా లీలో పాల్గొన్న బేబీ మాట్లాడుతూ ఎన్నికలు ము ఖ్యమైనవే, కానీ సామాన్య ప్రజల సమస్యలు కూడా అంతే ముఖ్యమని, తాము వారి కోసం పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావి స్తూ, పార్టీ ఎన్నికల సన్నాహాలు కొనసాగుతున్నాయని, దాని కార్యకర్తలు ఈ ప్రాంతాలలో చురుకుగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. కే ంద్రాన్ని విమర్శిస్తూ, నిజమైన సమస్యలను పక్కకు నెట్టే ప్రయత్నం జరుగుతోందని సిపిఐ(ఎం) నాయకుడు అన్నారు. 'ప్రభుత్వ విధానాలు ప్ర జల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్నా యి. ఎంతో కాలంగా పాటిస్తున్న సామాజిక ఆ చారాలకు కూడా అంతరాయం కలుగుతోం' అ ని ఆయన అన్నారు. వామపక్షాల ప్రాసంగికత పై ఆయన మాట్లాడుతూ, 'ప్రధానమంత్రి నరేం ద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా తమ ప్రసంగాలలో, భారతదేశం నుండి ఎర్ర జెండా (వామప క్ష జెండా) కనుమరుగైందని, అది కేవలం కేరళలో మాత్రమే మిగిలి ఉందని తరచుగా చెబుతుంటారు. త్వరలోనే అక్కడి నుంచి కూడా దాన్ని తొలగిస్తారని వారు అంటారు. కానీ నేను ఈ వాదనను సవాలు చేయాలనుకుంటున్నాను. ఎర్ర జెండా అనేది చెరిపివేయగలిగేది కాదు; అది ప్రజల పోరాటాలకు ప్రతీక. ప్రజలు ఎక్కడ నిలబడితే, అక్కడ ఎర్ర జెండా ఎగురుతుంది' అని బేబీ స్పష్టం చేశారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ అధ్యక్షుడు అశోక్ ధవాలే మాట్లాడుతూ రైతుల దుస్థితిని ఎత్తిచూపారు. తగినంత ధరలు లేకపోవడం, గ్రామీణ ఉపాధి తగ్గడం వారి పరిస్థితిని మరింత దిగజార్చాయని అన్నారు. గతంలో అమెరికాకు ఎగుమతి అయ్యే భారతీయ వస్తువులపై సుమారు 2.5 శాతం సుంకం ఉండేది. ఇప్పుడు అది దాదాపు 18 శాతానికి పెరిగింది, అయినప్పటికీ దీనిని ఒక పెద్ద విజయంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రస్తుత ఉద్యమం 'జన ఆక్రోష్' (ప్రజా ఆగ్రహం) నుండి క్రియాశీల 'జన సంఘర్ష్' (ప్రజల పోరాటం) వైపు మళ్లాలని ఆయన అన్నారు. 'ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్' ప్రధాన కార్యదర్శి మరియం ధవాలే మాట్లాడుతూ పెరుగుతున్న ద్రవ్యోల్బ ణం, నిరుద్యోగం ప్రజలను, ముఖ్యంగా మహిళలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని అ న్నారు. వామపక్ష పాలిత కేరళలోని సంక్షేమ చర్యలను ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజయ్ కృష్ణన్ ఉదహరించారు. జమ్ముకశ్మీర్ ఎమ్మెల్యే మొహమ్మద్ యూసుఫ్ తరిగామి, కార్మికులకు సరైన వేతనాలు, గౌరవం కల్పించాలని డి మాండ్ చేస్తూ, కార్మికులు, రైతుల పోరాటాలను ప్రముఖంగా ప్రస్తావించారు. నాలుగు కార్మిక కోడ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, అలాగే కొత్తగా అమల్లోకి వ చ్చిన విక్సిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, ఆ జీవికా మిషన్ (గ్రామీణ్) చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది. విద్యుత్ చ ట్టాన్ని సవరించకూడదని, విత్తన బిల్లును సవరించడా న్ని కూడా ఈ వామపక్ష పార్టీ వ్యతిరేకించింది.

రాజ్యసభలో మోదీ ప్రసంగం...

# 'స్వీయ ప్రశంసల ఆత్మస్తుతి ప్రసంగమే'

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా పరిస్థితిపై రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ మంగళవారం విమర్శలు గుప్పించింది.గత 11 ఏళ్లలో తాను సాధించానని చెప్పుకుంటున్న విజయాల గురించి స్వీయ ప్రశంసలతో నిండిన, ముందుగానే సిద్ధం చేసుకున్న 'ఆత్మస్తుతి ప్రసంగమే' అది అని ధ్వజమెత్తింది. ప్రధానమంత్రి మంగళవారం రాజ్యసభలో పశ్చిమాసియాపై సుమారు 20నిమిషాలు మాట్లాడారని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేశ్ తెలిపారు. నిన్న లోక్‌సభలో ఆయన చేసిన ప్రకటన తర్వాత మాదిరిగానే రాజ్యసభలో ఆయన (మోదీ) ప్రకటన వెలువరించిన అనంతరం ప్రతిపక్షాలను ఎలాంటి వివరణలు కోరేందుకు అనుమతించలేదని జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించారు. అది ఊహించినట్లుగానే గత 11ఏళ్లలో తాను సాధించానని చెప్పుకుంటున్న విజయాలన్నింటినీ పొగుడుతూ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రసంగమే అది అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధ్వజమెత్తారు. రాజ్యాంగ హక్కులు నిరంతరం కాలరాయబడుతున్న అన్ని రాష్ట్రాల నుంచి ప్రధానమంత్రి సహకారం కోరడంలో కొంత కపటత్వం ఉందని జైరాం రమేశ్ ఆరోపించారు. కొవిడ్19 సమయంలో వలసకార్మికులకు జీవనాధారంగా నిలిచిన ఎంజిఎన్ఆర్ఇజిఎను నాశనం చేసిన తర్వాత వారిని రక్షించమని రాష్ట్రాలను ప్రధానమంత్రి కోరడంలోనూ, అలాగే గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ వ్యతిరేకించిన 2013 జాతీయ భద్రత ఆహార పథకం ఆధారంగా రూపొందించిన 'పిఎం కల్యాణ్ అన్న యోజన'ను అమలు చేయాలని రాష్ట్రాలకు పిలుపునివ్వడంలోనూ 'కపటత్వం' ప్రదర్శించబడిందని జైరాం రమేశ్ దుయ్యబట్టారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
25-03-2026
www.prajapaksham.in

ఎడిట్
PEOPLE'S VIEWS

# గరికపాటి వారి సుద్దులు బెడిసికొట్టాయి

సమాజంలో ఒక స్థాయిలో ఉన్నవారు, ప్రత్యేకించి ప్రసంగాలతో మంచీచెడులను విశ్లేషించి, మార్గదర్శకం చేసే ప్రవచనకర్తలు ఆచితూచి మాట్లాడాలి. తమ ప్రసంగాల ప్రభావాన్ని తెలుసుకోవాలి. ఆ సూక్ష్మం లేకపోతే, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావు మాదిరి తీవ్ర విమర్శలకు గురికాక తప్పదు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు విద్యా రంగంలో, సామాజిక వేదికల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై చేసిన విమర్శలపై విస్తృత స్థాయిలో ప్రతిస్పందనలు వెల్లువెత్తుతున్నాయి. అధిక సౌకర్యాలు విద్యార్థులను చదువుపై దృష్టి కోల్పోయేలా చేస్తాయని, అలసత్వాన్ని పెంచుతాయని ఆయన అభిప్రాయం. కానీ, అది నిజం కాదు. సౌకర్యాలు... విద్యాప్రమాణాల సమీకరణ సరళంగా అనిపించినా లోతైన అధ్యయన అవసరాన్ని తెరపైకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చాలా మంది విద్యార్థులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారే. వారికి ఆహారం, పుస్తకాలు, దుస్తులు వంటి ప్రాథమిక అవసరాలు కూడా సులభంగా అందుబాటులో ఉండవు. ఈ పరిస్థితిలో, ఈ సౌకర్యాలు విద్యకు అడ్డంకి కాకుండా, చదువు కొనసాగించడానికి అవసరమైన మౌలిక మద్దతుగా పనిచేస్తాయి. ఒక విద్యార్థి పాఠశాలకు రావడానికి ఆహారం ఒక ప్రేరణగా ఉండడం నేరం కాదు. అది వ్యవస్థలో ఉన్న లోపాలకు దర్పణం. పేదరికం, ఆహార భద్రత లేమికి నిదర్శనం. ఈ సమస్యలను పరిష్కరించకుండా, ఆహారాన్ని అందించడాన్ని తప్పుగా, విద్యార్థులకు అందుతున్న విలాసంగా పేర్కొవడం అర్థరహితం. కారణాన్ని కాకుండా లక్ష్యాన్ని విమర్శించడంలో ఔచిత్యం లేదు. గరికపాటి ఉపయోగించిన మరో ఉపమానం కూడా విమర్శల అగ్నికి ఆజ్యం పోస్తున్నది. మధ్యాహ్న భోజనం పెడితే, విద్యార్థులు చదువుకోకుండా 'శోభనపు పెళ్లికొడుకు'లు మాదిరిగా మంచాలెక్కి కూర్చుంటారనడం దుర్మార్గం. సంక్షేమ పథకాలపై ఆధారపడే పిల్లలను అలాంటి పోలికతో అవహేళన చేయటం అన్యాయం. వారి పరిస్థితులను అర్థం చేసుకోకుండా చేసిన, పసలేని పాండిత్యం.

2026–27 ఆర్థిక సంవత్సరంలో పాఠశాల సంక్షేమ పథకాలను విస్తరించే చర్చలు జరుగుతున్న సమయంలో, గరికపాటి విమర్శలు గర్హణీయం. పేదరికాన్ని సమాజ సృష్టిగా కాకుండా, వ్యక్తిగత బలహీనతగా చూసే దుర్మార్గపు పోకడలకు నిదర్శనం. విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత అవసరమన్న ఆయన మాటలను ఎవరూ ఖండించరు. ఈ పథకం వల్ల ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతుందనే ఆవేదన ఆయనకు ఉండచ్చు. కానీ, విద్యా ప్రమాణాలను కేవలం మధ్యాహ్న భోజన పథకంతో అనుసంధానించడం అసమంజసం. ఎన్నో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. సరిపడా సిబ్బంది లేదు. కొన్ని పాఠశాల భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి. మధ్యాహ్న భోజన పథకానికి నిధుల కొరత కూడా ఉంది. ఈ ప్రాథమిక అంశాలను పట్టించుకోకుండా, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు సూచించకుండా, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని విమర్శించడం, పేదరికాన్ని హేళన చేయడం మానవతా రాహిత్యానికి పరాకాష్ట. విచారం వ్యక్తం చేయడంతోనో... క్షమాపణ కోరడంతోనే ఈ వివాదానికి తెరపడదు. నిజానికి గరికపాటిపై విమర్శలు కొత్తకాదు. గతంలోనూ ఆయన కొన్ని కులాలపై విమర్శలు చేసి, క్షమాపణలు చెప్పిన ఘటనలు ఉన్నాయి. ఒకానొక సమయంలో, 'ఇక ప్రవచనాలు చెప్పనుగాక చెప్పను' అంటూ భీష్మ ప్రతిజ్ఞలు కూడా చేశారు. కానీ, మళ్లీ వివాదాల్లో కూరుకుంటున్నారు. సమాజంలో మూఢ నమ్మకాలను గరికపాటి విమర్శించే తీరు అద్భుతం. కాదనడానికి వీల్లేదు. వేళ్లూనుకుపోయిన కొన్ని దుష్ట ఆచారవ్యవహారాలను ఖండించే తీరు కూడా గొప్పగా ఉంటుంది. కానీ, క్రమంగా ఆయన మాటల్లో 'అహం' స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకవైపు మూఢాచారాలను విమర్శిస్తూనే, మరోవైపు కుల వ్యవస్థను ప్రోత్సహిస్తున్న తీరు ఆశ్చర్యకరం. మనుస్మృతికి అనుకూలంగా వ్యాఖ్యానించడం విచిత్రం. భిన్న ధోరణులను, భిన్నపార్శ్వాలను ప్రదర్శించడం నిలకడలేని విధానాలకు నిదర్శనం. తాజా ఘటనలో విద్యార్థులు చదువుపై కన్నా భోజనంపై దృష్టి పెడతారనే వ్యాఖ్య ఇంగిత జ్ఞానం లేని మాట. కడుపు తృప్తిగా ఉన్నపుడే నాలుగు అక్షరం ముక్కలు బుర్రకెక్కుతాయి. కొన్ని సందర్భాల్లో, వ్యవస్థలో ఉన్న లోపాలు, పర్యవేక్షణ లోపం వల్ల పథకాల ప్రయోజనం తగ్గవచ్చు. కానీ ఇది మొత్తం పథకాన్ని తప్పుపట్టడానికి సరిపోదు. సమస్య అమలులో ఉంటే, పరిష్కారం అమలును మెరుగు పరచాలే తప్ప పథకాన్ని రద్దు చేయడం పరిష్కారం కానేకాదు.

ప్రత్యామ్నాయ దృక్పథంలో చూస్తే, ఈ సంక్షేమ పథకాలు విద్యలో సమానత్వాన్ని పెంచే కీలక సాధనాలు. ఒక పిల్లవాడు ఆకలితో ఉన్నప్పుడు, అతని చదువుపై దృష్టి పెట్టలేడు. కాబట్టి, ఆహారం అందించడం విద్యకు ప్రత్యామ్నాయం కాదు.. అది విద్యకు పునాది. ఇదే విధంగా, పుస్తకాలు, యూనిఫామ్‌లు వంటి సౌకర్యాలు బడుగు విద్యార్థులకు చేయూత. అవి గౌరవ భావనను, పాఠశాల హాజరును పెంచుతాయి. 'ఎవడి తిండి వాడు తిని.. ఎవడి దుస్తులు వాడు వేసుకొని వస్తేనే పాఠశాలకు వస్తాడు.. లేకుంటే లేదు' అనడం పేదలను అణగదొక్కే భావజాలం. ప్రాథమిక అవసరాలను తీర్చడానికి.. పథకాలపైనే పూర్తిగా ఆధారపడే సంస్కృతిని సృష్టించడానికి మధ్య తేడా లేదా? ప్రాథమిక అవసరాలను తీర్చడమే మధ్యాహ్న భోజనం వంటి పథకాల లక్ష్యం. అవి విలాసాలు కావు. సమాజం ఇప్పుడు సంక్షేమ పథకాల అవసరాన్ని అంగీకరిస్తోంది.

అదే సమయంలో, వాటి అమలుపై చర్చకు కూడా సిద్ధంగా ఉంది. అంటే, ప్రజాభిప్రాయం పూర్తిగా పాక్షిక ధోరణితోకాకుండా, సమతుల్య దృష్టికోణాన్ని కోరుతోంది. ఈ మార్పులను, పరిస్థితులను పరిశీలించకుండా... పరిగణనలోకి తీసుకోకుండా... మధ్యాహ్న భోజనం నేరమైనట్టు... అందులో కోడిగుడ్డు పెట్టడం ఘోరమైనట్టు గరికపాటి వ్యాఖ్యానించడం అభ్యంతరకరం, ఆక్షేపణీయం. ●



## ఇసిని ఏ పార్టీ నియంత్రిస్తుందో నిరూపితమైంది

**ఎన్నికల సంఘం జారీ చేసిన ఒక సమాచారంపై బిజెపి రబ్బర్ స్టాంపు వేయడం, ఎన్నికల పర్యవేక్షక సంస్థను తెరవెనుక నుండి ఏ పార్టీ నియంత్రిస్తోందో నిస్సందేహంగా నిరూపించింది. తెరవెనుక నుండి మీ ఆటలు ఆడాల్సిన అవసరం లేదు. బహిరంగంగా ముందుకు వచ్చి మాతో ముఖాముఖిగా పోరాడండి. సువేందు అధికారికి పరోక్షంగా సన్నిహితుడని తాను ఆరోపించిన నందిగ్రామ్ బిడిఒను, రాబోయే ఎన్నికల్లో తనపై బిజెపి నాయకుడు పోటీపడనున్న భవానిపూర్ స్థానానికి బదిలీ చేయాలన్న ఇసి నిర్ణయం రాజకీయ కుట్రను సూచిస్తోంది.**

– పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



# శతాబ్దం దాటిన స్ఫూర్తి చుక్కా రామయ్య

స్వాతంత్ర్య సమరయోధుడు, దూరదృష్టి గల ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత విద్యావేత్త అయిన చుక్కా రామయ్య, ఐఐటి రామయ్యగా ప్రసిద్ధి చెందారు. దేశంలోనే అత్యంత కఠినమైన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన ఐఐటీజెఇఇను అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన మహనీయుడు. 1925 నవంబర్ 20న తెలంగాణలోని వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో జన్మించిన రామయ్య, ఉన్నత విద్య కోసం ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. ఆయన విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమం ప్రభావంతో, సామాజిక అసమానతలు, ఫ్యూడలిజం వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్నారు. ఈ పోరాటాల్లో పాల్గొన్నందుకు ఆయన ఔరంగాబాద్ సెంట్రల్ జైలులో కూడా శిక్ష అనుభవించారు.

'లెటర్స్ ఫ్రమ్ ఎ ఫాదర్ టు హిజ్ డాటర్' అనేది జవహర్‌లాల్ నెహ్రూ తన కూతురు ఇందిరకు నెహ్రూ రాసిన ఉత్తరాల సమాహారం, 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా' వంటి పుస్తకాల ప్రభావంతో రామయ్య విద్య యొక్క శక్తిని లోతుగా గ్రహించారు. ఉపాధ్యాయ వృత్తినే అత్యున్నత సేవగా భావించి గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం నాగార్జునసాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలో సేవలందించి పదవీ విరమణ పొందారు. అయితే, పదవీ విరమణ తర్వాతే ఆయన జీవితంలో అత్యంత ప్రభావవంతమైన అధ్యాయం ప్రారంభమైంది.

**విద్యలో ఒక విప్లవానికి నాంది**

1985లో కొంతమంది విద్యార్థుల అభ్యర్థనతో హైదరాబాద్‌లోని నల్లకుంటలో రామయ్య ఐఐటి స్టడీ సర్కిల్‌ను స్థాపించారు. చిన్నస్థాయిలో ప్రారంభమైన ఈ సంస్థ, క్రమంగా దేశంలోనే ప్రముఖ ఐఐటి కోచింగ్ కేంద్రంగా ఎదిగింది.

ఈ సంస్థ ప్రత్యేకత ఉదయం 4 గంటలకే తరగతులు ప్రారంభించడం. విద్యార్థుల స్కూల్ సమయాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానం అమలు చేశారు. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశాలు ప్రారంభమై, కఠినమైన ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.రామయ్య బోధనా విధానం కేవలం సూత్రాల జ్ఞాపకశక్తిపై ఆధారపడేది కాదు. భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సంభాషణాత్మక బోధనకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఐఐటి ప్రశ్నలు జ్ఞాపకశక్తిని కాదు, ఆలోచనా సామర్థ్యాన్ని పరీక్షిస్తాయని ఆయన నమ్మకం. విద్యార్థులే తనకు గురువులని భావించిన ఆయన, వారి కొత్త ఆలోచనలను ప్రోత్సహించారు. ఆయన మార్గదర్శకత్వంలో వేలాది మంది విద్యార్థులు ఐఐటి ప్రవేశ పరీక్షలో విజయాలు సాధించారు.

**ఫలితాలకు మించిన వారసత్వం**

రామయ్య ఐఐటి స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఐఐటి విజయం అనే పదానికి ప్రతీకగా నిలిచింది. ఆయన పదహారుకి పైగా తెలుగు విద్యా గ్రంథాలను రచించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కూడా ఆయన బలమైన మద్దతుదారుడిగా నిలిచారు.

బోధన నుండి విరమణ పొందిన తరువాత కూడా చుక్కా రామయ్య విద్యారంగంపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతున్నారు.ప్రస్తుతం 101 సంవత్సరాల వయస్సులో ఆయన పడకగదికే పరిమితమైనా, ఆలోచనా శక్తి మాత్రం తగ్గలేదు. రోజూ వార్తలు, భక్తి కార్యక్రమాలు వీక్షిస్తూ, ప్రస్తుత విద్యా విధానం, పాఠ్యాంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. చుక్కా రామయ్య జీవిత ప్రయాణం విద్య ద్వారా సమాజాన్ని మార్చగల శక్తికి ఒక శాశ్వత సాక్ష్యంగా నిలిచింది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912

# ఇటుక బట్టీల్లో మసి బొగ్గు అవుతున్న బాల్యం

ప్రపంచ చరిత్రలో 16–18వ శతాబ్దకాలంలో ఆఫ్రికా నుంచి సెంట్రల్/మిడిల్ అమెరికాకు బలవంతంగా అమాయక ఆఫ్రికన్లను తరలించి బానిసలుగా సంకెళ్లు వేసి, వెట్టిచాకిరీ చేయించిన దుర్మార్గపు ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఈ దుర్ఘటన ట్రాన్స్అట్లాంటిక్ బానిసత్వ వ్యాపారంగా చరిత్ర పుటల్లోకి చేరింది. ఈ విషాదకర ఘటన ప్రభావం నేటికీ ఆఫ్రికన్ల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. యూఎస్‌లో 01 ఫిబ్రవరి 1865న బానిసత్వాన్ని నిషేధించడం జరిగినప్పటికీ జాతి వివక్ష, బానిస బతుకుల ప్రభావం నేటికీ ఆఫ్రికన్ సమాజంపై పడుతూనే ఉంది. 2007లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 25 మార్చిన అంతర్జాతీయ ట్రాన్స్ అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం పాటించుట ఆనవాయితీగా మారింది. అమానవీయ బానిసత్వం నేరమని, మానవ హక్కుల ఉల్లంఘనలు ఆక్షేపణీయం అని, జాతి వర్ణ వర్గ వివక్ష దురాచారమని, మనిషిని మనిషిగా చూడడం మన కనీస బాధ్యత అని అవగాహన కల్పించడం జరుగుతోంది.

**భారతంలో బానిసత్వ దురాచారం:** ప్రపంచంలోనే అత్యధికంగా 39 శాతం ఆధునిక బానిసలు భారత్‌లోనే ఉన్నారని తెలుస్తోంది. ముస్లిమ్ పాలనలో బానిసత్వం పెరగడం, నేటి డిజిటల్ వెలుగుల్లో కూడా బానిసత్వ చీకట్లు కమ్మడం సోచనీయం. 1843లో భారత్ బానిసత్వ చట్టం అమలులోకి రావడం జరిగినా దాని ప్రభావం అంతగా పౌర సమాజంపై పడకపోవడం దురదృష్టకరం. 2018 నివేదిక వివరాల ఆధారంగా ప్రపంచంలో 46 మిలియన్ల బానిసలు ఉండగా, అందులో 8 మిలియన్లు భారత్‌లోనే ఉండడం విచారకరం. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, బాల్య వివాహాలు, బలవంతపు పడుపు వృత్తి, బాల కార్మిక వ్యవస్థ లాంటివి నేటికీ మన సమాజంలో కనిపించడం బాధాకరం. ఇండియాలో ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు బానిస చీకటి బతుకులు బతుకుతున్నట్లు తేలింది.

అందరం చేయి చేయి కలిపి మానవ హారం పట్టి బానిసత్వ కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్న అమాయక జీవులకు స్వేచ్ఛను కల్పించి బానిసలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం, అందరి ముఖాల్లో ఆనంద హరివిల్లులు వికసింపజేద్దాం.

# ఉత్తమ పార్లమెంటేరియన్ సురవరం



బొమ్మగాని కిరణ్‌కుమార్
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
ప్రజాపక్షం

ప్రఖ్యాత కమ్యూనిస్టు, సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన గొప్ప నాయకుడు, మంచి వక్త, జర్నలిస్టు. రెండుసార్లు నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన ఉత్తమ పార్లమెంటేరియన్ కూడా. నాకు చిన్నతనం నుంచే సురవరం గారు తెలుసు. అయితే, విశాలాంధ్ర విలేఖరిగా 2004 లోక్‌సభ ఎన్నికల నుంచి మొదలైన అనుబంధం, ఆయన మరణించే వరకు రెండు దశాబ్దాల పాటు కొనసాగింది. ముఖ్యంగా నేను ఢిల్లీలో విశాలాంధ్ర స్పెషల్ కరస్పాండెంట్‌గా 2006 నుంచి 2009 వరకు పని చేసినప్పటి నుంచి ఆయనతో సాన్నిహిత్యం మరింత పెరిగింది. పార్లమెంటేరియన్‌గా, స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సురవరం సుధాకర్ రెడ్డి కార్యకలాపాలకు నేను ప్రత్యక్షసాక్షిగా కూడా ఉన్నాను.

సుధాకర్ రెడ్డి గారు 1998లో 12వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎన్నికయ్యారు. నాటి లోక్‌సభ అర్ధాంతరంగా రద్దవడంతో మొదటిసారి పదవీ కాలం 13 నెలలే . ఆ లోక్‌సభలో ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం విశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో సురవరం ప్రసంగం చారిత్రాత్మకమైనది. 1999లో ఓడిపోయినప్పటికీ, 2004లో నల్లగొండ నియోజకవర్గం నుంచి రెండవసారి ఎన్నికై పూర్తికాలం ఐదేళ్ళ పాటు ఎంపిగా కొనసాగారు. సురవరం సుధాకర్ రెడ్డికి పార్లమెంటేరియన్‌గా తొలిసారి పెద్దగా అవకాశం రానప్పటికీ, రెండవసారి 14వ లోక్‌సభలో మాత్రం ప్రజాసమస్యలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలను లేవనెత్తడంలో ఆయన ప్రతిభా పాటవాలు నిరూపితమైనవి. ఆ ఐదేళ్ళలో (2004–2009) ఆయన లోక్‌సభలో 115 సార్లు ప్రసంగించారు. సుమారు 250కి పైగా ప్రశ్నలు వేసి, ప్రభుత్వం నుంచి హామీలను, సమాధానాలను రాబట్టగలిగారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు ప్రశ్నోత్తరాల సమయంతో పాటు, మ్యాటర్స్ ఆఫ్ పబ్లిక్ ఇంపార్టెన్స్ , 377 నిబంధన కింద ప్రత్యేక ప్రస్తావనలు, ప్రైవేటు మెంబర్స్ బిల్లు వంటి ప్రతీ అవకాశాలను విస్తృతంగా ఆయన సద్వినియోగం చేసుకునేవారు. సురవరం సుధాకర్ రెడ్డి లేవనెత్తే అంశాలు కూడా వైవిధ్యభరితమైనవి. నల్లగొండ ప్రజల ఎముకలను గుల్ల చేసే ఫ్లోరోసిస్ సమస్య, హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి(నంబర్ 9), విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యలు మొదలు ఇరాక్, అఫ్గానిస్తాన్‌లలో అమెరికా దురాక్రమణ వంటివి అనేకం.

సుధాకర్ రెడ్డి గారు చేపట్టే అంశాలు సైతం శాస్త్రీయంగా, దూరదృష్టి కలిగి ఉండేవి. ఇటీవల ప్రమాదవశాత్తు 13 ఏళ్లు కోమాలో ఉన్న హరీశ్ రానా అనే యువకుడికి అత్యంత బాధతో సుప్రీం కోర్టు కారుణ్య మరణానికి అనుమతించింది. యుథనేషియా (కారుణ్య మరణం) అంశాన్ని సురవరం 22 ఏళ్ల క్రితమే లోక్‌సభలో ప్రస్తావించారు. నాడు 14 ఏళ్ల పాటు మంచానికే పరిమితమై, మెదడు మినహా బహుళ అవయవాల వైఫల్యంతో పాతికేళ్ల యువకుడు దుర్భర పరిస్థితిని చూడలేక వారి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ కోర్టులో అవయవదానాన్ని అనుమతించాలని వేసిన కేసు కొట్టివేయబడింది. దీనిని ప్రస్తావిస్తూ, కారుణ్య మరణానికి అనుమతించేలా చట్ట సవరణ చేయకపోతే, ఇలాంటి వారి విషయంలో సమాజం క్రూరంగా ప్రవర్తించినట్లేనని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి దుర్వినియోగానికి తావు లేకుండా తగినచట్టం చేయాలని ఆనాడే సూచించారు.



పార్లమెంట్ ముందు ధర్నాలో పాల్గొన్న సురవరం

ఇటీవల శాసనసభ బడ్జెట్ సమావేశాలలో తెలంగాణ ప్రభుత్వం కేజీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్ సహా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. సురవరం సుధాకర్ రెడ్డి 2004 డిసెంబర్ 17న బడికి వెళ్ళే పిల్లలకు మూడు పూటల ఉచితంగా ప్రభుత్వమే పౌష్టికాహారం, ఉచిత విద్య అందించాలని, అందుకు రాజ్యాంగంలోని 45వ అధికరణకు సవరణ తీసుకురావాలని కోరుతూ లోక్‌సభలో ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. దీనిపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. అలాగే అన్ని గ్రామాలలో ప్రభుత్వం సకల వసతులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రాజ్యాంగ సవరణ కోరుతూ మరో ప్రైవేటు బిల్లును కూడా ఆయన ప్రతిపాదించారు. ఇలా నాలుగు ప్రైవేటు మెంబర్స్ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు.

స్విస్ బ్యాంకు నుండి నల్లధనం వెనక్కి రప్పించాలని సురవరం పార్లమెంటులో పదేపదే కోరారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. సాధారణంగా వివిధ వర్గాల ప్రజలు కొన్ని అంశాలను సభలో లేవనెత్తాలని పార్లమెంటు సభ్యులందరికీ లేఖలు రాస్తుండడం అప్పట్లో సాధారణం. ఆ కోవలోనే సుధాకర్ రెడ్డికి కూడా విదేశాలలో భారతీయులకు సంబంధించిన నల్లధనం రూ.72 లక్షల కోట్లు మూలుగుతుందని, దానిని వెనక్కి రప్పించాలని ఒక లేఖ వచ్చింది. ఆయన దానిని చదవి వదిలేయలేదు. ఆ అంశంపై మరింత సమాచారాన్ని సేకరించారు. పార్లమెంటు లోపల, బైట సందర్భమొచ్చినప్పుడల్లా అంశాన్ని లెవనెత్తేవారు. ఒకసారి పార్లమెంటులో ప్రసంగిస్తూ '' స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ అసోసియేషన్ నివేదికను ఆన్‌లైన్‌లో చూస్తే, అందులో డిపాజిట్‌దారుల దేశం పేర్లు లేవు. ఒక అంచనా ప్రకారం మన దేశస్తులదే రూ. 72లక్షల కోట్లు ఉంటాయని అంచనా. ఇది వాస్తవం కాకపోతే ఆర్థిక మంత్రి ఖండించాలి. నిజమైతే ఈ మొత్తాన్నీ దేశానికి వెనక్కి రప్పించాలి'' అని డిమాండ్‌చేశారు. ఆ తరువాత ఎన్నికలలో విదేశాలలో నల్లధనం అనే అంశం ఎన్నికల అస్త్రంగా మారిన విషయం మనందరికీ తెలిసిందే. అలాగే పోలీసు చర్యకు ముందు నిజాం నవాబు లక్ష రైఫిళ్ళ కొనుగోలుకు సంబంధించి 1948 లోనే లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ బ్యాంకులో మిలియన్ (పది లక్షల) పౌండ్లు బదిలీ చేసారని, కానీ రైఫిళ్లు రాలేదని సురవరం లోకసభలో ప్రస్తావించారు. ఆ మొత్తం ప్రస్తుతం సుమారు రూ.250 కోట్లుగా ఉంటుందని, దాన్ని వెనక్కి రప్పించి తెలంగాణతో పాటు, పూర్వ హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు.



నేడు సురవరం సుధాకర్ రెడ్డి 84వ జయంతి

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా..

సురవరం సుధాకర్ రెడ్డికి గారు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ లేబర్ కు చైర్మన్‌గా వ్యవహరించే అరుదైన అవకాశం లభించింది. వామపక్షాల మద్దతుతో ఏర్పాటైన నాటి యుపిఏ–1 (2004) ప్రభుత్వంలో తొలుత ఈ కమిటీకి కేరళ మాజీ ముఖ్యమంత్రి పి.కె.వాసుదేవన్ నాయర్ చైర్మన్‌గా వ్యవహరించారు. తిరువనంతపురం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఆయన అర్ధాంతరంగా మరణించడంతో, 2005లో ఆ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సురవరం సుధాకర్ రెడ్డి చైర్మన్ అయ్యారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను 'మినీ పార్లమెంటు'గా వ్యవహరిస్తారు.పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లులను ఇవి కూలంకషంగా చర్చిస్తాయి. దాని చైర్మన్ కు డిప్యూటీ మినిస్టర్ ప్రోటోకాల్ ఉంటుం ది. సుమారు నాలుగేళ్ళ పాటు స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన సుధాకర్ రెడ్డి, ఆ పదవిని కార్మికుల సంక్షేమానికి గరిష్ఠంగా వినియోగించారనడం అతిశయోక్తి కాదు. తమ కమిటీ ముందుకు వచ్చిన లొసుగులతో కూడిన 'అసంఘటిత రంగ కార్మికుల సామాజిక సంక్షేమ బిల్లు'ను ఆయన త్రోసిపుచ్చారు. ఆ బిల్లును 40 కోట్ల మంది అసంఘటిత కార్మికుల నిజమైన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సురవరం నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ తిరగరాయడం ఒక చరిత్ర. ఈ బిల్లు కోసం దేశంలోని వివిధ రాష్ట్రాలలో పర్యటించి, కార్మిక సంఘాలు, అసంఘటిత కార్మికులను పిలిపించి, సమావేశమై, వారి అభిప్రాయాలను తీసుకొని బిల్లును పరిపుష్ఠం చేశారు. ఆ బిల్లును కొంత మార్పులు చేసి పార్లమెంటులో ఆమోదింపజేసింది కేంద్ర ప్రభుత్వం. తెలంగాణలోని సిరిసిల్లలో చేనేత కార్మికుల వరుస ఆత్మహత్యలపై వరుస కథనాలు వచ్చాయి. దీనిపై స్టాండింగ్ కమిటీ చైర్మన్ సురవరం సుధాకర్ రెడ్డి సుమోటోగా స్వీకరించి, కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లకు వెళ్లి, అధ్యయనం చేసి, చేనేత కార్మికుల రక్షణకు మెరుగైన సిఫార్సులతో స్టాండింగ్ కమిటీ నివేదికను పార్లమెంటుకు సమర్పించారు. అలాగే బాంబే, చెన్నై డాక్ యార్డ్, విశాఖ పోర్టు, ఇసిఐఎల్, హెచ్‌ఎంటి వంటి ప్రభుత్వ రంగం సంస్థలలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేసి స్టాండింగ్ కమిటీ నివేదకలిచ్చారు. తాము మద్దతిచ్చే ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ, స్థాయీ సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నా కూడా ప్రజా సమస్యలపై అనేక మార్లు పార్లమెంటు ప్రధాన ద్వారం ఎదుట నిరసనల్లో సురవరం పాల్గొన్నారు.



ఐసియులో ప్రజాపక్షం దినపత్రిక చదువుతూ...

## నియోజకవర్గ సమస్యలపై..

నల్లగొండ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కూడా సురవరం సుధకార్ రెడ్డి గారు కృషి చేశారు. ఫ్లోరోసిస్ పీడిత గ్రామాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఫిల్టర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. తొమ్మిదవ నంబర్ (హైదరాబాద్–విజయవాడ) జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాదాలు, రహదారి విస్తరణ ఆవశ్యకతపై సురవరం సుధాకర్ రెడ్డి చేసిన కృషిని ఒకసారి ఈనాడు దినపత్రిక ఎడిటోరియల్‌లో ప్రస్తావించారు. సాధారణంగా ఆ పత్రిక ఎడిటోరియల్‌లో వ్యక్తుల పేర్ల ప్రస్తావన బహు అరుదు. అలాగే నాడు నల్లగొండ ఎంపి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో శివారు ప్రాంతాలుగా ఉన్న ఎల్.బి. నగర్, గడ్డి అన్నారం తదితర కాలనీలకు నీటి పైప్ లైన్ కోసం, కాలనీ వాసులు 70 శాతం వాటాగా కట్టాల్సి వచ్చేది దానిని 30 శాతానికి తగ్గించేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. 2004లో సిపిఐ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మహాసభ చివరి రోజున నల్లగొండలో భారీ సభ జరిగింది. హైదరాబాద్ నుంచి సభకు పాల్గొనేందుకు వచ్చిన సింగరేణి కాలనీ వాసుల గుడిసెలు తగలబడ్డాయి. ఆ సభా వేదిక మీదుగానే ఇది భూ కబ్జాదారుల కుట్ర అని, ప్రభుత్వం తక్షణమే గుడిసెవాసులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సురవరం తన ప్రసంగంలో డిమాండ్ చేశారు. దానికి నాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అంగీకరించి స్వల్పకాలంలోనే సింగరేణి కాలనీలో ఇళ్లను నిర్మించి ఇవ్వడం ఆ రోజుల్లో ఒక విశేషమే.

## ఆయన భాష, వ్యాసాలు ప్రత్యేకం

సురవరం సుధాకర్ రెడ్డి జర్నలిస్టుగా కూడా పనిచేశారు. సాహితీ అభిలాషుడైన ఆయన రచనా శైలి సరళంగా, భాష ప్రత్యేకంగా ఉండేది. నిశిత విమర్శలకు ఆయన పెట్టింది పేరు. పరుష పదజాలం కాకుండా, పదునైన పదాలతో చేసే విమర్శలు ప్రత్యర్థులను సైతం ఆకట్టుకునేవి. నాటి ప్రభుత్వాన్ని నిందించేందుకు ఆయన ఉపయోగించిన 'ఈ ప్రభుత్వం అధికార బధిరాంధక శవం' అనేది అందులో ఒకటి. పెద్ద నాయకులు సాధారణంగా వార్తలు లేదా వ్యాసాలు, పాయింట్‌లు చెప్పి రాయమని ఎవరికో పురమాయిస్తుండటం చూస్తుంటాం.కానీ, సుధాకర్ రెడ్డి అందుకు భిన్నం. ఆయనే స్వయంగా రాసి పత్రికలకు, జర్నలిస్టులకు పంపడం అలవాటు. అది ఆయన ఎనిమిది పదులలో మరణించే చివరి రోజుల వరకు కొనసాగింది. ఆయన రాసే వ్యాసాలలో కొత్త విశేషాలు ఉండేవి. ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశాలలో పార్లమెంటు సభ్యుడిగా భారతదేశం తరుపున పాల్గొని ప్రసంగించారు. అక్కడి నుంచి వచ్చాక ఆ విషయాలతో పాటు, తాను అక్కడ ఉన్న సమయంలోనే జరిగిన 'థ్యాంక్ గివింగ్ డే' పండుగ, దాని చారిత్రక నేపథ్యం, టర్కీ కోడి ఎందుకు వండుకుంటారు? రెడ్ ఇండియన్స్‌గా పిలవబడే అమెరికన్ నేటివ్స్ ఏ విధంగా దోపిడీకి గురయ్యారు? వంటి అంశాలతో విపులంగా వ్యాసం రాశారు. అలాగే చైనా పర్యటన తరువాత గ్రామీణ రైతు కుటుంబం అదనపు ఆదాయం కోసం తమ ఇళ్ళను విస్తరించి ఏ విధం గా పర్యాటక గృహాలుగా మార్చారో వివరించారు. ఆ విధానం మనకు ఎంతవరకు ఉపయోపడుతుందోననే ఆలోచన ప్రభుత్వాలు చేయాలని సూచన చేశారు.

సుధాకర్ రెడ్డికి గారికి రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్ ఎదురుగా ఎం.ఎస్.ఫ్లాట్స్‌లో కేటాయించిన ఫ్లాట్‌లోనే ఒక గదిలో నేను ఉండేవాడిని. సిపిఐ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్ధన్ గారు కూడా అందులో ఉండేవారు. సుధాకర్ రెడ్డి గారి పట్ల ఆయనకు అమిత వాత్సల్యం ఉండేది. ఇక రాత్రి ఎనిమిది దాటితే నాకు సురవరం గారి నుంచి ఫోన్ వచ్చేది.. 'కిరణ్ ఎక్కడున్నావ్? డిన్నర్ చేద్దాం రా.. కారు పంపించనా?' అంటూ అడిగేవారు. అది ఆయనలోని గొప్పతనం.

విశాలాంధ్రలో స్వల్ప కాలం పాటు జర్నలిస్టుగా చేసిన సురవరంకు పార్టీ పత్రికలంటే మక్కువ. ఏదైనా వ్యాసం రాసారంటే మొదటగా విశాలాంధ్ర, ప్రజాపక్షం, న్యూయేజ్ లకే పంపేవారు. ఆ తరువాతే ఇతర పత్రికలకు మరోసారి పంపేవారు. సుధాకర్ రెడ్డి గారి పట్టుదలతో, కె. శ్రీనివాస్‌రెడ్డి గారి చొరవతో 2007 జూన్ 22న ఢిల్లీలో 'విశాలాంధ్ర' దిన పత్రిక కార్యాలయం ప్రారంభమైంది. అంతకుముందే నన్ను 'విశాలాంధ్ర' కోసం స్పెషల్ కరస్పాండెంట్‌గా ఢిల్లీకి రప్పించారు. ప్రతిరోజు విమానం ద్వారా పత్రికను పంపే ఏర్పాటు చేశారు. ఆ పత్రిక ఢిల్లీలో రామకృష్ణ అనే పేపర్ ఏజెంట్ ద్వారా అందరు ఎంపిలకు, ఆంధ్రాభవన్ బైట ఇతర పత్రికలతో పాటు పేపర్ స్టాల్‌లో విక్రయించే ఏర్పాటు కూడా చేశాము. ఆంధ్రాభవన్‌కు వచ్చినప్పుడల్లా పత్రిక వస్తుందా? లేదా? అని ప్రత్యేకంగా పేపర్ స్టాల్‌కు వెళ్లి చూడడం సురవరంకు అలవాటుగా ఉండేది. ఒక దశలో విశాలాంధ్రను ఢిల్లీలో ముద్రించే ప్రయత్నాలు కూడా జరిగాయి.

పార్లమెంటు బడ్జెట్ సెషన్ వచ్చిందంటే చాలు, ఉదయం ఏడు గంటలు మొదలు రాత్రి 12 గంట ల వరకు క్షణం తీరిక ఉండేది కాదు. ఉదయం ఆ రోజు పార్లమెంటులో జీరో అవర్‌లో, స్పెషల్ మెన్షన్‌లో లేవనెత్తాల్సిన అంశాలపై పార్లమెంటుకు నోటీసులు పంపడం, ఆ తరువాత దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే వివిధ సంఘాల ప్రతినిధులకు సంబంధించి ఆయా శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించడం, అక్కడి నుంచి హౌజ్(సభ)కు వెళ్లి చర్చల్లో పాల్గొనడం, ఆ తరువాత మధ్యాహ్నం జంతర్ మంతర్‌లో జరిగే వివిధ సంఘాల ధర్నాలలో పాల్గొనడం, సాయంత్రం పార్టీ కార్యాలయం అజయ్‌భవన్‌కు వెళ్ల డం నిత్యకృత్యం. నేను విలేకరిగా, పార్లమెంటు, ధర్నాలకు సంబంధించిన వార్తలను కవర్ చేసేందుకు ఆయన కారులోనే వెళ్లేవాడిని. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న ఆ కాలంలో ఆంధ్రా–తెలంగాణ ఎంపిల మధ్య అప్రకటిత దూరం కనపడేది. అందుకు సురవరం మినహాయింపు. ఆయనను చూడగానే ఎంపిలంతా ఆత్మీయంగా పలకరించి, గౌరవంగా మాట్లాడేవారు. ఆయన ఎంపిగా ఉన్న కాలంలో అనేక కీలక జాతీయ నిర్ణయాలలో భాగస్వామిగా ఉన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, తెలంగాణ రాష్ట్రంపై కీలక చర్చలు, నాటి రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ ఎంపిక ప్రక్రియ, అమెరికాతో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా వామపక్షాల అవిశ్వాస తీర్మానం అందులో కొన్ని.

అలాగే 'ప్రజాపక్షం' పత్రికలో చివరి వరకు సురవరం వ్యాసాలు రాసేవారు. మరణించే ముందు రోజు వరకు ఐసియులో ఉండి కూడా ఆయన 'ప్రజాపక్షం' దినపత్రికను చదివేవారు. ఇక నేను ప్రతి ఆదివారం రాసే వ్యాసాలపై తప్పనిసరిగా ఫోన్ చేసి వెన్నుతట్టడం, అదే సమయంలో ప్రభుత్వాల విషయంలో మృదువుగా రాస్తే, స్నేహపూర్వకమైనప్పటికీ ప్రభుత్వాలపై విమర్శల్లో మరింత పదును పెంచాలని సూచించడం నా మదిలో ఇప్పటికీ మెదులుతూనే ఉంది.



## కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు

### తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ (తిప్పర్తి):** ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించే విధంగా పని చేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సూచించారు.నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,రెండు రోజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు,స్టేషన్ పరిధిలోని పరిస్థితులు,ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ మేనేజ్‌మెంట్,ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్ విభాగం,లాక్ అప్, ఎస్.హెచ్.ఓ గది తదితర విభాగాలను పరిశీలించి,స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్రంగా విచారణ చేసి, చట్ట ప్రకారం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,శాలిగౌరారం సిఐ కొండల్ రెడ్డి,తిప్పర్తి ఎస్‌ఐ శంకర్,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మబిక్షం వర్ధంతిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాటయోధులు, మాజీ ఎంపి కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 15వ వర్ధంతిని జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం, రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ పోరాట సమయంలోనే ఆయనను అరెస్టు చేసి 5 సంవత్సరాలకు పైగా జైల్లో ఉంచారన్నారు. ధర్మబిక్షం 2011లో మార్చి 26న చనిపోయి నేటికి 15 సంవత్సరాలు అవుతుందని ఆయన వర్ధంతిని సూర్యాపేట జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం చౌక్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆయన విగ్రహం దగ్గర ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, పెంద్ర కృష్ణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కళ



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పేదవారి సొంతింటి కళ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు కత్తుల ఎల్లయ్య శైలజ గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులను అభినందించి, కొత్త ఇంటిలో ఆనందంగా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు సొంత గృహాలను కలిగి సుఖంగా జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దరావత్ వెంకన్న నాయక్, రామన్నగూడెం సర్పంచ్ ఆరాల శైలజ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మురుగు కాల్వ పనులు పూర్తి చెయాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** పగిడిపల్లిలో మురుగు కాల్వ పనులు వెంటనే పూర్తి చెయ్యాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. భువనగిరి పరిధిలోని 12 వార్డ్ పగిడిపల్లి గ్రామంలో గత కొన్ని ఏండ్లు నుండి పరిష్కారం కాని మురికి కాల్వ పనుల గురించి వార్డ్ కౌన్సిలర్ తోటకూరి విజయ లక్ష్మి వెంకటేష్ యాదవ్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, దృష్టికి తీసుక వెళ్లారు. ఈ మేరకు మంగళవారం భువనగిరి మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, నేషనల్ హైవే వారితో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారం కావడంతో మున్సిపల్ చైర్మన్‌కి కౌన్సిలర్ తోటకూరి విజయ లక్ష్మి వెంకటేష్ యాదవ్, వార్డ్ ప్రజలు పక్షన కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పోచంపల్లి బ్యాంక్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తాం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రాష్ట్రంలోనే అత్యుత్తమ బ్యాంకుగా పోచంపల్లి బ్యాంకు ను అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామని బ్యాంకు చైర్మన్ తడక రమేష్ స్పష్టం చేశారు.కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులలో ఖాతాదారులకు ఉత్తమ సేవలుగాను ప్రతి ఏటా అవార్డులు ఖాతాదారులకు మరింత నమ్మకం విశ్వాసం కలిగేటట్లు తమ 22 బ్రాంచ్ ల సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. మంగళవారం బ్యాంక్ ఆడిటోరియంలో జరిగిన 52వ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో బ్యాంకు రుణాలు అందజేస్తూ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తుందని అన్నారు. బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్ వార్షిక నివేదికను సమర్పించి మాట్లాడుతూ మార్చి 2026నాటికి రూ. 313.62 కోట్ల డిపాజిట్ కాగా మంజూరు చేసిన రుణాలు రూ.242.03కోట్లని, రూ.556 కోట్ల వ్యాపారం సాధించిందని వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, కావ్య , భార్గవి, నరసింహ, భాస్కర్, రామగోపాలరావు, యాదగిరి ఎల్లస్వామి పాల్గొన్నారు.

# వంట గ్యాస్ కృత్రిమ కొరత

### బయట పడుతున్న అక్రమ నిల్వలు

### బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ సిలిండర్ రూ.1500 నుండి రూ.1800

### కమర్షియల్ రూ.3 వేల నుండి రూ.4వేలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వంట గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దీంతో వినియోగాదులు గగ్గోల్లు పెడుతున్నారు. అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో గ్యాస్ అక్రమ నిల్వలు పెద్దఎత్తున బయటపడుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని వినియోగదారులకు అందజేయాల్సిన గ్యాస్‌ను పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ (గృహ వినియోగం) సిలిండర్‌ను రూ.1500 నుండి రూ.1800 కు, కమర్షియల్ రూ.3వేల నుండి రూ.4వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీలు మొత్తం 29 ఉండగా ఇందులో 4 పరిశ్రమలకు సంబంధించినవి కాగా 25 రెగ్యూలర్ ఏజెన్సీలు ఉన్నాయి. ఈ ఏజెన్సీల పరిధిలో 4,15,509 గ్యాస్ కనెక్షన్లు (వినియోగదారులు) ఉన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో గ్యాస్ కొరత ఏర్పడడంతో దీనిని అదునుగా చేసుకొని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు కృత్రిమ కొరతను సృష్టిస్తూ బ్లాక్ దందాకు తెర లేపారు. వినియోగదారుడు గ్యాస్ బుక్ చేసుకుంటే గతంలో 3 రోజుల వ్యవధిలోనే ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ సిలిండర్‌ను డెలవరీ చేసేవారు. నేడు 10 రోజుల నుండి 15 రోజులు పడుతుంది.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా ఎక్కువ ధరలకు గ్యాస్‌ను అమ్ముతూ ఏజెన్సీ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అధికారులు కృత్రిమ కొరతను నివారించేందుకు ఆయా పట్టణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. దీంతో గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు పెద్దఎత్తున బయటపడుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బొడ్రాయి బజార్, పిఎస్‌ఆర్ సెంటర్‌లలోని గ్యాస్ రిపేర్ దుకాణాలతోపాటు, కొత్తబస్టాండ్ వద్ద ఓ హోటల్ నిర్వాహకుడి వద్ద అక్రమంగా నిల్వలు పెద్దఎత్తున బయటపడ్డాయి. ఒక దుకాణంలో 13 సిలిండర్లు, మరో దుకాణంలో 45 సిలిండర్లు, హోటల్ యజమాని వద్ద 18 సిలిండర్లను అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. కోదాడ పట్టణంలో అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిల్వఉంచిన 20కు పైగా సిలిండర్లను మంగళవారం పట్టుబడ్డాయి. డొమెస్టిక్ (గృహ) గ్యాస్ సిలిండర్ ప్రస్తుత ధర రూ. 967 ఉండగా, కమర్షియల్ (వ్యాపార) సిలిండర్ ధర రూ.2,140 గా ఉంది. నేడు ఏజెన్సీ నిర్వాహకులు సృష్టించిన కృత్రిమ కొరతతో బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ ధర అమాంతం పెరిగాయి. డొమెస్టిక్ సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో రూ.1500 నుండి రూ.1800 వరకు అమ్ముతుండగా, కమర్షియల్ సిలిండర్‌ను రూ.3వేల నుండి రూ.4వేల వరకు డిమాండ్ పలుకుతుంది. ఇదే మంచి తరుణం అన్నట్లుగా భావించి కొంతమంది గృహ వినియోగదారులు కూడా వారి వద్ద నిల్వ ఉన్న గ్యాస్‌ను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా పట్టణ ప్రాంత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోని ఆయా ప్రాంతాల్లో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తమ వద్ద ఉన్న గ్యాస్‌ను గుట్టుచప్పుడు కాకుండా అడ్డదారుల్లో పట్టణాలకు తరలించి బడా హోటల్ యజమానులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. ఈ విషయం అధికారుల దాడుల్లో కూడా వెలుగు చూసింది.

**కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు :**
**జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు**

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు హెచ్చరించారు. గ్యాస్ కృత్రిమ కొరతపై ఆయనను ప్రజాపక్షం ప్రశ్నించగా జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని చెప్పారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశాలతో గ్యాస్ బ్లాక్ దందాపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విస్తృతంగా దాడులు చేసి సిలిండర్లను పెద్దఎత్తున సీజ్ చేస్తున్నామని వివరించారు. వినియోగదారులు గ్యాస్ కొరత ఉందంటూ వచ్చే వదంతులను నమ్మవద్దని కోరారు.

## పశుసంవర్ధక నిధులను తక్షణం విడుదల చేయాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పార్లమెంట్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గళమెత్తారు. కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ శాఖల కింద రాష్ట్రాలకు అందాల్సిన నిధులు భారీగా పెండింగ్‌లో ఉండటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్న సంఖ్య 441ను లేవనెత్తిన ఆయన, కేంద్ర ప్రభుత్వం వద్ద సుమారు రూ. 24,850.33 కోట్ల నిధులు విడుదల కాకుండా మూలుగుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. దేశవ్యాప్తంగా పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన కీలక పథకాలు ఈ నిధుల కొరత వల్ల అటకెక్కినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు భరోసానిచ్చే 'జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద అందాల్సిన రూ. 3,880.40 కోట్లు (100 శాతం) పెండింగ్‌లో ఉండటం దారుణమన్నారు. అలాగే రాష్ట్రాలకు సహాయం అందించే ఎఎస్‌సిఎడి పథకానికి రూ.7,421.23 కోట్లు, జాతీయ పశుసంవర్ధక మిషన్ కింద రూ. 12,304.59 కోట్లు, పశుగణన కోసం రూ.1,151.61 కోట్లు, మరియు ఇంటిగ్రేటెడ్ సాంపిల్ సర్వే కోసం రూ. 92.50 కోట్ల కేంద్ర భాగం విడుదల కావాల్సి ఉందన్నారు. పశువుల ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తే అది నేరుగా పాడి రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని చామల హెచ్చరించారు. ఈ భారీ బకాయిల వల్ల రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, తక్షణమే కేంద్ర మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని ఈ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాల అమలును వేగవంతం చేయాలని సభాధ్యక్షుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## టిబి రహిత జిల్లాగా సూర్యాపేట: కలెక్టర్




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** క్షయ (టిబి)ను జిల్లా నుంచి పూర్తిగా నిర్మూలించి టిబి రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనపై గాంధీ పార్కు నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ, సామాజిక వ్యాప్తి జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.20లక్షల వ్యయంతో మొబైల్ ఎక్స్‌రే మిషన్ కొనుగోలు చేసివాటి ద్వారా జనవరి 2025 నుండి జిల్లావ్యాప్తంగా 52,901 మందికి టిబి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. వీరిలో 1741 మందికి రోగ నిర్ధారణ కాగా 1356 మందికి చికిత్స పూర్తి అయిందని ప్రస్తుతం 385 మందికి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. 21 గ్రామ పంచాయితీలను టిబి ముక్తి గ్రామ పంచాయితీలుగా గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాలో కొత్త కేసులు నమోదవకుండా 21 నుండి 100 టిబి ముక్తి జిపిలుగా, టిబి ముక్తి మండలాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ టిబి వారియర్‌లుగా కృషి చేయాలన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో అవగాహన, అనుమానితులకు పరీక్షలు నిర్వహించి లక్ష్యసాధన చేరిన పిహెచ్‌సిలకు రూ.లక్ష ప్రోత్సహకాన్ని, జిల్లాలోని మూడు టిబి యూనిట్ల అభివృద్ధి కొరకై రూ.3లక్షల చొప్పున కలెక్టర్ ప్రకటించారు. అనంతరం టిబి ముక్తి జిపిలుగా తీర్చిదిద్దిన సర్పంచులను, గ్రామ కార్యదర్శులను, వైద్య సిబ్బందిని ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ప్రస్తుత ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్, డాక్టర్ నిజియా తబస్సుమ్, హెచ్‌ఓడిలు, డిప్యూటి డిఎంహెచ్‌ఓలు డాక్టర్ జి చంద్రశేఖర్, డాక్టర్ మాధవ కుమార్, ఆర్‌డిఓ వేణుమాధవ్, వైద్యాధికారులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కీతవారిగూడెం పంచాయతీ నిధులు గోల్‌మాల్

### తీర్మానంలో తేడాలు

### లక్షల్లో అక్రమ డ్రాయింగ్ ఆరోపణలు




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని కీతవారిగూడెం గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం ఆర్థిక అక్రమాలు జరిగాయి అంటూ మంగళవారం వాట్సప్ గ్రూప్‌ల్లో, సోషల్ మీడియాల్లో వేగంగా వైరల్ అవుతున్నాయి. తీర్మాణాల్లో చూపిన మొత్తాలను తర్వాత దిద్ది లక్షల్లో అక్రమంగా డబ్బులు డ్రా చేసినట్లు ఉప సర్పంచ్ చిత్తలూరి వీరస్వామి తీవ్ర ఆరోపణలు చేశారు. మొదటగా రూ.3లక్షలుగా తీర్మాణంలో నమోదు చేసి, ఉప సర్పంచ్‌తో సంతకం చేయించిన అనంతరం ఆ మొత్తాన్ని రూ.7,99,500లకు మార్చి డ్రా చేసినట్లు ఆరోపించారు. ఇదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉండగా ఎలాంటి పనులు చేపట్టకుండానే కేవలం కాగితాలపైనే పనులు చూపిస్తూ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. మరో ఘటనలో రూ. 3,73,912 గా తీర్మాణంలో చూపించి తర్వాత దానిని రూ. 4,61,912 రూపాయలుగా నమ్మబలికి సంతకాలు తీసుకుని అనంతరం మొత్తాలను పెంచి మోసపూరితంగా నిధులు విత్‌డ్రా చేశారని ఉప సర్పంచ్ ఆరోపించారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి లు కలిసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంటూ ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా డ్రా చేసిన నిధులను తిరిగి రికవరి చేయాలని పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై నిజ నిజాలపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**పంచాయతీ కార్యదర్శి వివరణ:** ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జానకి వివరణ కోరగా గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం కాలేదని, సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలపై విచారణ కోసం ఎంపివో ఇబ్రహీం, ఉన్నతాధికారులతో కలిసి గ్రామానికి వచ్చినప్పటికీ ఉప సర్పంచ్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడం బాధకరమని తెలిపారు. మహిళ ఉద్యోగి ఐన తనను కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పటికే అప్పటిబాధ్యులకే చెల్లింపులు జరిగాయని, ఆ బిల్లులపై సర్పంచ్, ఉప సర్పంచ్ సంతకాలు ఉన్నాయని అన్నారు. గ్రామ సర్పంచ్ ఒక్క రూపాయి కూడా అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. గత బిల్లులపై సంతకాలు చేసిన ఉప సర్పంచ్ ఇప్పుడు తాను చేయలేదని చెప్పడం ద్వారా అనవసరంగా వివాదాలు సృష్టిస్తున్నాడని కార్యదర్శి జానకి ఆవేదన వ్యక్తం చేశారు.

## నిర్ధిష్ట గడుపులోగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ పెండింగ్ పనులు పూర్తి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/గుండాల:** ఎన్‌ఆర్‌ఈజిఎస్ పెండింగ్ పనులను నిర్ధిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద పెండింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజిఎస్ పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను నిర్ధిష్ట గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించి, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో చండీరాణి, ఎంపివో సలీం, సర్పంచ్ ఐలయ్య, ఉపాధి హామీ మండల అధికారి ఇమానియల్, పంచాయతీ సెక్రటరీ మునావర్, ఫీల్డ్ అసిస్టెంట్ నవనీత పాల్గొన్నారు.



## కాంగ్రెస్ కార్యాలయం స్థల పరిశీలన

**ప్రజాపక్షం/చివ్వెంల :** సూర్యాపేట జిల్లా కేంద్రం కుడకుడ సర్వే నంబర్ 126లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పార్టీ కార్యాలయాలకు స్థలాలను ఏడు జిల్లాల్లో కేటాయించడం జరిగిందన్నారు. దానిలో భాగంగా సూర్యాపేట జిల్లాకు స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ భవనానికి దామన్న భవనంగా నామకరణం చేస్తామన్నారు. స్థలం కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం వాళ్ల భవనాలకు మాత్రమే స్థలాలు కేటాయించుకున్నారని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కావాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. స్థలాన్ని పరిశీలించిన అనంతరం స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల తహాశీల్దార్ జి చంద్రశేఖర్, తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఆర్ఐ శ్రావణి, సూర్యాపేట మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

### ఏప్రిల్ 15 నుండి పొగిళ్ల భూముల సర్వేకు ప్రత్యేక సర్వే బృందాలు



**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండలం పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలలోని భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని, ఏప్రిల్ 15 నుండి పొగిళ్ల భూముల సర్వేకు ప్రత్యేక సర్వే బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం చందంపేట మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలను దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ బి. చంద్రశేఖర్ సందర్శించారు. మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముందుగా గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమస్యలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుకుకొని, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి పాఠశాలలో మౌలిక సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను పరిశీలించి, వంటగదిని తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల తరగతి గదితో పాటు తాగునీరు, కిచెన్ ఇతర పనులన్నింటికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటితో తీర్మానం చేయించి అంచనాలు పంపించి పనులు చేపట్టి పూర్తి చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా అధికారులు డిపివో శంకర్‌నాయక్, డిఈవో బిక్షపతి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, తహాశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మీ , ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, మైనింగ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు

**ప్రజాపక్షం/దేవరకొండ:** మంగళవారం చింతపల్లి మండలం మాల్ గ్రామంలోని చికెన్ సెంటర్లు, హోటల్స్‌లలో డోమెస్టిక్ సిలిండర్స్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వారి నుండి 40 సిలిండర్లు స్వాదీనం చేసుకొని హెచ్‌పి గోదాంలో భద్రత నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడులలో సివిల్ సప్లై అధికారులు అంజయ్య, ఓఎస్‌డి, ఈటిసి కమాల్‌పాషా, ఈటిసి డిప్యూటి తహాశీల్దార్ సివిల్ సప్లై ముబీన్, డిటిసిఎస్ దీపక్, సైదులు, కుమార్‌రెడ్డి, సైదులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
25-03-2026
www.prajapaksham.in




## గ్రేషియస్ మూమెంట్స్ గ్రంథం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** భారతీయ తాత్వికతకు ప్రతీక రమణ మహర్షి అని సాహితివేత్త ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ జరిగింది గ్రేషియస్ మూమెంట్స్ ఇన్ ద ప్రెజెన్స్ ఆఫ్ భగవాన్ అనే గ్రంథం ఆవిష్కరణ జరిగింది. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రమణ మహర్షి భక్తుడు మద్దాలి సుబ్బారావు ఈ పుస్తకాన్ని రచించారు. నేనెవరు అని ప్రశ్నించుకున్న రమణ మహర్షి ఆత్మయే నేను అనే ఆధ్యాత్మిక సత్యాన్ని తెలుసుకున్నాడని ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ అన్నారు.

## జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డ్



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** జలమండలి ఖాతాలో మరో అవార్డు వచ్చి చేరింది. న్యూఢిల్లీలో ఈ నెల 23న నిర్వహించిన 20వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్ 2025–26లో జలమండలి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డును జలమండలి ఎస్టీపీ సిజిఎం పద్మజ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఎండీ అశోక్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ అశోక్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పాలపిట్ట పార్క్/బొటానికల్ గార్డెన్లో బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసి, నీటి పునర్వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవార్డు లభించింది.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక డ్రైవ్



**ప్రజాపక్షం/తార్నాక:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తార్నాక సర్కిల్ పరిధిలో పరిశుభ్రత డ్రైవ్ చేపట్టారు. కార్యక్రమం భాగంగా మణికేశ్వరినగర్, పిట్టలబస్తీ, మారుతినగర్ బస్తీలలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి స్థానికంగా నెలకొన్న పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా డిసి జ్యోతి మాట్లాడుతూ.... చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటోకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ విభాగం డీఈఈ నాగమణి, ఏఈఈ వినయ్ కుమార్, ఎస్ఏసీ ఇంజనీర్లు, ఆర్పీ, ఎస్ఎఫ్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వీ నేతలు మాట్లాడుతూ.. తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు రాహుల్‌గాంధీతో ఇప్పించిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వి హైదరాబాద్ జిల్లా నాయకులు యాదా క్రాంతి, సాయి, విశాల్, ఆనంద్, రాజేష్, అభి ముదిరాజ్, కరణ్, చింటూ, సోను, చిన్ను, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ నంది పురస్కారాల ప్రదానం



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** ఉగాది పురస్కరించుకుని స్వరమాధురి సంస్థ స్వర్ణ నంది పురస్కారాలను త్యాగరాయగానసభలో ప్రధానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు ఈ పురస్కారాలను ప్రధానం చేయడం జరిగింది. స్వరమాధురి సంస్థ వ్యవస్థాపకురాలు గాయని సాయి పావని ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మావి చిగురు తినగానే కోయిల పలికేనా.. అనే శీర్షికతో సినీ సంగీత విభాగం జరిగింది. శ్రీ సాయి కృష్ణ మ్యూజిక్ డాన్స్ హ్యాబీ స్కూల్ బాలికల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. బివి సుబ్బలక్ష్మి, కే.జయచంద్ర, కే.శాంతి, గౌతమి, వెంకీ, కడారి కుమార్, బాల పద్మ, వసంత లక్ష్మి, భాను, శ్రీనివాసమూర్తి, భస్మోజు, విద్యానంద చారి, జగదీశ్వర్ శర్మ, యాదగిరి, సురేష్ తదితరులకు స్వర్ణ నంది పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భువన రాధ, ఇంద్రాణి, అరుణ్ రాయ్, శాలిని, పద్మ, గూడూరి శ్రీనివాస్, ద్రోణం రాజు రామ్ తదితరులు ఆలపించిన పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## రౌడీషీటర్లు పరార్?
## పోలీసులకు సవాల్?

**ప్రజాపక్షం/చార్మినార్:** సున్నిత ప్రాంతంగా పేరొందిన చార్మినార్ జోన్‌లో పోలీసులు వింత పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్స్ కనిపించకుండా పోతుండటంతో ఎస్బీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో సైతం ఆందోళన మొదలయ్యింది. ఈ క్రమంలోనే కొందరు రౌడీషీటర్లు పోలీసులకు సవాల్ విసురుతున్నట్లుగా పరిస్థితి మారింది. పాతబస్తీలోని షా అలీ బండ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్రమైన కేసుల్లో ప్రమేయం ఉన్న నలుగురు రౌడీషీటర్లు పరారీలో ఉన్నారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో చర్చనీయాంశంగా మారింది. గ్యాంగ్‌స్టర్‌తో పాటు ఆయన కుమారులు చట్టవిరుద్ధమైన, హింసాత్మక కార్యకలాపాలలో పాల్గొన్న చరిత్ర ఉంది. ఈ పరిస్థితుల్లోనే వారిపై రౌడీషీట్ తెరిచారు. ఈ క్రమంలోనే వారి గురించి తెలిస్తే సమాచారం అందించాలని చార్మినార్ డీసీపీ కిరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తుకారాంగేట్ పిఎస్ కొనసాగించాలి

### సిపిఐ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ డిసిపికి వినతి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను గతంలో మాదిరిగా యథావిధిగా కొనసాగించాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానికులు సికింద్రాబాద్ డిసిపి రక్షితమూర్తిని కలిసి కోరారు.ఈ సందర్భంగా సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... అడ్డగుట్ట సమస్యలను దృష్టిలో ఉంచుకొని, తుకారాంగేట్ పిఎస్‌ను కొనసాగించాలని.. నెలల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు రేపు, మాపు అంటూ జాప్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డగుట్ట పరిధిని లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చడం మూలాన సమస్యలు వచ్చినప్పుడు పోలీస్‌స్టేషన్ సంప్రదించాలంటే మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వలన రాత్రి సమయంలో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. బస్తీలలో సాధారణ క్రైమ్ రేట్ ఎక్కువ ఉంటుందని, పోలీస్‌స్టేషన్ లేకపోవడం వలన క్రైమ్ రేట్ మరింత పెరిగే అవకాశం ఉందని.. కావున వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని సత్వరమే సమస్యను పరిష్కరించాలని డిసిపిని కోరడం జరిగిందని.. ఈ విషయంలో సానుకూలంగా స్పందించి త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని డిసిపి హామీ ఇచ్చారని తెలిపారు.

**నిరసన దీక్ష జయప్రదం చేయాలి..**

తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను కొనసాగించాలని కోరుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం తుకారాంగేట్ లేబర్ అడ్డా పైన నిర్వహించే దీక్షకు రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక, ప్రజా సంఘాల నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. డిసిపిని కలిసిన వారిలో... కొమురెల్లి బాబు, పాకాల యాదగిరి, గౌరీ నాగరాజ్, రషీద్ తదితరులు ఉన్నారు.

## చురుగ్గా ప్రగతి ప్రణాళిక కార్యాచరణ

**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం 19వ రోజు సందర్భంగా చార్మినార్ జెడీసీ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి, నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతోష్‌నగర్ సర్కిల్‌లోని చంపాపేట్, సైదాబాద్ ప్రాంతంలో జరుగుతున్న నాలా అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. నాలా శుభ్రపరిచే పనులు, డెబ్రిస్ తొలగింపు, ఆక్రమణల నివారణ వంటి అంశాలపై అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. పర్యటనలో సంతోష్‌నగర్ డిసి మంగతాయారు, ఇంజినీరింగ్ ఎస్ఈ ఇందిర, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌రావు, శానిటేషన్ డిఈ వెంకట్ రాజుతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని నిర్మూలించొచ్చు



### జిల్లాలో 22వేల మంది క్షయ బాధితులు
### క్షయ నిర్మూలనకు పటిష్ఠ చర్యలు
### కలెక్టర్ హరిచందన దాసరి

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** క్షయ వ్యాధిని ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన టిబి ముక్త్ భారత్ అభియాన 100 రోజుల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మనూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో గుర్తించిన స్లమ్ ఏరియాల్లో ఈ కార్యక్రమం జరగుతుందన్నారు.ఈ కార్యక్రమ మొదటి దశను విజయవంతంగా నిర్వహించామని ఆమె తెలిపారు. మొదటి దశలో స్క్రీనింగ్ క్యాంప్‌లను సమర్థవంతంగా నిర్వహించినందుకు అధికారులను ఆమె అభినందించారు. స్క్రీనింగ్ అనంతరం క్షయ గుర్తించిన రోగులకు సరైన చికిత్స అందించడం అందించడం చాలా కీలకమని ఆమె చెప్పారు. మొదటి దశలో రోగ నిర్ధారణ పరీక్షలు చేసి జిల్లాలో 22వేల మంది టిబి బాధితులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఎఐ సహాయంతో గుర్తించిన హైరిస్క్ ప్రాంతాలపై దృష్టి పెట్టి ఈ ప్రాంతాలలో మళ్లీ క్షయ రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్. వెంకట్, క్షయ వ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్.చల్లాదేవి, జాగృతి ఫౌండేషన్ నిర్వాహకులు కిరణ్‌కుమార్, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### గడువులోగా డీ కేర్ సెంటర్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

మాసబ్ ట్యాంక్ రెడ్ క్రాస్ భవనంలో వయోవృద్ధుల కోసం నిర్మిస్తున్న డీకేర్ సెంటర్ పనులను గడువులోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. ఈ సెంటర్ నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. దీనిలోని పలు విభాగాలను, పరిసరాలను పరిశీలించి వాటిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగు సంక్షేమ శాఖ ఏడి రాజేందర్, రెడ్ క్రాస్ సొసైటి జిల్లా అధ్యక్ష్యులు భీమి రెడ్డి, యంగిస్థాన్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు అరుణ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ స్నిగ్ధకు డెంటల్ ఆస్కార్ అవార్డు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** దంత వైద్య రంగంలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పుతున్న డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్ డాక్టర్ స్నిగ్ధ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ముంబయిలో నిర్వహించిన ఫామెడెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో ఆమెను 'అలైనర్ స్పెషలిస్ట్ ఆఫ్ ది ఇయర్' పురస్కారంతో సన్మానించారు. భారతదేశంలో 'డెంటల్ ఆస్కార్స్'గా పేరొందిన ఈ వేడుకలో తెలంగాణ నుంచి విశిష్ట గుర్తింపు పొందిన ఏకైక ఆర్థోడెంటిస్ట్‌గా ఆమె నిలిచి సరికొత్త రికార్డు సృష్టించారు. 25 ఏళ్లకు పైగా అనుభవం, ఆధునిక 'హైబ్రిడ్ ఆర్థోడాంటిక్ మెకానిక్స్'లో ఆమె చూపిన ప్రతిభ ఈ అవార్డుకు ఆమెను ఎంపిక చేసేలా చేశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ గుర్తింపు మా రోగులు మాపై ఉంచిన నమ్మకానికి, మా బృందం అంకిత భావానికి రుజువని తెలిపారు.

# ఆకట్టుకున్న నమ్రత 'కూచిపూడి' నృత్య నివేదనం

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** ప్రముఖ కూచిపూడి విద్వాంసురాలు, కళాశ్రీ కళారత్న డాక్టర్ పి.రామదేవి శిష్యురాలు, శ్రీనివాస్ స్వరూప్, శ్రీదేవి దంపతుల కుమార్తె నమ్రత మాదల కూచిపూడి నృత్య నివేదనం వీక్షకులను ఆకట్టుకొన్నది. శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ నృత్య ప్రదర్శన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంస్కృత విభాగం, కాలికట్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.గీతా కుమారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమా మహేశ్వరితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే నమ్రత పలు జాతీయ స్థాయి ప్రదర్శనలిచ్చి 'నృత్య ప్రతిభ', 'నాట్య శిరోమణి' వంటి ఎన్నో పురస్కారాలను అందుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రదర్శనలివ్వాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం నమ్రత వైద్యవిద్య నాలుగో సంవత్సరం అభ్యసిస్తున్నది. కార్యక్రమంలో ఐఎఎస్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణి మోహన్, కూచిపూడి కళాకారిణి వైజయంతి కాశీ, వైశాఖీ నృత్యోత్సవ్ ఫెస్టివల్ డైరెక్టర్ విక్రమ్ తదితరులు విక్రమ్ గౌడ్‌ను అభినందించారు.

# 3న పెండింగ్ ఫీజుల కోసం కలెక్టరేట్‌ల ముట్టడి

### విద్యార్థులు తరగతులు బహిష్కరించాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** రాష్ట్రంలోని 14 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు రావాల్సిన రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని, 100 బిసి కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3న నిర్వహించ తలపెట్టిన తరగతుల బహిష్కరణ, కలెక్టరేట్‌ల ముట్టడిని జయప్రదం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన బిసి విద్యార్థుల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారితో కలిసి మాట్లాడారు. విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు తెచ్చిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకం కొరకు రూ.6వేల కోట్లు అప్పు తెస్తే ఎవరు అడ్డుకొంటారని ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకొన్న ప్రతి విద్యార్థికి విదేశీ విద్యా స్టైఫండ్ మంజూరు చేయాలన్నారు. కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికొకటి చొప్పున 119 బిసి గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మధుసూదనాచారి మాట్లాడుతూ బడ్జెట్‌లో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. బిసిలను అణగదొక్కాలని ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. బిసిల బడ్జెట్‌పై స్పందించకొంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిసి సంఘం నేతలు నీలం వెంకటేశ్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీశ్, రాందేవ్ మోదీ తదితర సంఘం నేతలు పాల్గొన్నారు.



## ఎఐఇఎఫ్ ఫైన్ ఆర్ట్స్ కమిటీ ప్రారంభం

**ప్రజాపక్షం/కోఠి:** ఎఐఇఎఫ్ ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ లాంఛనంగా ప్రారంభమైంది. తెలంగాణ సారస్వత పరిషత్‌లో కమిటీ నేషనల్ డైరెక్టర్ రేవతి ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ ఎన్వి ప్రసాద్ ఆధ్వర్యంలో సంస్థ ప్రారంభ వేడుక జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ ఖాద్రివేల్, డాక్టర్ ఎంవిఆర్ఆర్ చావన్, మీనాక్షి శ్రీనివాస్, డాక్టర్ ఎస్‌కే సిరాజ్, రాగలత అతిథులుగా విచ్చేశారు. సంస్థ నుంచి జాతీయ స్థాయిలో సాంస్కృతిక కళా చైతన్యాన్ని సామాజిక సేవలను అందించనున్నట్లు డాక్టర్ రేవతి ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

# టిజి-సెట్ 2026 ఫలితాలు విడుదల

### పారదర్శకంగా ప్రవేశాల ప్రక్రియ
### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిసెట్ 2026 ఫలితాలు విడుదల అయ్యాయి. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ భవనంలో మంగళవారం ట్రైకోర్ చైర్మన్ డా. తేజవత్ బెల్లయ్య నాయక్, టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి సీతా లక్ష్మి, ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఐఎస్ కార్యదర్శి సైదులు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ సమక్షంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారదర్శకంగా, క్రమబద్ధంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించి ఫలితాలను ప్రకటించామని, మధ్యవర్తులు లేదా దళారులు ఏ విధంగానూ అనుమతించబడరని, ప్రవేశ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ఆర్థిక శాఖతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే అవి పరిష్కారం కానున్నాయని తెలిపారు. ఇదే కార్యక్రమంలో సిఎం ఎస్‌టి ఎంటర్‌ప్రెన్యూర్ పథకం కింద 18 మంది గిరిజన పారిశ్రామిక వేత్తలకు మొత్తం రూ.23.44 కోట్ల విలువైన యూనిట్లకు ఆమోద పత్రాలు, రూ.8.16 కోట్ల సబ్సిడీ చెక్కులు మంత్రి పంపిణీ చేశారు.
'2026–27 విద్యా సంవత్సరానికి గాను టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, టిజిటిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఇఐఎస్, టిఆర్ఇఐఎస్ సంస్థల్లో 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం టిజిసెట్ 2026 విజయవంతంగా నిర్వహించబడింది. మొత్తం 635 విద్యాసంస్థల్లో 51,284 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా 492కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 1,82,061 మంది అభ్యర్థుల్లో 1,72,913 మంది హాజరయ్యారు. గరిష్ట మార్కులు 100లో 98 సాధించబడ్డాయి. ఫేజ్ 1 సీట్ల కేటాయింపులో 47,381 సీట్లు నింపబడ్డాయి. ఎంపికైన అభ్యర్థులు మార్చి 25 నుండి ఏప్రిల్ 15, 2026 మధ్య తమకు కేటాయించిన పాఠశాలల్లో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి' అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి.గీతా నాయక్, కె. శారద, బి.సఖు నాయక్, సి. సహజ, శంకర్ రావు, లక్ష్మి ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న.. ప్రాజెక్టులను వెంటనే ఆమోదించాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ నిర్వహించిన అమృత్ 2.0 సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 7,444 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ నెట్‌వర్క్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.17,212 కోట్లు, ఇది ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో ఉందని ఆయన గుర్తుచేశారు. మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవనానికి సంబంధించి రూ.4,000 కోట్ల ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి శాస్త్రీయమైన డ్రైనేజీ వ్యవస్థ, స్వచ్ఛమైన నదీ పరివాహక ప్రాంతం అత్యంత అవసరమన్నారు.

# డిజిటల్ యుగంలోనూ వార్తల ప్రసారంలో ఆకాశవాణి పాత్ర సుస్థిరం

### ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ యుగంలోను 'ఆకాశవాణి వార్తలు' ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్‌కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుందని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని కవాడీగూడ సిజిఓ టవర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెలకువలను పెంపొందిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందనీ, గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌గా ఆకాశవాణిలో ఖచ్చితత్వం, ధర్మనిష్ఠను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. పిఐబి హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ వాట్సప్ యూనివర్సిటీ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ కమ్యూనికేటర్లుగా విలేకరులు క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ ఆకాశవాణి విశ్వసనీయతకు, సమగ్రతకు, సంపూర్ణతకు మారుపేరు అని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ మహేష్ మాట్లాడుతూ 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణిలో వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు.

# రేపు ఐపిఎల్ కెప్టెన్లతో బిసిసిఐ భేటీ

## చర్చకు రానున్న కీలక అంశాలివే!



క్రికెట్ అభిమానులకు వేసవి వినోదాన్ని పంచేందుకు ఐపిఎల్ సిద్ధమవుతోంది. పంతొమ్మిదో సీజన్‌కు మరో నాలుగు రోజులే ఉంది. టోర్నీ సమీపిస్తున్నందున పది జట్ల కెప్టెన్లతో భారత క్రికెట్ నియంత్రణ మండలి సమావేశం నిర్వహించనుంది. మార్చి 25(బుధవారం) ఐపిఎల్ కెప్టెన్లతో భేటీ సాయంత్రం 4 గంటలకు జరుగనుది. ఈ సందర్భంగా బిసిసిఐ, పది జట్ల సారథుల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది. ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ తొలి దశ మ్యాచ్‌లు మార్చి 28 నుంచి ప్రారంభం కానున్నాయి. దాంతో, పది జట్ల ఆటగాళ్లు నెట్స్ ప్రాక్టీస్, సన్నాహక ప్రాక్టీస్ మ్యాచ్‌లతో బిజీగా గడుపుతున్నారు. మెగా ఈవెంట్‌కు మరో నాలుగు రోజులే ఉన్నందున అందరు కెప్టెన్లతో బిసిసిఐ భేటీ అవ్వనుంది. మార్చి 25 (బుధవారం) సాయంత్రం పది జట్ల సారథులతో బిసిసిఐ కీలక అంశాలపై చర్చించనుంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ కెప్టెన్లతో సమావేశం ఉంటుందని మంగళవారమే ఫ్రాంచైజీలకు సమాచారం వెళ్లింది. బిసిసిఐ మ్యాచ్ రిఫరీలు జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్, అంపైర్ ప్యానెల్ సభ్యులు కెప్టెన్లతో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్నింగ్స్ టైమర్(60 సెకన్లు), ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, కంకషన్ సబ్‌స్టిట్యూట్, ఒక ఓవర్లో రెండు బౌన్సర్లు, బ్యాట్ చెకింగ్, బంతిని మార్చడం, బంతిపై లాలాజలం రుద్దడం, రిటైర్డ్ ఔట్ నియమాలు.. వంటివి ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఈ అంశాలపై మ్యాచ్ రిఫరీలు, అంపైర్లు పది జట్ల కెప్టెన్ల అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకోనున్నారు.

# ఆర్‌సిబి కీలక నిర్ణయం

## తొక్కిసలాట మృతుల జ్ఞాపకార్థం 11 సీట్లు రిజర్వ్!



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ సమీపిస్తున్న వేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. నిరుడు చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటలో మృతి చెందిన 11 మంది అభిమానులను ఆర్‌సిబి స్మరించుకోనుంది. విజయోత్సవ యాత్రలో పాల్గొనేందుకు వచ్చి అసువులు బాసిన ఆ పదకొండు మంది అభిమానుల జ్ఞాపకార్థం ప్రతి మ్యాచ్కు 11 సీట్లు రిజర్వ్ చేయాలని ఆర్‌సిబి యాజమాన్యం, కర్నాటక క్రికెట్ సంఘం నిర్ణయం తీసుకున్నాయి. పంతొమ్మిదో సీజన్‌లో ఆరంభ పోరుకు మరో నాలుగు రోజులే ఉంది. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆడబోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక నిర్ణయం తీసుకుంది. నిరుడు జూన్ 4వ తేదీన చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం ప్రతి మ్యాచ్‌లో 11 సీట్లను రిజర్వ్ చేయాలని ఆర్‌సిబి, కర్నాటక క్రికెట్ సంఘం భావిస్తున్నాయి. ఈ విషయాన్ని బెంగళూరు యాజమాన్యం ధ్రువీకరించింది. ఇదివరకే ఆ 11 మంది కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్సీబీ ఇప్పుడు మైదానంలో వారికి ప్రత్యేక గౌరవం కల్పించనుంది.

**తొక్కిసలాట జరిగిందిలా..!.** ఐపిఎల్ 18వ సీజన్ ఛాంపియన్గా అవతరించిన ఆర్‌సిబి మరుసటి రోజే కర్నాటకలో విజయయాత్రకు పిలుపునిచ్చింది. విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ విక్టరీ పరేడ్లో నిర్వహిస్తామని, అభిమానులు భారీగా తరలిరావాలని బెంగళూరు ఫ్రాంచైజీ కోరింది. కానీ, అందుకు తగిన భద్రతా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. అందుకే తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యమే ప్రథమ దోషి అని క్యాట్ అభిప్రాయపడింది. 'ఐపిఎల్ విజేతగా నిలిచిన తర్వాత బెంగళూరు టీమ్ ఎక్స్ వేదికగా విక్టరీ పరేడ్ పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్ చూసిన ఫ్యాన్స్ జూన్ 4న చిన్నస్వామికి భారీగా తరలివచ్చారు. 35 వేల సామర్థ్యం ఉన్న స్టేడియానికి 2.5లక్షల మంది రావడంతో పోలీసులు వాళ్లను అదుపు చేయలేకపోయారు. పైగా వాళ్లకు అంతమందిని నియంత్రించేందుక అవసమరైన బలగాలను సమకూర్చుకునే సమయం కూడా లేకపోయింది. అయినా పోలీసులేమీ దేవుళ్లు కాదు కదా.. అంతా క్షణాల్లో అదుపు చేయడానికి. సో.. ఈ దుర్ఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని చెబుతూ ఆర్‌సిబి యాజమాన్యం తప్పించుకోవడానికి లేదని క్యాట్ వెల్లడించింది. చిన్నస్వామి తొక్కిసలాట తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ దేవజిత్ సైకియా సైతం ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా విక్టరీ పరేడ్ జరపడాన్ని ఖండించాడు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కర్నాటక ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఫలితంగా ఆర్‌సిబి, కర్నాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ ప్లానింగ్ సంస్థపై కేసులు నమోదయ్యాయి. అనంతరం కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఏ.శంకర్, కోశాధికారి జయరామ్ రాజీనామా చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బిసిసిఐ మార్గదర్శకాలు జారీ చేసింది.

# మహిళ

# 'డిజిటల్' ప్రమాదాలు!

డిజిటల్ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక ప్రపంచంలో మహిళల జీవితాలు కొత్త అవకాశాలతో పాటు కొత్త ప్రమాదాలను కూడా ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఎఐ) విస్తరణతో డిజిటల్ వేదికలు విద్య, ఉపాధి, వ్యాపారం, వ్యక్తిగత అభివృద్ధికి మార్గాలను తెరిచినప్పటికీ, అదే సమయంలో మహిళలను లక్ష్యంగా చేసుకున్న ఆన్‌లైన్ దాడులు, లైంగిక దోపిడీ, గోప్యత ఉల్లంఘనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి సాంకేతిక అభివృద్ధి, లింగ అసమానతల మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఎఐ ఆధారిత సాంకేతికతల అభివృద్ధితో 'డీప్‌ఫేక్' అనే కొత్త డిజిటల్ ప్రమాదం ఉద్భవించింది. డీప్ ఫేక్ అనేది కృత్రిమ మేధస్సు సహాయంతో ఒక వ్యక్తి ముఖం లేదా స్వరాన్ని వేరే వీడియో లేదా చిత్రంలో వాస్తవంగా కనిపించేలా మార్చడం. ఈ సాంకేతికత వినోదం లేదా విద్య వంటి సానుకూల ప్రయోజనాల కోసం ఉపయోగపడగలిగినా, ప్రస్తుతం ఇది మహిళలపై లైంగిక దోపిడీకి ముఖ్య సాధనంగా మారుతోంది. అనుమతి లేకుండా మహిళల చిత్రాలను ఉపయోగించి అశ్లీల వీడియోలు రూపొందించడం ఒక తీవ్రమైన మానసిక, సామాజిక హింసగా మారింది. బాధితులు సామాజిక అవమానం, మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన నష్టాలను ఎదుర్కొంటున్నారు. డిజిటల్ ప్రపంచంలో మహిళలు తరచుగా ఆన్‌లైన్ వేధింపులకు గురవుతున్నారు. సోషల్ మీడియా వేదికల్లో ట్రోలింగ్, లైంగిక వ్యాఖ్యలు, బెదిరింపులు, వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం వంటి చర్యలు మహిళల డిజిటల్ భాగస్వామ్యాన్ని తగ్గించే ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రజా జీవితంలో ఉన్న మహిళలు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు లేదా కంటెంట్ సృష్టికర్తలు ఎక్కువగా లక్ష్యంగా మారుతున్నారు. ఈ పరిస్థితి మహిళల స్వేచ్ఛా అభివ్యక్తిని పరిమితం చేస్తూ, డిజిటల్ వేదికలను అసురక్షిత ప్రదేశాలుగా మార్చుతుంది. సాంకేతికత అవకాశాలను అందిస్తున్నప్పటికీ, డిజిటల్ డివైడ్ అనే సమస్య మహిళల అభివృద్ధికి అడ్డంకిగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో లేదా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో మహిళలకు ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్‌లు లేదా డిజిటల్ విద్యకు తక్కువ ప్రాప్యత ఉంది. కుటుంబ, సామాజిక నియంత్రణలు కూడా మహిళల టెక్నాలజీ వినియోగాన్ని పరిమితం చేస్తాయి. ఫలితంగా విద్య, ఆన్‌లైన్ ఉపాధి, డిజిటల్ బ్యాంకింగ్ వంటి అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ఆర్థిక స్వావలంబనను కూడా ప్రభావితం చేస్తుంది. డిజిటల్ ప్రమాదాలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా సామాజిక నిర్మాణాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. మహిళలపై జరిగే ఆన్‌లైన్ హింస తరచుగా ఆఫ్‌లైన్ జీవితంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. భయం, అవమానం లేదా కుటుంబ ఒత్తిడి కారణంగా చాలామంది మహిళలు సోషల్ మీడియా ఖాతాలను మూసివేయడం లేదా తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం తగ్గించడం కనిపిస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్య చర్చల్లో మహిళల పాల్గొనడం తగ్గుతుంది. అదే డిజిటల్ వేదికలు మహిళలకు విద్య, వ్యాపారం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక మద్దతు నెట్‌వర్క్‌లను అందిస్తున్నాయి. ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాలు, డిజిటల్ మార్కెటింగ్, ఇంటి నుంచే పని చేసే అవకాశాలు మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి సోషల్ మీడియా, ఇ–కామర్స్ వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పరిష్కారం సాంకేతికతను నిరాకరించడం కాదు, దానిని సురక్షితంగా, సమానంగా వినియోగించే విధానాలను నిర్మించడం. డిజిటల్ భద్రతపై అవగాహన, కఠినమైన సైబర్ చట్టాలు, వేగవంతమైన ఫిర్యాదు వ్యవస్థలు, ఎఐ వినియోగంపై నైతిక నియంత్రణలు అవసరం. మహిళలకు డిజిటల్ విద్యను అందించడం, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం, ఆన్‌లైన్ భద్రతపై శిక్షణ ఇవ్వడం కీలకం. మొత్తానికి, ఎఐ, డిజిటల్ సాంకేతికతలు మహిళల జీవితాలను మారుస్తున్న శక్తివంతమైన సాధనాలు. అయితే సరైన రక్షణ వ్యవస్థలు లేకపోతే అవే సాంకేతికతలు అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది.



## చేదు నిజం

భారతదేశంలో మహిళల హక్కులు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ చట్టాలకు సంబంధించిన రెండు ముఖ్యమైన న్యాయ వ్యాఖ్యలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఇవి సమాజంలో లింగ సమానత్వం, ఉద్యోగ విధానాలు, కుటుంబ హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యతను ఇవి చూపిస్తున్నాయి. మొదటగా, మహిళలకు తప్పనిసరి 'నెలసరి' సెలవులు అమలు చేసే విషయంలో సుప్రీం కోర్టు ఒక ముఖ్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కొంతమంది సామాజిక వర్గాలు మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సెలవులను తప్పనిసరి చేయాలని కోరుతున్నాయి. అయితే సుప్రీంకోర్టు అభిప్రాయం ప్రకారం అలాంటి విధానం అనుకోకుండా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. కంపెనీలు మహిళలకు అదనపు సెలవులు ఇవ్వాల్సిన బాధ్యత ఉందని భావిస్తే, వారు ఉద్యోగాల్లో మహిళలను నియమించడంలో సంకోచించవచ్చని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అంటే మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టిన విధానం, చివరకు మహిళల ఉద్యోగ అవకాశాలను తగ్గించే ప్రమాదం ఉందని కోర్టు సూచించింది. అందువల్ల ఈ అంశంపై ప్రభుత్వాలు సమతుల్యమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు, న్యాయ నిపుణులు చర్చిస్తున్నారు. ఇక రెండవ అంశం కుటుంబ హక్కులకు సంబంధించినది. ఢిల్లీ కోర్టు ఇచ్చిన ఒక తీర్పు ప్రకారం, వృద్ధుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలు ఒక మహిళకు ఉన్న నివాస హక్కును పూర్తిగా రద్దు చేయలేవు. ముఖ్యంగా పెళ్లి తరువాత భార్యకు తన భర్త కుటుంబ గృహంలో నివసించే హక్కు ఉంటుంది. దీనిని 'ఇంట్లో భాగం' అనే భావనగా చట్టం గుర్తిస్తుంది. కొన్నిసార్లు వృద్ధ తల్లిదండ్రులు తమ ఇంటిని తిరిగి పొందడానికి లేదా కోడలిని బయటకు పంపించడానికి సీనియర్ సిటిజన్ చట్టాలను ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. అయితే, అలాంటి చట్టాలు మహిళల నివాస హక్కును పూర్తిగా కొట్టిపారేయలేవని కోర్టు పేర్కొంది. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కూడా సమానంగా పరిగణించాలని పేర్కొంది. ఈ రెండు న్యాయపరమైన తీర్పులు మహిళల హక్కులు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యతను సాధించడం సులభం కాదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.



## గీత కార్మికులకు పెండింగ్
# ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలి



### గీత పనివారల సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్ గ్రేషియా బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించడంతో పాటు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యోధులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావుకు రాష్ట్ర గీత పనివారల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర సమన్వయకార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కనకమామిడి శ్రీశైలంగౌడ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటు పడిన సిపిఐ అగ్ర నాయకులు బొమ్మగాని ధర్మ భిక్షం విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంతో పాటు ఆ మహానేత వర్ధంతి, జయంతిలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం సూర్యాపేట జిల్లాగా నామకరణం చేయాలన్నారు. సూర్యాపేట జిల్లా మోతె గ్రామంలో 40 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో చెట్లు పెంచుకుని కల్లుగీత వృత్తిని కొనసాగిస్తున్న గీత వృత్తిదారులు సహకార సొసైటీకి భూమి హక్కు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాలను మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం హైదరాబాద్ లోని అబ్కారి భవన్‌లో ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమిషనర్ కురేషికి వినతి పత్రం అందజేశారు.

# వికెసిఎం ఒసిలో యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి

### బదిలీ కార్మికులను వికెసిఎం ఒసిలోకి తీసుకోవాలి
### కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి
### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వికెసిఎం ఓపెన్ క్యాస్ట్‌లో సింగరేణిసంస్థ యంత్రాలతో, సింగరేణి కార్మికులతో బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణవైపు సింగరేణి యాజమాన్యం మొగ్గు చూపితే ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షను సాబీర్‌పాషా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికెసిహెచ్‌పి క్రషర్ల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించే కుట్రలు చేస్తున్నారని, ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం పివికె5 ఇంక్లైన్ నుండి సత్తుపల్లిలో సుదీర్ఘ కాలంగా డెప్యుటేషన్ పై వెళ్లిన జనరల్ అసిస్టెంట్లను సర్ఫసే జనరల్ అసిస్టెంట్లుగా మార్పుచేసి వారికి తిరిగి కొత్తగూడెం ఏరియాలో పోస్టుగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో జికే ఓపెన్ క్యాస్ట్ నుండి సత్తుపల్లికి వెళ్లిన సింగరేణి ఉద్యోగులందరినీ తక్షణమే వికెసిఎం ఓసికి వెనక్కు తీసుకురావాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. సంస్థ లాభాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించడంలో .యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం తగదని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని పాషా హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వంగ వెంకట్, జి.వీరస్వామి, వి మల్లికార్జున రావు, ఎస్‌వి రమణమూర్తి, ఎస్.నాగేశ్వర రావు, చందర్‌రావు, రాములు, బందారు మల్లయ్య, కార్పొరేటర్ మునిగడప పద్మ, మూనిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం

### సిఎం కప్ రాష్ట్రస్థాయి ముగింపు వేడుకల్లో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మట్టిలోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సిఎం కప్ పోటీ నిర్వహించామని, ఇది ఒక నిరంతర కార్యక్రమంలా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సిఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్‌షిప్ టీమ్‌లకు ప్రొసీల బహుకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఎపి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడాసంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారంతోనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ సిఎంకప్ పోటీలలో దాదాపు 5లక్షల40వేల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. ఐదు అంచెల్లో కొనసాగిన సిఎం కప్ పోటీల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి.

# భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆర్.కె 4 గడ్డ నుండి రాజీవ్ చౌక్ వరకు ఘనంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరులకు సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐటియుసి కేంద్రకార్యదర్శి ఎండి.అక్బర్‌అలీ, ఎఐవైఎఫ్ మాజీ జిల్లాఅధ్యక్షులు నక్క వెంకటస్వామి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ వీరోచిత పోరాటాలు బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించాయన్నారు. 1931 మార్చి 23న 23 ఏళ్లు కూడా నిండని భగత్‌సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందని, ఉరిశిక్షకు ముందు ఆఖరి కోరికగా రష్యా విప్లవ నేత లెనిన్ రాసిన పుస్తకాన్ని చదవాలని కోరిన భగత్‌సింగ్ ధైర్యం అమోఘమని వారు పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధమని ప్రకటించి, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలతో ఉరికంభం ఎక్కిన విప్లవవీరుల మరణం యువతరానికి స్ఫూర్తిదాయకమని, భారత ప్రజల హృదయాల్లో భగత్‌సింగ్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి పౌలు, వనం సత్యానారాయణ, మొండి, సాంబయ్య, గోపి, నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రాజు, రాజేశం, సంపత్, హరిరామ కృష్ణ, కొమురయ్య, రవి, శంకర్, శ్రీనివాస్, రాములు, శ్రీనివాస్, తొకల రాజన్న తదితరులు పాల్గొన్నారు.




## ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్
# పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిఇఒ జిల్లా కార్యాలయం అధికారికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా రఘురాంనాయక్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ముగియక ముందే 2026–27కు సంబంధంచిన అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా, డోర్ టు డోర్ అడ్మిషన్ డ్రైవ్ చేసి విద్యార్థులకు, విద్యార్థుల తల్లితండ్రులకు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పాఠశాలలకు సంబంధించిన విద్యాశాఖ నుంచి ఎటువంటి పర్మిషన్ లేకపోయినా ఓర్డింగ్‌లు, ప్లెక్సిలు పెట్టి సిబిఎస్‌సి పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. అను మతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంబంధిత విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుభోద్, జిల్లా ఉపాధ్యక్షులు కుశాల్, నాయకులు కిషోర్, నిఖిల్, గణేష్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
25-03-2026
www.prajapaksham.in
GREATER HYDERABAD మహానగరి
GREATER HYDERABAD

## ఇండ్లస్థలాల కోసం ఇందిరా పార్కు వద్ద జరిగిన ధర్నాలో సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఇళ్ళ స్థలాల కోసం నగరంలో ఇందిరా పార్కు వద్ద మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ్మా, కావలి సురేష్, శివురాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణ దినోత్సవం




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ)లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, సమయానికి పరీక్షలు చేయించుకోవడం, పూర్తి స్థాయి చికిత్స తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రేవతి రెడ్డి, టంగుటూరు ఆసుపత్రి డాక్టర్, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల డిమాండ్



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కోర్టు అదేశాలను పాటించాలని మర్లకుంట తండా గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల రిలేదీక్షలు 8వ రోజుకు చేరాయి. ఈసంధర్భంగా రైతులు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులను అధికారులు బేఖాతరు చేస్తున్నారన్నారు. రైతులు చేస్తున్న దీక్షకు కుర్మిద్ద గ్రామ సర్పంచ్ శ్రీవిద్య శ్రీరాములు, బిఅర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పంది శేఖర్ మద్దతు తెలిపారు.

## పేదలకు అండ సిఎం సహాయనిధి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి పనిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు చెందిన బుయంకర్ నర్సింగ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన రూ.35వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్దిదారుడికి ఆర్థికసాయం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్లు రాజునాయక్, మురళీమోహన్ (అప్పి), సి.పెంటయ్య, మాజీ కౌన్సిలర్లు రాజేందర్‌రెడ్డి, పాలమాకుల చెన్నయ్య, యువనాయకుడు డాకన్నగారి మనీష్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి వేడుకలను ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాహెబ్ నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయ స్వామి అవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో శోభ యాత్ర నిర్వహిస్తామని, బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో ఆటో స్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనిల్ చౌదరి, గంగం శివశంకర్, గౌరి శెట్టి మనోజ్‌కుమార్, నీలం రాజశేఖర్ గౌడ్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన టిపిసిసి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం అసెంబ్లీ అవరణలో టిపిసిసి అధికార ప్రతినిధి వంకదువత్ విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి హస్తినాపురం డివిజన్ సమస్యలను వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని, కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు, సాగర్ కాంప్లెక్స్ 22ఏ ఇండ్ల సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లాడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ మేరకు మంత్రి సానుకులంగా స్పందించినట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

# భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం వద్దు




ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలని పట్టణ ప్రణాళిక(టౌన్‌ప్లానింగ్) విభాగం అధికారులను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఎంఎంసి పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, పట్టణ ప్రణాళికా అంశాలపై మంగళవారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, జోనల్ సిటీ ప్లానర్లు కృష్ణా మోహన్, శ్రీనివాస్‌రావు, సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

### గుంతలు లేని నగరంగా మల్కాజిగిరి

గుంతలు లేని నగరంగా మల్కాజిగిరిని తీర్చిదిద్దాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరి పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. తార్నాకలోని మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ నిర్వహణ, ప్రాజెక్టులు, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణపై కమిషనర్ సమీక్షించారు. పనులలో జాప్యం నెలకొనడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వీధి దీపాల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, అవసరమైన పరికరాలను ముందుగానే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని స్పష్టం చేశారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డితో పాటు సుపరింటెండెంట్ ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య వ్యవస్థలో సమూల మార్పులు

వచ్చేనెల 1 నుంచి అమలు

కొత్త నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర పారిశుద్ధ్య వ్యవస్థలో సమూల మార్పులు వస్తున్నాయని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన అన్నారు. మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎంఎస్‌డబ్ల్యూ), పారిశుద్ధ్య కార్యకలాపాలపై కమిషనర్ సృజన మంగళవారం న్యాక్ ఆడిటోరియంలో ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చేనెల 1వ తేదీ నుండి నూతన మున్సిపల్ ఘన వ్యర్థాల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సేవల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెంచడమే కార్పొరేషన్ ప్రథమ ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వంద శాతం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. చెత్తను మూలస్థానంలోనే వేరు చేసే ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, దానిని అమలు చేయాలని సూచించారు. అనుమతి పొందిన ఏజెన్సీలు లేదా వ్యక్తులు మాత్రమే చెత్త సేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. త్వరలోనే వీటికి సంబంధించిన ప్రామాణిక నిర్వహణ విధానాలను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, డాక్టర్ యాదగిరి రావు, అధికారులు అదనపు సిటీప్లానర్ శైలజ, సిటీప్లానర్ శ్యామ్, అధికారులు తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





## రోడ్లను పట్టించుకునే నాథుడే లేడు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు హైదరాబాద్ స్థిర నివాసం ఏర్పచుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మంది నగరాన్ని వీడుతున్నారని బిఆర్ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ సిఎంగా కెసిఆర్, మంత్రిగా కెటిఆర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తే, సౌత్ ఇండియా సూపర్ స్టార్ రజనీకాంత్ హైదరాబాద్ అభివృద్ధి చూసి అబ్బురపడ్డారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ హయంలో రోడ్లు, డ్రైనేజి సరైన సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. ముషీరాబాద్‌లో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని విమర్శించారు. పద్మారావునగర్, గంగపుత్ర కాలనీ, పార్సిగుట్టలో రోడ్లు పాడయ్యాయని తెలిపారు. చిక్కడపల్లిలో రోడ్ల విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సుందరయ్య పార్క్ చుట్టుపక్కల రోడ్లు కూడా అధ్వాన్నంగా ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా రోడ్‌ల సమస్యను పట్టించుకోవడం లేదని గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహావీర్ జయంతి సందర్భంగా

## 31న మాంసం దుకాణాలు బంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 31న జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్నిమాంసం దుకాణాలను మూసివేయాలని జిహెచ్‌ఎంసి వెటర్నరి విభాగం అధికారులు ఆదేశించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్ని పశువుల, గొర్రెల, మేకల కబేళాలు మూసివేయాలన్నారు. జిహెచ్‌ఎంసి చట్టం, 1955లోని సెక్షన్ 533(బి) ప్రకారం ఉత్తర్వులు కమిషనర్ జారీ చేశారని అధికారులు చెప్పారు. ఆదేశాలను అమలు చేసేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకారం అందించాలని కోరుతూ జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు.

## జూన్ నాటికి సంతోష్‌నగర్ ఫ్లైఓవర్ పనులు పూర్తి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చంచల్‌గూడ సంతోష్ నగర్ మధ్య నిర్మాణంలో ఉన్న స్టీల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ సంతోష్ నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ పనుల పూర్తి కోసం జూన్ నెలను డెట్‌లైన్‌గా నిర్ణయించుకుని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీలో చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరాటాలు

ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడ ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, దోపిడీ ఉపాధి పద్ధతులకు మార్గం చూపే 4 కార్మిక కోడ్లను నేడు బిజెపి ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు.కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు ఐఎన్‌టియుసి నేతలు కార్మికులను సంఘటితం చేసి వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహించాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో ఐఎన్‌టియుసిని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి ఆదేశానుసారం జిల్లా శాఖను రద్దు చేసి, నూతన కార్యవర్గం నియమించినట్టు ఆయన తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా బి.రామకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు.శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎండి హమీద్,ఎన్ శివ, పి.ఇలేష్‌లను రాష్ట్ర ఐఎన్‌టియుసి నియమించిందని, జిల్లాలోని మున్సిపాలిటీలలో, డివిజన్‌లలో, మండలాలలో, గ్రామస్థాయిలో త్వరలో ఐఎన్‌టియుసి కొత్త కార్యవర్గాన్ని నియమిస్తామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత సమర్థవంతంగా పని చేయాలని నూతన జిల్లా కార్యవర్గానికి మొగుళ్ల రాజిరెడ్డి కోరారు. సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్‌డి.చంద్రశేఖర్, వై.నాగన్న గౌడ్, ఉపాధ్యక్షులు ఎల్‌డి పాల్, ఎం.నర్సింగ్ రావు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

## నాణ్యతగా అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ఏ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్1లో చేపడుతున్న బిటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన ప్రమాణాలు పాటించి రోడ్డు పనులు పూర్తిచేయాలని సూచించారు. కాలనీ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు గుర్తు చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, శ్రీనివాసరావు, మాణిక్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.



## విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి

**ప్రజాపక్షం/కొత్తూరు:** విద్యార్థులకు ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బిఆర్ఎస్ యువ నాయకుడు మేకల రాఘవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఫీజులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఛలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మేకల రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులకు చెల్లించకుండా ప్రభుత్వం నాన్చుడు దోరణి అవలంభిస్తుందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతుంటే అరెస్టులతో అణచివేయాలని చూడటం దుర్మార్గమని, ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత నుండి తప్పించుకోలేదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసి విద్యార్థుల చదువులను ఆటంక పరచడం దారుణమన్నారు. ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండివైఖరీ వీడాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి పైసాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం ఆగదని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కాలనీవాసుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీవాసుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌జిఓఎస్ కాలనీ గ్రంథాలయం పనులు నేటినుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మంగళవారం ఎన్‌జిఓఎస్ కాలనీ పెద్దలు, కాలనీ వాసులు లైబ్రరీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలోఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రంథాలయం పనులు తాను ఎప్పుడు అపలేదని, కొందరు బిజెపి కార్పొరేటర్ల దుందుడుకు చర్యల కారణంగా పనులు నిలిచిపోయాయని ఆయన తెలిపారు. గ్రంథాలయం పనులు రేపటి నుంచి ప్రారంభించాలని అక్కడే ఉన్న గ్రంథాలయం ఇఇ, డిఇలను ఆదేశించడం జరిగిందన్నారు. గ్రంథాలయం పనులు ప్రారంభం కానుండడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డిలను కాలనీవాసులు సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు సోమయాజులు, పంపన్న వెంకటేశ్వర్లు, శివనాగేశ్వర్‌రావు, వేముల జైపాల్‌రెడ్డి, వర్ధని, శశిధర్‌రెడ్డి, ఓం ప్రకాష్, భూషణ్, విశ్వనాథం పాల్గొన్నారు.

# బాధ్యతగా ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణ

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని అధికారులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్‌లతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 10 థీమ్‌లతో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేకదృష్టి సారించాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయతీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్‌కు సంబంధించిన భవనాల మరమ్మత్తులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని, కార్యాలయాల పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ పూర్తి చేయాలని, ఏ ఒక్క శాఖలో కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. జనన మరణ ధృవీకరణ పత్రాల జారీ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఫైల్‌లు క్లియర్ చేయాలన్నారు. ప్రతిఒక్కరూ తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా పనిచేసే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని, పైపు లీకేజులు లేకుం డా చూడాలని, ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతులు జరిపించాలన్నారు. వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్‌భగీరథ, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ సంగీతం, జడ్‌పి సిఇఓ కృష్ణారెడ్డి, డిపిఓ వి.సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పిడి డిఆర్‌డిఎ శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, సంక్షేమ శాఖ అధికారులు నవీన్ కుమార్‌రెడ్డి, బి.కేషురామ్, రామరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 31 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జోన్ సిడి 6 చార్మినార్ పరిధిలో 31 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు ఇచ్చారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అదేశాల మేరకు హైదరాబాద్ జోన్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్‌రెడ్డి సిడి 6 చార్మినార్ పరిధిలోని 31 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు ఇచ్చారు. జోన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మాల్కాజిగిరి, వికారబాద్, సంగారెడ్డి జిల్లాలోని కానిస్టేబుళ్లకు ఈ పదోన్నతులు అందివచ్చాయి. ఈ జోన్‌లో జోన్‌లో 155 హెడ్ కానిస్టేబుళ్ల పోస్టులు ఉన్నాయి. పస్తుతం జోన్‌లో 124 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఖాళీగా ఉన్న 31 హెడ్ కానిస్టేబుల్ పోస్టుల్లో అర్హత కలిగిన కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతులు వచ్చాయి.

## సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలి

### సిఎం రేవంత్‌ను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఉప్పల్ నియోజక అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళ వారం ఆయన సిఎంను కలిసి తన డివి జన్ ప్రాంతాల్లో అవసరమైన వివిధ అభి వృద్ధి పనులను వివరిస్తూ ఉప్పల్ నియో జకవర్గంలో తలపెట్టిన నూతన మల్కాజి గిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన నిర్మాణానికి జరిగే భూమి పూజకు రావాలని సిఎంను కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల అవసరా లను దృష్టిలో పెట్టుకొని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. రామం తాపూర్‌లో కొత్తగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, చర్లపల్లి డివిజన్ పరిధిలో 2009లో ఇందిరా గృహకల్ప పథకం కింద నివాసితుల డ్రైనేజి, స్లాబ్ పగుళ్లు, నీటి లీకేజి వంటి సమస్యలు పరిష్కరించటంలాంటి అవసరాన్ని గుర్తు చేసారు.



## రెండు రోజుల పాటు ఓటర్ ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) శిక్షణ

### త్వరలో నిర్వహిస్తామన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఓటర్ జాబితాప్రక్షాళనలో భాగంగా జిల్లాలో ఇంటింటికి తిరుగుతూ ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ లెవల్ ఆఫీ సర్లకు అందచేస్తారని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ అవగాహ న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందస్తు శిక్షణలో భాగంగా లీడర్‌షిప్, మోటివేషన్ శిక్షకులు, ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ, వివిధ రాజకీయ పార్టీ ప్రతిని ధులకు ECINET/BLO యాప్‌లను వినియోగించుకోవటానికి అవసరమైన మెలకువలను, సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించారు. నియోజక వర్గాల వారీగా సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు రెండు రోజుల పాటు ఓటర్ ప్రత్యేక సవివర సవరణ (SIR) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శిక్షణ అనంతరం బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ వివరాలను సేకరిస్తారని, తద్వారా నిజ మైన ఓటర్ల గుర్తింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ చంద్రావతి, ఆర్డీఓలు రాజేశ్వర్ రావు, శ్యాంసుందర్, డిఎల్‌ఎంటి తిరుమ లేష్, రవీంద్రచారి, తహసీల్దార్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాలతో కూరగాయలు పండించాలి

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రైతులు మేలురకమైన నాణ్యమైన విత్తనాలతో కూరగాయలను పండించాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సింహాయాదవ్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి రైతు వేదికలో ఆత్మపథకం ద్వారా రైతులకు మేలు రకమైన కూరగాయల విత్తనా లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ సాగులో భాగంగా కూరగాయలను పండించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని అన్నారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయా ధికారి ప్రవీణ, హార్టికల్చర్ అధికారి వెంకటరమణ, ఎఇఒ సురేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.




## గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిం చారు. ఈ వైద్య శిబిరానికి శిశు వైద్య నిపుణులు డాక్టర్ శివకిరణ్ అధ్యక్షత వహించగా ఆర్‌బిఎస్‌కె టీమ్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గురు కుల పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సమగ్ర వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని, అవసరమైన విద్యార్థులకు కంటి పరీక్ష లు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు వైద్య బృందం అందిస్తుందని చెప్పారు. విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించుటకు సిపిఆర్ ట్రైనింగ్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్, అనీమియా, అలాగే పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంపై మరింత అవగాహన పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యబృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న చింతల కుంట

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని డి.పోచంపల్లి లోని చింతల కుంట అభివృద్ధికి నోచుకోకపోవడం చెత్తా చెదారం పేరుకుపోవ డంతో గ్రామస్తులు, ప్రయాణీకులు, పాదచారులు, ఈ దారిన ప్రయాణిం చాలి అంటే ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టుపక్కల, కాలనీవాసులు ఈ ప్రాంతంలో డ్రైనేజీ నీరు కలపడంతో మత్స్య కారులు పెంచడానికి కుంటలో వేసిన చేపలు చనిపోవడంతో వారి బాధలు వర్ణనా తీతం. కుంటలో డ్రైనేజీ కలవడం తో దోమలు, ఈగలతో విష జ్వరా లు సోకే ప్రమాదం ఉందని అధికారులకు సమస్యలు చూపినా, చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు, 12 కోట్లు పైగా నిధులు కేటా యించినా, అభివృద్ధి పనులు కాకపోవడం ప్రజా పాలనలో పనులు కాని పాలన ఏంట ని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేపట్టడంలో పూర్తిగా విఫలం అయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా డి. పోచంపల్లి చింతలకుంటను అభివృద్ధి పరచాలని గ్రామస్తులు వేడు కుంటున్నారు.

# నాచారం చెరువు అభివృద్ధికి సన్నాహాలు

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్



**ప్రజాపక్షం/ఉప్పల్:** హైడ్రా రెండో విడతలో చేపడుతున్న 14 చెరువుల పునరుద్ధరణ పనుల పురోగతిని హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ మంగళ వారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నాచారం సర్కిల్‌లోని నాచారం పెద్ద చెరువును సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. మొత్తం 108.30 ఎకరాల విస్తీర్ణం కలిగిన నాచారం చెరువులో సుమారు 81.12 ఎకరాల మేర నీటి భాగం గుర్రపు డెక్కతో కమ్ముకుపోయినట్లు గుర్తించారు. వెంటనే చెరువులోని మురుగు నీటిని బయటకు వదిలి, పూడికను పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద ఎత్తున కమిషనర్‌ను కలిసి చెరువు పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశా రు. మురుగునీరు కలవడం వల్ల గుర్రపు డెక్క విస్తరించి దోమల సమస్య తీవ్రంగా మారిందని వారు తెలిపారు. అంబర్‌పేట్ బతుకమ్మ కుంట, పాతబస్తీ బమ్రుక్‌నుద్దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు తరహాలో అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. గతం లో ఏర్పాటు చేసిన ఎస్‌టిపి ప్రయోజనం లేకుండా మురుగునీరు నేరుగా చెరువులో కలుస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ చెరువు నీరు ఉప్పల్ నల్లచెరువులోకి చేరుతున్నందున అభివృద్ధి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో కాలువను డైవర్ట్ చేసే పనులను ప్రారంభించాలని సూచనలు చేశారు. చెరువుల అభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న హైడ్రా ఈ పనులు చేపట్టడంపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్‌ను శాలువాతో సత్కరించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## మత్తు పదార్థాల జోలికి పోవొద్దు.. జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

### విద్యార్థులకు సూచించిన జగద్గిరిగుట్ట సిఐ వెంకటేష్




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మత్తు పదార్థాల పట్ల చిన్ననాటి నుంచే అవగా హన కలిగి ఉండాల్సిన అవసరం ఉంద ని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. మంగళ వారం స్థానిక రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలిసీ తెలియని వయసులో కొందరు మత్తు పదార్థాలకు బానిసలవుతూ తమ జీవితా లను నాశం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపం కాలుతుందని తెలిసి దాన్ని ఎవరూ ముట్టుకోబోరని, అదేవిధంగా మత్తు పదార్థాల జోలికి కూడా పోవద్దని సూచించారు. సొసైటీలో నకిలీ వస్తువులు ఏ విధంగా అయితే లభ్యమవుతున్నాయ అదే స్థాయిలో మత్తు పదా ర్థాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించడంలో పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుం దని స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండా ల్సి న అవసరం ఉందన్నారు. బాలి కలు అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలిసిన వ్యక్తులైన, తెలియని వ్యక్తులైన తమ పట్ల అనుచితంగా ప్రవర్తించినట్ల యితే వెంటనే పోలీసుల ను ఆశ్ర యించాలని సూచించారు. బాలిక లకు రక్షణ కోసం షీ టీంలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిం దని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావానికి అస్సలు గురి కావద్దని, తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు సూచించిన విధంగా సత్ప్ర వర్తనతో మెలగాలని తెలిపారు. విద్యార్థులు సొసైటీ పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ఎవరైనా అపాయంలో ఉంటే వారికి తప్పకుండా సహాయం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇళ్లల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవాలి

### అందుబాటులో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తమ ఇళ్లల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని వినియోగించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారిణి చంద్రావతి సూచించారు. కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంగా అమలులోకి తెచ్చిన సబ్సిడీతో కూడిన ఈ పథకం కింద గృహ విని యోగదారులు తమ ఇళ్ల రూఫ్‌టాప్‌పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవటం ద్వారా ప్రతి నెలా 360 యూనిట్ల వర కు విద్యుత్ పొందవ చ్చన్నా రు. ఈ పథ కానికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ఆమె కలెక్టర్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభిం చారు. సోలార్ ప్లాంట్ వల్ల విద్యుత్ ఖర్చులు తగ్గుతాయన్నారు. దీనికి సంబంధించిన వివ రాలు, సందేహాలను తెలుసుకొనే వీలుగా ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు పనిచేసే విధంగా హెల్ప్‌లైన్ నంబ ర్లు 08046733622, 46733633 పని చేస్తా యని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ వేణు గోపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శ్రీనివా సరెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి శేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ ఓంప్రకాష్, విలాసరావు, ఆనంద్, సంతోష్, మహ్మద్ మజర్ లు పాల్గొన్నారు.

## బరి తెగించిన ఇసుక మాఫియా

### అక్రమార్కుల కోసం గాలిస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఇసుక మాఫియా బరితెగించింది. మమ్మల్నే అడ్డుకుంటారా..మీ అంతు చూస్తామంటూ ఇసుక అక్రమార్కులు ఏకంగా అడ్డుకోబోయిన పోలీసు వాహనాన్ని ఢీ కొట్టి పరారైన ఘటన వికారా బాద్ జిల్లా తాండూరు సబ్‌డివిజన్ పరిధి బషీరాబాద్‌లో చోటు చేసుకుంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనంపైకి దూసుకరావడంతో వాహనం ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అడ్డుకోబోయి వివరాలను తెలుసుకుంటుండగా తమనే అడ్డుకుంటారా అంటూ అక్రమార్కులు ఏకంగా పోలీసు వాహనాన్ని ఇసుక ట్రాక్టర్‌తో ఢీ కొట్టి పరారయ్యారు. వాహనంలో ఉన్న పోలీసులు స్వల్ప గాయాల పాలైనారు. గతంలో కూడా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన పోలీసు కానిస్టేబుల్‌ను ఇసుక ట్రాక్టర్‌తో ఢీ కొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. తాండూరులో ఇసుక మాఫియా ఏ రేంజ్‌లో చెలరేగి పోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. అడ్డుకోబో యిన బషీరాబాద్ పోలీసు వాహనాన్నిఢీ కొట్టడం చర్చనీయాంశంగా మారిం ది. అయితే బషీరాబాద్ పోలీసలు మాత్రం పోలీసు వాహన్ని ఢీ కోట్టిన ఇసుక ట్రాక్టర్లను ఆచూకి కనుగొనేందుకు తీవ్ర ప్రయాత్నాలు చేస్తున్నారు. ఇలా అయితే తాండూరులో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించిన తాండూరులో కొనసాగు తున్న ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## 13వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య

**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య ,వికారా బాద్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో పర్యాటించారు.వార్డులో ఉన్నా సమస్యలను తెలుసుకున్నారు. వార్డులో ఉన్న సమస్యలను ఓపెన్ డ్రైనేజి, రోడ్లు ,శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు మున్సిపల్ లోని అన్ని వార్డులో పర్యాటించడం జరు గుతందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మణ పనులను పరీ శింలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు ముదురుతు న్నాయి కావున ముందు జాగ్రత్తగా నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేవించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి , మున్సిపల్ కమిషనర్ విక్రమంసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిబిపై అవగాహన ర్యాలీ




**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రపంచ టిబి దినోత్స వం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధి కారి డాక్టర్ స్వర్ణ కుమారి, టిబి నియంత్రణ అధికారి రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఐసిడి ఎస్ లో టిబి పై అవ గాహన కార్యాక్రమం ను అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్,ట్రైనింగ్ కలెక్టర్ హర్ష చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైద్యఆ రోగ్య సిబ్బంది, వైద్యకళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంతకుముందు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి జ్ఞ చేయించారు. అనంతరం టిబి చికిత్స పోందు తున్న రోగులకు యజ్ఞ ఫౌండేషన్ సహకారంతో పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సంద ర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రస గిస్తూ టిబి వ్యాధి సాధారణంగా ఒకరి నుండి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. టిబి వ్యాధి లక్షణాలు జ్వరం, తేమతో కూడిన దగ్గు దగ్గిన ప్పుడు రక్తం పడడం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకోవాలన్నారు. రోగికి మంచి పోషకాహారం అందించాలి అని తెలి పారు. 6 నుండి 8నెలల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుభశ్రీ, చందుప్రియ, విద్యా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాటర్ పైప్‌లైన్ మరమ్మతులకు వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గత నెల రోజుల నుండి లీకేజీ అవుతున్న వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని నాగారం– ఘట్ కేసర్ డివిజన్ వాటర్ వర్క్స్ మేనేజర్‌ను కోరారు. నాగారం గ్రామంలోని పోచమ్మ ముత్యాలమ్మ ఆలయం విలేజ్ రోడ్‌లో వాటర్ పైప్‌లైన్ లీకై నెల రోజులుగా నీరు వృధాగా పోతుందని, నీరు ప్రవహించ డంతో గుంత ఏర్పడిందని వాహన దారులు గుంతలో జారిపడిపోతున్నారని వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయా లని మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు వినతి పత్రం అందజేశారు.






## చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దు

### ఎంఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** తమ దుకాణాలు, ఇళ్ల నుండి వచ్చే చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని, అలాచేస్తే జరిమానాలు విధిస్తామని ఎంఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్ శ్రీహరి సూచించారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల' కార్యక్రమంలో భాగంగా చెత్త ఎక్కువగా పడేసే జివిపి పాయింట్స్ లేకుండా చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మంగ ళవారం సర్కిల్ పరిధిలోని జివిపి పాయింట్ల వద్ద చెత్త ఎత్తివేసి శుభ్రంచేసి చెత్త పడే అవకాశం ఉన్న ఇళ్లు, దుకాణాలనను గుర్తించి అక్కడి చెత్తను స్వచ్ఛ ఆటోలు సేకరించేందుకు అనుసంధానం చేశారు. మంగళవారం శానిటేషన్ విభాగ ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిఇ రవి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, సుధీర్, ఎస్ఎఫ్ఎ సుజాత, శిరీషలతో కల్సి పారిశుధ్య పనులు నిర్వహించారు. ఎఎస్ రావు నగర్‌లో జివిపి పాయింట్ క్లియర్ చేయటం, వంపుగూడలో రోడ్ల పక్కన ఉన్న రాళ్లను తొలగించటం, రాధికా చౌరాస్తాలో విద్యుత్ స్థంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించటం లాంటి పలు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ స్వచ్ఛ ఆటోల్లో చెత్తను అందిం చటం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.




## ఇంటి ఆవరణలో మహిళలు కూరగాయలు పండించాలి

### ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుమోహన్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రతి మహిళా తమ ఇంటి ఆవరణలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో కూరగాయలను ఇంటికి సరిపడా పండించుకోవాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండ లంలోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకం ద్వార శామీర్‌పేట మండలంలోని మహిళా గ్రూపులకు శిక్షణ కార్యక్ర మాన్ని ప్రాజెక్ట్ డైరక్టర్ మధుమోహన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వంట చేసే ముందు కూరగాయలను ఉప్పు నీటిలో పది నిమిషాలు ఉంచి కడిగి వాడుకున్నట్లయితే పురుగు మందుల అవశేషాలు తొలగిపోతాయని చెప్పారు. భూసార పరీక్షలు చేసిన తర్వాతనే పంటలు పండించాలని అన్నారు. అనంతరం మహిళా రైతులకు కిచన్ గార్డెన్ కూరగాయ ల విత్తనాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త దిలీప్, మండల వ్యవసాయాధికారి రమేష్, కౌన్సిలర్ సరసం వనజ అశోక్‌రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి , ఆత్మ బిటిఎం సంతోష్, ఎఇఒ సాగరిక, సిసి నాగశ్రీ, కోశాధికారి నర్మద, మహిళా మణులు పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా : బిఎల్‌ఆర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తాన ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కుషాయిగూడ పోచమ్మ దేవాలయం వద్ద స్టార్మ్ వాటర్ డ్రైన్, చక్రీపురంలో సిసి రోడ్డు పనులు, టీచర్స్ కాలనీలో సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసు కుని వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆ ర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, మహే ష్‌గౌడ్, రాఘవరెడ్డి,వెంకటేష్‌గౌడ్, అనిల్, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ పోసి నిప్పు అంటించి హతం

**ప్రజాపక్షం/పరిగి:** మండల పరిధిలోని రూప్‌సింగ్ తండాలో నేనావత్ హను మంతు తన కుటుంబ సభ్యులతో ఇంట్లో నిదిస్తున్న సమయంలో అతని పెద్ద భార్య కొడుకు నేనావత్ అనార్‌సింగ్ పెట్రోల్ , డీజిల్ పోసి నిప్పుఅంటించగా నేనావత్ హనుమంతు భార్య రమణిభాయ్‌కి ,కొడుకులు నేనావత్‌వెంకటేశ్‌కి గాయాలైనవి, వెంటనే చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ ఘటనపై పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ విలేకరుల సమావేశం నిర్వ హించారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం నేనావత్ హనుమంతు చిన్న కొడుకు శివ ఇచ్చిన ఫిర్యాదు మెరకు హనుమంతు మొదటి భార్య కొడుకు అనార సింగ్ ను పట్టుకొని విచారించగా తన తండ్రి హనుమంతు రైతుబందు డబ్బులు, భూమి గానీ ఇచ్చుటకు ఒప్పుకోలేదు. అట్టివిషయంలో ఇద్దరికీ కొంత కాలంగా ఆస్తి తగాదాలకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయని అనార్ సింగ్ తెలిపారు. తనకు ఆస్తిలో వాటా ఇవ్వడం లేదనే విషయాన్ని మనసులో పెట్టుకొని ఎలాగైనా తన తండ్రిని కుటుంబ సభ్యులను చంపేయాలనే ఉద్దేశం తోనే అర్థరాత్రి సమయంలో తన తండ్రి, రమణిబావ, వేంకటేష్ శివలు నిద్రపో తుండగా ముందుగా తలుపులను బయట నుండి గడియ పెట్టి ఇంటి పైకప్పు రంధ్రం ద్వారా ఇంటి లోపల నిద్రిస్తున్న వారిపై డీజిల్, పెట్రోల్ పోసి నిప్పు అంటించినానని విచారణలో రూప్‌సింగ్ ఒప్పుకున్నారని డిఎస్‌పి తెలిపారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ కు తరలించడం జరి గిందని తెలిపారు. కుటుంబ ఆస్తితగదాల విషయంలో ఇరువర్గాల వారు సామ రస్యంగా మాట్లాడుకోవాలని, క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి , ప్రాణ, ఆస్తి నష్టానికి పాల్పడవద్దని తెలిపా రు. రూప్‌సింగ్ తాండ గ్రామ సర్పంచు రమణిభాయ్ ఉన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐ శ్రీనివాస్‌రెడ్డి ,ఎస్ఐ మోహన్‌కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలని జిల్లా న్యాయాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాలభాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన కుషాయిగూడలోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాల త్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్, భూవివాదాల కేసులు పరిష్కరించు కోవాలని సూచించారు.

' శర్వానంద్ నటిస్తున్న మోస్ట్ స్పోర్ట్స్ & ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ బైకర్ ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించడం సినిమాపై మరింత బజ్ పెంచింది. ట్రైలర్ చూసిన ప్రభాస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ట్రైలర్ వైబ్ చాలా నచ్చింది. చాలా ఎంగ్జాట్ మెట్‌గా ఉంది. ఏప్రిల్ 3న థియేటర్లలో విడుదల. '



## 'పోలీస్ వారి హెచ్చరిక'...

## నిర్మాత బెల్లి జనార్ధన్ మృతి



తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బాబ్జీ దర్శకత్వంలో పోలీస్ వారి హెచ్చరిక చిత్రాన్ని నిర్మించి సినీ రంగ ప్రవేశం చేసిన బెల్లి జనార్ధన్ తుది శ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల చిత్ర దర్శకుడు బాబ్జీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచారు. అత్తగారి ఊరైన కట్టంగూరుకు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళిన బెల్లి జనార్ధన్ ఆ గ్రామంలో గల స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు నీటి అడుగుకు బలంగా తల తగిలి తీవ్రంగా గాయమవడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలారని దర్శకుడు బాబ్జీ తెలిపారు. స్వగ్రామమైన నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో మాజీ సైనికుడైన జనార్ధన్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 'పోలీస్ వారి హెచ్చరిక 'సినిమా యూనిట్ తరుపున, వ్యక్తిగతంగా నా తరుపున నిర్మాత బెల్లి జనార్ధన్ ఆకస్మిక మరణం పట్ల తీవ్రమైన దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలుపుకుంటున్నామని దర్శకుడు బాబ్జీ తెలిపారు.

## 28న చిచ్చుబుడ్డి రిలీజ్



అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో తొలిసారిగా మాస్, రగడ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు. డెకాయిట్ సెకండ సింగిల్ చిచ్చుబుడ్డి మార్చి 28న రిలీజ్ కానుంది. ఇది అదిరిపోయే డాన్సింగ్ నెంబరు. ఈ పాట కోసం బ్లాక్ బాస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. ఈ పాటలో అడివి శేష్ డాన్సింగ్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా ఉండబోతున్నాయి. ఈ మూవీని తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డెకాయిట్'కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్ రగడ విజువల్స్‌ను అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో ఆల్బమ్ అందిస్తున్నారు. ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది.

## సంబరాల ఏటిగట్టులో శ్రీకాంత్ పోస్టర్ రిలీజ్



మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టికల్ సంబరాల ఏటిగట్టు తో సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఈ చిత్రంలో సీనియర్ హీరో శ్రీకాంత్ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని బ్రిటిషు దొర పాత్రలో ప్రజెంట్ చేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ప్రతి గాయాన్ని ఒక పతకంలా ధరించే సైనికుడిగా ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయ కృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు.
తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతున్న సంబరాల ఏటిగట్టు ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ హిట్ గా నిలుస్తుందని నిర్మాతలు భావిస్తున్నారు.
సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి
డిజిపి వెట్రి పళనిసామి సంగీతం:
బి అజనీష్ లోక్‌నాథ్,
ఎడిటర్: నవీన్ విజయ కృష్ణ, ఫట్స్: కెవిన్ మాస్టర్.

## 'దీవాన'లో లవ్‌సాంగ్‌ను రిలీజ్ చేసిన సమంత



### ఆల్ టైం గ్లోబల్ రికార్డ్ సృష్టించిన ధురందర్

జియో స్టూడియోస్ బి62 స్టూడియోస్ నిర్మాణంలో ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన ధురంధర్ రివెంజ్, బాక్సాఫీస్ చరిత్రను తిరగరాసింది. ఇది ఆల్ టైం గ్లోబల్ ఇండియన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, అపూర్వమైన ఓపెనింగ్ వీకెండ్‌ను అందించి, ప్రపంచవ్యాప్తంగా కొత్త రికార్డులను నెలకొల్పింది. అసాధారణమైన అడ్వాన్స్ బుకింగ్‌లు, అన్ని సర్క్యూట్‌లలో హౌస్‌ఫుల్ అయిన షోలు, ఈ ఫ్రాంచైజీ తదుపరి భాగం కోసం ఉన్న అసాధారణమైన అంచనాల కారణంగా, ఈ చిత్రం దేశీయంగా, విదేశాలలో ఆల్ టైం అత్యధిక వసూళ్లను సాధించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఒక భారతీయ చిత్రానికి ఇదే అతిపెద్ద ఓపెనింగ్ వీకెండ్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా బిగ్గెస్ట్ హిందీ బ్లాక్‌బస్టర్ అయిన 'ధురందర్' సాధించిన అద్భుతమైన విజయ పరంపరను కొనసాగిస్తూ, ఈ సీక్వెల్ ఫ్రాంచైజీని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది. అత్యధిక పెయిడ్ ప్రివ్యూలు, ప్రపంచవ్యాప్తంగా ఏ భారతీయ చిత్రానికైనా అత్యధిక ఓపెనింగ్ వీకెండ వసూళ్లతో ఇది చరిత్ర సృష్టించింది. కేవలం ఓపెనింగ్ వీకెండ్‌లోనే ప్రపంచవ్యాప్తంగారూ.761 కోట్ల భారీ వసూళ్లతో ధురందర్ రివెంజ్ ప్రపంచ వేదికపై భారతీయ సినిమాకు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది.



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. 'దీవాన' సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈరోజు ఈ చిత్రం నుంచి ప్రేమ సాంగ్‌ను స్టార్ హీరోయిన్ సమంత చేతుల మీదుగా సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. అనంతరం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకులు వెంకీ అట్లూరి, రవికిరణ్ కోలా, నందినిరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూ నందినీరెడ్డి నేను ప్రొడ్యూసర్ కావాలని బాగా ఎంకరేజ్ చేశారు. డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ ఫస్ట్ ఫిలిం అనేది ఎప్పుడూ ప్రత్యేకమే. చెప్పాలంటే ఇది మీ తొలి ప్రేమ. ఫస్ట్ లవ్ కు ఫస్ట్ సినిమాకు పెద్ద తేడా ఉండదు. మీ ప్రేమంతా ఈ సినిమాలో కనిపించింది.

## బైకర్ ట్రైలర్‌పై ప్రభాస్ ప్రశంసలు

శర్వానంద్ నటిస్తున్న మోస్ట్ స్పోర్ట్స్ & ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ బైకర్ ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించడం సినిమాపై మరింత బజ్ పెంచింది. తాజాగా విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ థియేటర్లలో ప్రీమియర్ అవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. విజువల్ ప్రెజెంటేషన్, ఎమోషనల్ డెప్త్, టెక్నికల్ క్వాలిటీ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ట్రైలర్ చూసిన ప్రభాస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ట్రైలర్ వైబ్ చాలా నచ్చింది. చాలా ఎంగ్జాట్ మెట్‌గా ఉంది. శర్వా, యువి మొత్తం టీమ్‌కు ఆల్ ది బెస్ట్. ఏప్రిల్ 3న భారీ సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను. ప్రభాస్ నుంచి అభినందనలు రావడంతో సినిమాపై ఉన్న హైప్ మరింత పెరిగింది. ఈ ట్రైలర్‌లో స్పోర్ట్స్ డ్రామా ఎనర్జీ, ఎమోషనల్ ఎలిమెంట్స్, రగడ విజువల్ టోన్.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. దర్శకుడు అభిలాష్ రెడ్డి కథని అద్భుతంగా ప్రెజెంట్ చేసిన తీరు ప్రత్యేకంగా ప్రశంసలు అందుకుంటోంది. బైకర్‌లో శర్వానంద్ మోటార్‌సైకిల్ రేసర్‌గా ఒక ఎనర్జిటిక్‌గా కనిపించబోతున్నారు. సీనియర్ నటుడు రాజశేఖర్ కథలో కీలక పాత్రలో నటిస్తున్నారు. హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తోంది. బైకర్ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది.



## ఏడాది చివరి నాటికి 'భద్రకాళి' పనులన్నీ పూర్తిచేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయ పనులన్నీ వచ్చే తొమ్మిది నెలల్లో పూర్తి చేసి ఘన వైభవం తీసుకొస్తామని ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శాసనమండలి మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. ఆలయం పనుల విషయంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనేక సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసారు. ఆలయాన్ని సందర్శించి అధికారులకు ఎన్నో సూచనలు చేసారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న అమ్మవారి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఆలయ మాడా వీధులు, ప్రహరీ నిర్మాణం, గార్డెనింగ్ పనులు, స్థానిక ప్రజలకు సౌకర్యాల కల్పనలో ఎక్కడా లోపాలు రాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుని ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తుందని తెలిపారు. పనులన్నీ వేగంగా పూర్తయ్యేలా చూస్తాం. పూర్తి చేసి చూపిస్తాం అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం భద్రకాళి ఆలయం మాస్టర్ ప్లాన్ పేరుతో రూ.30 కోట్లు కేటాయిస్తున్నట్టు జీఓలు ఇచ్చింది. నిధులు మాత్రం విడుదల కాలేదు. మాస్టర్ ప్లాన్ ఎక్కడుందో అక్కడే మిగిలి పోయింది. ఇప్పుడు మేం అవసరమైన నిధులు కేటాయించాం. ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అని శ్రీధర్ బాబు వివరించారు.

## కెటిఆర్, అరవింద్‌లకు సమన్లు

(మొదటి పేజీ తరువాయి)



ప్రక్రియలో సుమారు రూ.55 కోట్ల నిధుల బదిలీపై అవినీతి, నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో ఈ కేసు నమోదైంది. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కెటిఆర్ సూచనల మేరకు, ఇతర అధికారులు ఫైల్‌ను ప్రాసెస్ చేసి, విదేశీ సంస్థకు నిధులు బదిలీ చేశారని ఎసిబి తన చార్జ్‌షీట్‌లో సాక్ష్యాధారాలను పొందుపర్చింది. ముఖ్యంగా, ఈ నిర్ణయాలు 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమల్లో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమయంలో తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2గా ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్, ఎ3గా మాజీ హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డి లను ప్రధాన నిందితులుగా ఎసిబి తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. వీరు కలిసి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి, క్రిమినల్ కాన్స్పిరసీకి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తు సమయంలో ఎసిబి అధికారులు డిజిటల్, ఆర్థిక ఆధారాలు సేకరించి పలుమార్లు విచారణ చేపట్టారు. అయితే ఛార్జ్‌షీట్ దాఖలు ప్రక్రియలో కీలక అడ్డంకిగా అనుమతుల సమస్య మారింది. ప్రజాప్రతినిధులు, ఐఎఎస్ అధికారులపై కేసు పెట్టాలంటే గవర్నర్, కేంద్ర ప్రభుత్వ అనుమతులు అవసరం కావడంతో కేసు కొంతకాలం ఆలస్యమైంది. తాజాగా కేంద్రం నుంచి అరవింద్ కుమార్‌పై ప్రాసిక్యూషన్ అనుమతి లభించడంతో పాటు, గవర్నర్ ఇప్పటికే కెటిఆర్‌పై అనుమతి ఇవ్వడంతో అన్ని అడ్డంకులు తొలగాయి. దీంతో ఎసిబి అధికారులు ఛార్జ్‌షీట్ దాఖలు మార్గసుగమనమైంది. ఛార్జ్‌షీట్‌లో క్రిమినల్ కుట్ర, అవినీతి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, క్విట్ ప్రోకో వంటి ఆరోపణలు ప్రధానంగా ఉన్నాయి. హెచ్‌ఎండిఎ కు భారీ ఆర్థిక నష్టం జరిగినట్లు కూడా పేర్కొనన్నున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసిన ఈ కేసు, ఇప్పుడు కోర్టులో విచారణ దశలోకి వెళ్లడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం–ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రతియుత్తరాలు కొనసాగుతున్న వేళ, ఛార్జ్‌షీట్ తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశముంది.

## ప్రతిఘటిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో వేలాది మంది సిపిఐ కార్యకర్తలు, గుడిసెవాసులు పాల్గొన్నారు.

**పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకూ సిపిఐ విశ్రమించబోదు : కూనంనేని సాంబశివరావు**



ప్రభుత్వ, భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఆ స్థలాలు దక్కే వరకు సిపిఐ విశ్రమించబోదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడితే అడ్డుకోవడానికి అవసరమైతే సిపిఐ న్యాయకత్వం ఆ గుడిసెల్లోనే నివాసం ఉండి కరాపాడుతుందన్నారు. గుడిసెలవాసుల పోరాటం వృధా కాబోదని, ఏ లక్ష్యంగా కోసం చలో అసెంబ్లీకి తరలి వచ్చారో వారి ఆశయాలన్నీ ఎర్రజెండాతో సాధించబడుతాయని స్పష్టం చేశారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందే భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసమని, దాదాపు 5 వేల మంది రక్త తర్పణంతోనే నేడు మనం అనుభవిస్తున్న తెలంగాణ అన్నారు. లక్షలాది ఎకరాల ప్రభుత్వ, భూదాన భూములను భూదోపిడీదారులు కొల్లగొట్టిన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటే రెండు, మూడు బడ్జెట్లకు సరిపోను నిధులు సమకూరుతాయని సాంబశివరావు అన్నారు. ప్రజా పాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సంతోషాన్ని ఇవ్వకుండా వారితో కన్నీళ్లు పెట్టించడం సరైంది కాదన్నారు. భూమి కోసం కమ్యూనిస్టులు చేస్తున్న భూ పోరాటం స్ఫూర్తితోనే వినోభాబావే భూదాన ఉద్యమాన్ని ప్రారంభించారని, ఆ భూములు పేదలకు దక్కాల్సిందేనన్నారు.

**గుడిసెలో ఉంటున్నవారు పేదలా? కాదా? తేల్చేందుకు సబ్ కమిటీ వేయండి : ఇ.టి. నరసింహ్మ**



మురికివాడల చట్టం ప్రకారం మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు చట్ట ప్రకారం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ్మ స్పష్టం చేశారు. పొట్ట కూటి కోసం కడుపు చేత పట్టుకుని నగరాలకు వలస వచ్చిన నిరుపేదలు గజం స్థలం కొనలేక, ఇంటి కిరాయి కట్టలేక కనీసం సౌకర్యాలకు కూడా నోచుకోకుండా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న వారు పేదలు కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక వేళ అనుమానం ఉంటే తక్షణమే సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఆ సభ్యులను గుడిసెల్లో మూడు రోజుల పాటు నివసించాలని ఆదేశించి తన అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. హైదరాబాద్ మహానగరంలో పేదల నివాసం కోసం 5 లక్షలకు పైగా గుడిసెలు వేసిన పోరాట చరిత్ర సిపిఐదన్నారు. పేదలకు న్యాయం చేయకపోతే రానున్న మూడు కార్పొరేషన్ల ఎన్నికలలో సిపిఐ తన సత్తా ఏమిటో చూపుతుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.



**గుడిసెలు తొలగించేందుకు కుట్రలు చేసినా బెదరం : ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**



ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు అనేక కుట్రలు చేసినా, చివరికి తగలబెట్టినా అదరక బెదరబోమని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్లు గడుస్తున్నా పేదవారికి ఉండడానికి ఇళ్లు లేకపోవడం ఈ ప్రభుత్వాలకు సిగ్గు చేటన్నారు. పేదల ఇళ్లపై అనేక ఆంక్షలను విధిస్తున్న ప్రభుత్వం అదే బడాబాబులు ప్రభుత్వ భూములను కబ్జా చేసిపెద్ద పెద్ద భవనాలు నిర్మించుకున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. అక్రమణ పేరుతో పేదలు, మధ్య తరగతి ఇళ్లను తొలగిస్తున్న హైడ్రా అదే పెద్దల నిర్మాణాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గుడిసెవాసుల పట్టాల కోసం శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు ప్రజా ఉద్యమాలను నిర్మిద్దామన్నారు.

**ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఎర్రజెండా దించేది లేదు : చాడ వెంకట్ రెడ్డి**

పేదలు గజం స్థలం కోసం ఏళ్ల తరబడిగా పోరాటాలు చేయాల్సి వస్తోందని, దానిని సాధించుకునే వరకు ఎర్రజెండా దించేదిలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటే ... బతుకు తెలంగాణ కావాలని నినదించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. సామాజిక సర్వే చేపట్టి అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ మాటలు ఒక విధంగా, చేతలు మరో విధంగా ఉంటున్నాయన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వం మరి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇళ్లు నిర్మించి స్తారన్న వాగ్ధానాన్ని నమ్మి ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం రెండు స్థానాలు మినహా అన్ని స్థానాలు కాంగ్రెస్ గెలుపొందడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవీంద్రచారి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కూంట్లూరులో 70 ఎకరాల భూదాన భూముల్లో 8 వేలమంది నిరుపేదలు గుడిసెలువేసుకుని నివసిస్తుంటే కనీసం అవసరాలపై మంచినీరు, విద్యుత్, కూడ కల్పించకోపోగా, దాతల సహకారంతో సోలార్‌ను దీపాల కింద విద్యార్థులు చదువుకుంటుటే దానిని కూడా అధికారులు ఒర్వలేక అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చే శారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్.బోస్, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి కార్యదర్శి పాలమాకు ల జంగయ్య, మేడ్చల్ జిల్లా సమితి కార్యదర్శి ఇ.ఉమామహే శ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యులు రామస్వామి, తెలంగాణ రాష్ట్ర మహిళా స మాఖ్య ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

**దద్ధరిల్లిన ధర్నా చౌక్**



సిపిఐ కార్యకర్తలు, గుడిసె వాసుల నినాదాలతో ధర్నా చౌక్ దద్ధరిల్లింది. చలో అసెంబ్లీ పేరుతో వేలాదిగా తరలివచ్చిన గుడిసెవాసులు ప్రభుత్వ, భూదాన భూముల్లో నివసిస్తున్న పేదలకు ప్రభుత్వ తక్షణమే పట్టాలు ఇవ్వాలని నినందించారు. ఉంటే భూమిపై ఉంటాం... లేకపోతే జైల్లో ఉంటామని వారు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. మరో వైపు ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా నేతృత్వంలో కళాకారులు గుడిసెవాసుల సమస్యలపై ఆలాపించిన పాటలతో ఆకట్టుకున్నాయి. గుడిసెవాసుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను పాటల రూపంలో కళ్లకు కట్టారు.

## అదరం, బెదరం

(మొదటి పేజీ తరువాయి)



భూములను కొల్లగొట్టినా వారి జోలికి మాత్రం వెళ్లడంలేదన్నారు. నగరానికి బతుకు దెరువు కోసం వచ్చిన నిరుపేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వానికి కూడా అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, అందుకే ఆ పార్టీ ఓడిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంభిస్తే అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇళ్ల కేటాయింపులో పారదర్శకత లోపించిందన్నారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లను కేటాయిస్తున్నారని, వెంటనే ప్రబుత్వం ఆ పద్ధతిని మార్చుకుని అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని, లేకపోతే గ్రామ సభల్లో ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ, భూదాన భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి ప్రత్యేక కోటా కింద ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com